అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదివారం 23-4-2023

www.navatelangana.com

సంపుటి : 9 | సంచిక : 54 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, | 10 పేజీలు +సోపతి (వెబ్‌లో) | వెల : 8.00



ముగిసిన రంజాన్ వేడుకలు

నెలరోజులపాటు ఉపవాస దీక్షలు వివరాలు 5లో..

- చార్మినార్, మక్కా మసీదు వద్ద ముస్లిం సోదరుల ప్రార్థనలు

ఐకేపీ వీవోఏల సమస్యలను పరిష్కరించండి

- సమ్మెను విరమింపచేయండి
- సీఎం కేసీఆర్‌కు తమ్మినేని లేఖ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఐకేపీ వీవోఏల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తద్వారా వారు చేస్తున్న సమ్మెను విరమింపజేయాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు శనివారం ఆయన లేఖ రాశారు. రాష్ట్ర వ్యాప్తంగా 17,608 మంది ఐకేపీ వీవోఏలు గత 20 ఏండ్లుగా ...5లో

పీఎస్‌ఎల్వీ -సీ55 రాకెట్ ఘనవిజయం

- షార్‌లో అంబరాన్నంటిన సంబురాలు




సూళ్లూరుపేట : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ షార్ నుంచి పీఎస్‌ఎల్వీ -సీ55 రాకెట్ ప్రయోగం ఘన విజయం సాధించింది. ఉమ్మడి నెల్లూరు జిల్లా సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి శనివారం మధ్యాహ్నం 2 గంటల 20 నిమిషాలకు ఇస్రో పీఎస్‌ఎల్వీ -సీ55 రాకెట్ ద్వారా సింగపూర్‌కు చెందిన టెల్ ఇయోస్-2 ఉపగ్రహాన్ని నింగిలోకి పంపింది. 741 కిలోల బరువు కలిగిన సింగపూర్ ఉపగ్రహంతో పాటు ...5లో

పాఠ్యాంశాలను తొలగించి చరిత్రను వక్రీకరించలేరు

పుస్తకాలను మేమే స్వతంత్రంగా ముద్రిస్తాం

- కేరళ ఎల్లప్పుడూ లౌకిక, రాజ్యాంగ విలువలను కాపాడుతుంది : రాష్ట్ర విద్యా శాఖ మంత్రి శివన్‌కుట్టి



న్యూఢిల్లీ : నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) తొలగించిన పాఠ్యాంశాలను బోధించడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరిస్తే తామే పుస్తకాలను స్వతంత్రంగా ముద్రించుకుంటామని కేరళ విద్యా శాఖ మంత్రి వి శివన్‌కుట్టి అన్నారు. కేరళ ఎల్లప్పుడూ లౌకిక, రాజ్యాంగ విలువలను కాపాడుతుందన్నారు. ఎన్‌సీఈఆర్‌టీ తొలగించిన పాఠ్యాంశాలను బోధించాలని తాము గట్టిగా నమ్ముతున్నామన్నారు. ఎన్‌సీఈఆర్‌టీ పాఠశాల పాఠ్యపుస్తకాల నుంచి కొన్ని భాగాలను మినహాయించాలనే నిర్ణయంపై రాజుకున్న వివాదం మధ్య కేరళ విద్యా శాఖ మంత్రి వి శివన్‌కుట్టి మాట్లాడారు. కొచ్చిలో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ మొఘల్ శకం, గుజరాత్ అల్లర్ల వంటి చరిత్రలోని కొన్ని భాగాలను పాఠ్యపుస్తకాల నుంచి వదిలివేయడం తప్పు అన్నారు. రాజకీయ మార్గాలకు అనుగుణంగా చరిత్రను మార్చే చర్యను ఆయన ఖండించారు. 'ఎన్‌సీఈఆర్‌టీ చేసిన పని మాకు ఆమోదయోగ్యం కాదు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రాష్ట్రం పాఠ్యపుస్తకాలను ముద్రించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కేంద్రం తన ఆలోచనలను ఇలా రాష్ట్రాలపై రుద్దడానికి వీల్లేదు. మేం ప్రత్యామ్నాయాలను చూసుకోవాల్సి వస్తుంది' అని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రాలకు తగిన ప్రాతినిధ్యం కల్పిస్తూ ఎన్‌సీఈఆర్‌టీ బోర్డును కేంద్రం పునర్నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఇటీవల కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కూడా ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యాంశాలను తొలగించే చర్యను తప్పుపడుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. 'పాఠ్యపుస్తకాల నుంచి వాటిని తొలగించడంతో చారిత్రక వాస్తవాలను మీరు తిరస్కరించలేరు. సంఘ్ పరివార్ తన అసలు రంగును బయటపెడుతున్నది. చరిత్రపై నిరంతరం భయంతో సంఘ్ పరివార్ జీవిస్తోంది. వారు చరిత్రను తిరగరాయడానికీ, అబద్ధాలతో కప్పిపుచ్చడానికి ప్రయత్నిస్తున్నారు' అని విజయన్ తెలిపారు. 'పాఠశాల పుస్తకాలను కాషాయీకరణ చేయడం ఈ చర్య వెనుక అసలు లక్ష్యం. అన్ని ప్రజాస్వామ్య శక్తులు దీనిని వ్యతిరేకించాలి' అని ఆయన పేర్కొన్నారు.

విద్యలో మూఢత్వం పెంచడమే : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



సీబీఎస్‌ఈ పదో తరగతి పాఠ్యాంశాల నుంచి డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించడమంటే విద్యలో మూఢత్వాన్ని పెంచడమేనని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) విమర్శించింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ ఎల్ మూర్తి, టి నాగరాజు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యారంగంపై ఆర్ఎస్ఎస్ డైరెక్షన్‌లో బీజేపీ ప్రభుత్వం దాడి చేస్తున్నదని విమర్శించారు. ఇటీవల 12వ తరగతి పాఠాలు తొలగించిన ఎన్‌సీఈఆర్టీ తీరు ఈ దేశంలో సైన్స్ విద్యకు, దేశ భవిష్యత్తుకు గొడ్డలిపెట్టుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో విద్యను మూఢత్వంలోకి నెట్టి కాషాయీకరణ పెంచే ప్రయత్నం జరుగుతున్నదని విమర్శించారు. జాతీయోద్యమ వీరులు, హిందూ, ముస్లిం ఐక్యతను, గాంధీ హత్యవంటి సబ్జెక్టులు తొలగించడం ఎంత వరకు సమంజసమని ...2లో

జమ్ముకాశ్మీర్‌లోని పుల్వామాలో 2019 ఫిబ్రవరిలో జరిగిన ఉగ్రవాద దాడిలో 40 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు అమరులయ్యారు. అమర వీరులకు దేశమంతా ఘనంగా నివాళులు అర్పించింది. పుల్వామాలో జరిగిన ఈ దారుణానికి కారణమెవరు ? సీఆర్‌పీఎఫ్ జవాన్లను కాపాడుకోవడంలో ఎందుకు విఫలమయ్యాం? వంటి ప్రశ్నలు ఆనాడే తలెత్తాయి. అయినా వీటికి పాలకులు సరైన సమాధానం ఇవ్వలేదు. ఈ ఘటన జరిగి నాలుగు సంవత్సరాలు దాటినా ఇప్పటికీ ఆ ప్రశ్నలకు జవాబులు లేవు. మౌనమే బీజేపీ ప్రభుత్వ సమాధానం అవుతోంది.

ప్రభుత్వ రక్షణ లేకుండా రెండున్నర వేల మంది సైనికులు ఆ రోడ్డు మీదుగా ఎందుకు ప్రయాణించారు? ఉగ్రవాద దాడి జరుగుతుందని ప్రభుత్వానికి ముందస్తు సమాచారం ఏమైనా ఉన్నదా? సైనికులను విమానాల ద్వారా తరలించేందుకు ఎందుకు నిరాకరించారు? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానాలు చెప్పాల్సిన బాధ్యత ఎన్నికైన ప్రజా ప్రభుత్వానికి లేదా? వాస్తవాన్ని చెప్పేందుకు నిరాకరించడం అంటే ప్రజాస్వామ్య సూత్రాలను నీరుకార్చడమే అవుతుంది.



నోరు విప్పరేం...?

ఆ ప్రశ్నలకు జవాబేది ? | **ప్రశ్నిస్తే ఎదురుదాడేనా?** | **పుల్వామాపై నేటికీ పెదవి విప్పని మోడీ ప్రభుత్వం**

న్యూఢిల్లీ : పుల్వామా ఘటన జరిగిన సమయంలో జమ్ముకాశ్మీర్ గవర్నర్‌గా పనిచేసిన సత్యపాల్ మాలిక్ ఇప్పుడు ఆ తేనెతుట్టెను మళ్లీ కదిలించారు. ఆయన లేవనెత్తిన అంశాలు దేశ భద్రత, ప్రభుత్వ సమర్థతకు సంబంధించి అనేక తీవ్రమైన ప్రశ్నలను జాతి ముందు ఉంచాయి. అయినప్పటికీ ప్రభుత్వం అప్పటి మాదిరిగానే ఇప్పుడూ మౌనాన్ని ఆశ్రయించడం దేశ ప్రజలను ఆందోళనకు, కలవరపాటుకు గురిచేస్తోంది. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ అంశంపై ఎలక్ట్రానిక్ మీడియా కూడా నోరు విప్పకపోవడం మరింత ఆందోళన కలిగించే విషయం. పుల్వామా ఘటనను ఏ విధంగా నివారించి ఉండేవారమో సత్యపాల్ మాలిక్ స్పష్టంగా చెప్పారు. సైనికుల భద్రతను ఫణంగా పెట్టి ఉండకపోతే ఈ సంఘటన జరిగి ఉండేదే కాదని ఆయన కుండబద్దలు కొట్టారు. ఉగ్రవాద కార్యకలాపాలు అధికంగా కన్పించే ప్రాంతంలో...మనుష్య సంచారం లేని రోడ్డు మీద...సైనిక వాహనాలు పెద్ద సంఖ్యలో ప్రయాణించడాన్ని ఆయన తప్పుపట్టారు. జవాన్ల కోరిక మేరకు వారిని విమానాలలో తరలించి ఉంటే ఈ ముప్పు జరిగేదే కాదని సత్యపాల్ చెప్పారు. ఆయన చెప్పిందే నిజమైతే తన నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు కేంద్రం చేసిన ప్రయత్నాలు, సైనికుల భద్రత విషయంలో దాని అలసత్వం తేటతెల్లమవుతున్నాయి.

పుల్వామా ఘటనలో కేంద్రం వైఫల్యాన్ని సత్యపాల్ మాలిక్ ఎండగట్టగానే బీజేపీ నాయకులంతా ఆయనపై ముప్పేట దాడి మొదలు పెట్టారు. ఆయన విశ్వసనీయతను ప్రశ్నించారు. అంతేకానీ ఆయన చెప్పింది అవాస్తవమని అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. లేదా పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటుచేసి ఆయన లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాలూ ఇవ్వలేదు. అవి సత్యపాల్ వేసిన ప్రశ్నలు మాత్రమే కాదు... దేశంలోని ప్రతి పౌరుడు సంధించిన ప్రశ్నలు. అయినప్పటికీ దేశ భద్రతకు సంబంధించిన కీలకమైన ప్రశ్నలకు కేంద్రం సమాధానం ఇవ్వలేదు. చెవిటివాని ముందు శంఖం ఊదిన చందంగా వ్యవహరించింది. 'నోరు విప్పవద్దు' అంటూ ఆనాడు సత్యపాల్‌కు ప్రధాని మోడీ హుకుం జారీ చేశారు. ఇప్పుడు దేశంలో లోపించిన పారదర్శకత విషయంలో ప్రశ్నించినా కేంద్రం అదే మాట చెబుతోంది. దేశ భద్రత, ఇంటెలిజెన్స్ వైఫల్యంపై మాట్లాడకుండా సత్యపాల్ నోరు మూయించేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నించడాన్ని చూస్తుంటే అసలు ఆ విషయాలకు అది ఏ మాత్రం ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నది అర్థమవుతుంది. ఎన్నికలలో విజయం సాధించడం ఒక్కటే దాని లక్ష్యం. నెపాన్ని గవర్నర్ పైన నెట్టి, జవాబుదారీతనం నుంచి తప్పించుకునేందుకు ప్రభుత్వం విశ్వప్రయత్నం చేసింది. పారదర్శకత, జవాబుదారీతనం అనేవి ప్రజాస్వామ్యంలో ...5లో

నిర్బంధంలో సత్యపాల్ మాలిక్ !

- 25 మంది రైతు సంఘాల నేతలు కూడా
- మాలిక్ మద్దతుదారుల ఆందోళన

వివరాలు 5లో..

హోం మంత్రి ఇంటికి సీఎం..

రంజాన్ వేడుకల్లో పాల్గొన్న కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ ఇంటికి సీఎం కేసీఆర్ వెళ్లారు. హోం మంత్రి నివాసంలో నిర్వహించిన రంజాన్ వేడుకల్లో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహమూద్ అలీ కుటుంబ సభ్యులకు కేసీఆర్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. సాంప్రదాయపద్ధతిలో వారు ఏర్పాటు చేసిన ఆతిథ్యాన్ని తన వెంట వచ్చిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితర ప్రజాప్రతినిధుల బృందంతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా రంజాన్ మాసంలో ఆచరించే పవిత్ర ఉపవాస దీక్షలు, జరిపే దైవ ప్రార్థనలు, ఆసందర్భంగా పెంపొందే క్షమాగుణం, కరుణ, ప్రేమ తదితర ఆధ్యాత్మిక భావనలతోపాటు రంజాన్ పండుగ ప్రాశస్త్యం గురించి సీఎం స్మరించుకున్నారు. ఇవే అంశాలపై తన వెంట వచ్చిన మంత్రులు, ప్రజాప్రతినిధులు, ముస్లిం పెద్దలతో ఆయన కాసేపు ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఈ సందర్భంగా తనకు పండుగ శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన పలువురు ...2లో

కేసీఆర్‌తో ఎలాంటి లాలూచీ లేదు

భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద ప్రమాణం చేసి చెప్తున్నా..

- మునుగోడు ఉప ఎన్నికల్లో ఏం జరిగిందో అందరికీ తెలుసు
- ఆధారాలు లేకుండా ఈటల ఎలా ఆరోపణలు చేస్తారు? : టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి



నవతెలంగాణ-ధూల్ పేట్

"కేసీఆర్‌తో నాకు ఎలాంటి లాలూచీ లేదు.. భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆలయం వద్ద ప్రమాణం చేసి చెప్తున్నా.. మునుగోడు ఉప ఎన్నికల్లో ఏం జరిగిందో అందరికీ తెలుసు.. ఆధారాలు లేకుండా మాజీ మంత్రి ఈటల రాజేందర్ ఎలా ఆరోపణలు చేస్తారు..?" అని కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షులు ...5లో

దేవుళ్లపై ప్రమాణం చేసే సంప్రదాయాన్ని పాటించట్లేదు

- రేవంత్ సవాల్‌పై ఈటల స్పందన

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



దేవుళ్లపై ప్రమాణం చేసే సంప్రదాయాన్ని పాటించట్లేదని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. రేవంత్ విషయంలో తగిన సమయంలో జవాబిస్తానని ...2లో

అధికారిక బంగ్లాను ఖాళీ చేసిన రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ : పరువునష్టం కేసులో రెండేళ్ల జైలు శిక్ష పడిన కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఢిల్లీలో తన అధికార నివాసాన్ని శనివారం ఖాళీ చేశారు. ఢిల్లీ ప్రభుత్వ బంగ్లాలో రాహుల్ 2005 నుంచి ఉంటున్నారు. ఇటీవల రాహుల్ లోక్‌సభ సభ్యత్వాన్ని పార్లమెంట్ రద్దు చేసిన సంగతి తెలిసిందే. బీజేపీ ఎంపీ సిఆర్ పాటిల్ నేతృత్వంలోని లోక్‌సభ హౌసింగ్ కమిటీ.. ఈ నెల 22లోగా భవనాన్ని ఖాళీ చేయాల్సిందిగా రాహుల్ గాంధీకి లేఖ పంపిన సంగతి తెలిసిందే. దీంతో 12 తుగ్లక్ లేన్ బంగ్లాను రాహుల్ నేడు ఖాళీ చేశారు. మోడీ ప్రభుత్వం రాజకీయ కక్షతో వ్యవహరిస్తోందని కాంగ్రెస్ ధ్వజమెత్తింది. వాస్తవానికి పరువునష్టం కేసులో గుజరాత్ కోర్టు తిరిగి దరఖాస్తు చేసుకునేందుకు రాహుల్‌కు 30 రోజుల గడువు ఇచ్చింది. అయితే శుక్రవారం ఆయన సూరత్ సెషన్స్ కోర్టును ఆశ్రయించినా.. అక్కడ ఊరట లభించలేదు. సూరత్ కోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ.. ఇప్పుడు రాహుల్ గాంధీ గుజరాత్ హైకోర్టు లేదా సుప్రీంకోర్టుకు వెళ్లాల్సి ఉంటుంది.

రైలు..దిగులు..!



యాదాద్రి పవర్ ప్రాజెక్టుపై అదానీ కన్ను!

- డోర్నకల్- మిర్యాలగూడ వరకు రైల్వేలైన్‌కు సర్వే
- కోల్పోనున్న భూములు, ప్లాట్లు, ఇండ్లు
- సర్వేను అడ్డుకుంటున్న ఖమ్మం నిర్వాసితులు



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ప్రధాని నరేంద్రమోడీకి అత్యంత ఆత్మీయుడు గౌతమ్ అదానీ సామ్రాజ్యం ఖమ్మం జిల్లా వరకొచ్చింది.. గ్రీన్‌ఫీల్డ్ హైవేలు, రోడ్లు, నూతన రైలుమార్గాలు, పవర్ ప్రాజెక్టుల రూపంలో ప్రభుత్వ, ప్రయివేట్ భూములు, ఆస్తులను కారుచౌకగా కాజేస్తున్న అతను.. తాజాగా నల్లగొండ జిల్లా మిర్యాలగూడ సమీపంలోని యాదాద్రి పవర్ ప్రాజెక్టుపై కన్నేసినట్టు తెలుస్తోంది. దీన్ని నయానో భయానో హస్తగతం చేసుకుంటే విద్యుదుత్పత్తికి కావాల్సిన బొగ్గు, ఇతరత్రా ఖనిజాలను సరఫరా చేసేందుకు నూతన రైల్వే మార్గం కోసం కేంద్రంతో ప్రయత్నాలు ముమ్మరం చేయించారు. ఇందుకు మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నుంచి మిర్యాలగూడ వరకు నూతన రైల్‌మార్గం నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే గతేడాది అక్టోబర్ 6వ తేదీన సర్వేకు అనుమతించింది. రైల్వే మంత్రిత్వశాఖ రూ.3 కోట్లు మంజూరు చేసింది. ఇప్పుడు ఈ సర్వే ఖమ్మం జిల్లా ప్రజానీకాన్ని ఆందోళనకు గురిచేస్తోంది.

జిల్లాలోని రఘునాథపాలెం మండలం మొదలు ఖమ్మం రూరల్, ముదిగొండ, నేలకొండపల్లి మండలాల మీదుగా సూర్యాపేట జిల్లా కోదాడ నుంచి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ వరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి అధికారులు సర్వే చేపడుతున్నారు. దీనిపై ఖమ్మం జిల్లాలో ఆందోళనలు జరుగుతున్నాయి. ఖమ్మం నగరానికి సమీపంలో స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) పరిధిలోని రూ.కోట్ల విలువ చేసే భూములు, ఇండ్లు, వెంచర్లు, ప్లాట్లు ఈ రైలుమార్గం కింద పోనున్నాయి. దాదాపు 300 అడుగుల వెడల్పుతో 90 కి.మీ పైగా నిర్మించే ఈ రైల్వేలైన్‌తో ఖమ్మం రూరల్ మండలంలోనే 800 ఎకరాల వరకు భూములు సేకరించనున్నట్టు అంచనా.


సర్వేను అడ్డుకుంటున్న నిర్వాసితులు

డోర్నకల్ నుంచి జిల్లాలోని మల్లెమడుగు రైల్వే స్టేషన్ మీదుగా ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెం, ముత్తగూడెం, ఏదులాపురం, మద్దులపల్లి, తెల్దారుపల్లి, ముదిగొండ, నేలకొండపల్లి మండలాల్లోని గువ్వలగూడెం, నేలకొండపల్లి, ఆచార్లగూడెం, కోనాయిగూడెం, బోదులబండ, రామచంద్రాపురం, పైనంపల్లి తదితర ...5లో

మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని ప్రయివేటీకరించొద్దు

- కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు మంత్రి హరీశ్ రావు లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



దేశ రక్షణ రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న మెదక్ సహా ఇతర ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలను ప్రయివేటు పరం చేయొద్దని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దేశ భద్రత, 74 వేల మంది ఉద్యోగులను దృష్టిలో ఉంచుకుని వెంటనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆయన కోరారు. ఈ మేరకు శనివారం కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు హరీశ్ రావు లేఖ రాశారు.

" డిఫెన్స్ రంగంలో ఉన్న ఏడు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరించటం ద్వారా ఆయా సంస్థల మధ్య పోటీ నెలకొంటుంది. దీంతో నూతన ఆయుధాల అభివృద్ధి నిలిచిపోతుంది. ఇది మేకిన్ ఇండియా స్ఫూర్తిని దెబ్బతీస్తుంది. మెదక్‌లోని ...5లో

నవతెలంగాణ

వేసవిలో విద్యుత్ సంక్షోభం ?

సౌర విద్యుత్ ఉత్పత్తే పరిష్కారమా..!





భానుడు భగ భగ మండి పోతున్నాడు. ఇంట్లో నుంచి అడుగు తీసి అడుగేయాలన్నా భయపడాల్సిన పరిస్థితి. మరోవైపు ఎండలు తీవ్రంగా ఉంటాయని వాతావరణ శాఖ,స్కైమెట్ సహా పలు అధ్యయనాలు మరింతగా దడపుట్టిస్తున్నాయి.వడగాలులతో ఇప్పటికే చనిపోయిన వారి సంఖ్య రెండంకెలకు చేరింది.దీనికి తోడు వేసవి ధాటికి విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోంది. అయితే సౌర విద్యుత్ ఉత్పత్తి ఎంతవరకు పరిష్కారమనే దానిపైనే పెద్ద చర్చ..

న్యూఢిల్లీ : దేశంలోని పలు ప్రాంతాలలో ఈ సంవత్సరం మార్చి నెలలోనే వేసవి తన ప్రతాపం చూపించింది. ఈ నెలలో అయితే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరుకున్నాయి. దీంతో విద్యుత్ సరఫరా పై ఒత్తిడి పెరిగింది. పెరుగుతున్న జనాభా, పట్టణీకరణ కారణం గా విద్యుత్ డిమాండ్ అధికంగా ఉంటోం ది. మరో వైపు రాత్రి సమయా లలో డిమా ండ్ కంటే సరఫరా 1.7 శాతం తక్కువగా ఉంది. రాత్రి సమయంలో గరిష్ఠంగా 217 గిగా వాట్ల (ఒక గిగా వాట్ అంటే బిలియన్ వాట్లు) విద్యుత్ డిమాండ్ ఉంటో ంది. ఇది గత సంవత్సరపు గరిష్ఠ డిమాండ్ కంటే 6.4 శాతం అధికం. ఈ దశలో సౌర విద్యుత్ ఉత్పత్తి పరిస్థితిని కొంత చక్కదిద్దే అవకాశం ఉంది. అయితే దానిని నిల్వ చేసే సామర్థ్యాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉంది. ఉక్రెయిన్‌లో యుద్ధం జరుగుతున్నప్పటికీ అక్కడ విద్యుత్ సరఫరాకు పెద్దగా ఆటంకం కలగకపోవడానికి కారణం సమర్ధవంతమైన నిర్వహణే. సౌర విద్యుత్ లభ్యత, నిల్వ సామర్థ్యం ఎక్కువ గా ఉంటే వినియోగ దారులు దాని వైపే మొగ్గు చూపే అవకాశం ఉంటుంది. దీనివల్ల గ్రిడ్‌పై ఒత్తిడి తగ్గుతుంది. బ్లాకౌట్‌లను నివారించవచ్చు.



కొందరికే సౌర విద్యుత్..

సౌర విద్యుత్ వినియోగించే ఆర్థిక స్తోమత కొందరికే పరిమిత మవుతోంది. సామాన్య,మధ్య తరగతి జనం మాత్రం మా ఖర్మ ఇంతేలే అంటూ బతుకీడిస్తూ.. కరెంట్ ఉన్నప్పుడు ఫ్యాన్‌తో ఉక్క నుంచి ఊరట చెందామని భావించటం సర్వసాధారణం. ఇక ఆదాయపరంగా వెసులుబాటు ఉన్న ఇండ్లల్లోనూ, కార్యాలయాల్లోనూ విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటోంది. ఇలాంటి చోట్ల సౌర విద్యుత్ ను వినియోగించు కోనే అవకాశాలు ఎక్కువ.

పగటి వేళ అధికంగా ఉత్పత్తి అయ్యే సౌర విద్యుత్‌ను బ్యాటరీలలో నిల్వ చేసి, దానిని రాత్రి సమయంలో ఉపయోగించుకోవచ్చు. సౌర విద్యుత్‌ను ఎక్కువగా ఉత్పత్తి చేసి, నిల్వ చేసినట్లయితే గ్రిడ్ విఫలమైనప్పటికీ దానిని ఉపయోగించుకోవచ్చు.

దీనివల్ల సరఫరా నష్టాన్ని తగ్గించవచ్చు. లోడ్‌ను పెంచి, స్థానిక విద్యుత్ నాణ్యతను నియంత్రించవచ్చు. దీనికితోడు ఉత్పత్తి చేసిన సౌర విద్యుత్‌ను గ్రిడ్‌తో అనుసంధానించవచ్చు. అయితే దీనంతటికీ కొంత సమయం పట్టే అవకాశం ఉంది.

బిజినెస్

గూగుల్ బాస్‌కు రూ.1,850 కోట్ల పారితోషికం

- సాధారణ ఉద్యోగితో పోల్చితే 800 రెట్లు అధికం
- మరోవైపు సిబ్బందికి ఉద్వాసన



న్యూఢిల్లీ: ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్‌లో పొదుపు చర్యల్లో భాగంగా ఓ వైపు వేలాది ఉద్యోగులను ఇంటికి పంపిస్తుండగా.. ఆ సంస్థ బాస్‌కు మాత్రం కళ్లు చెదిరిపోయే పారితోషకాన్ని అందిస్తోంది. గూగుల్ మాతృ సంస్థ అల్ఫాబెట్ సిఇఒ సుందర్ పిచాయ్ ఏకంగా 226 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 1,850 కోట్లు) పారితోషికం తీసుకున్నారని రిపోర్టులు వస్తున్నాయి. ఇది కంపెనీలో సగటు ఉద్యోగి వేతనంతో పోల్చితే 800 రెట్లు ఎక్కువగా కావడం విశేషం. ఈ పారితోషికంలో 218 మిలియన్ డాలర్ల విలువైన స్టాక్ అవార్డులను అందుకున్నారని అల్ఫాబెట్ శుక్రవారం రెగ్యులేటరీకి వెల్లడించింది. ఈ ఏడాది జనవరిలో 12వేల మంది ఉద్యోగులను తీసివేయనున్నట్లు ప్రకటించింది. మాంద్యం భయాల నేపథ్యంలో పొదుపు చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పేర్కొంది. ఇది ఆ కంపెనీ మొత్తం సిబ్బందిలో ఆరు శాతానికి సమానం. మరోవైపు గూగుల్ బాస్‌కు భారీగా ముడుతున్నప్పటికీ.. క్రింది స్థాయి ఉద్యోగులకు మాత్రం ప్రోత్సాహకాల చెల్లింపుల్లో మొండి చెయ్యి చూపిస్తున్నారు. ఉన్న సిబ్బంది బోనస్‌ల్లోనూ కోతలు విధించనున్నట్లు జనవరిలో పేర్కొంది. వ్యయాల నియంత్రణ కేవలం ఉద్యోగుల తొలగింపులతోనే ఆగిపోదని పిచాయ్ అప్పట్లో తెలిపారు. బాధ్యతాయుత నాయకత్వ హోదాల్లో పని చేస్తున్న ఉద్యోగుల బోనస్‌ల్లోనూ కోతలు పెట్టనున్నామన్నారు. ఉద్యోగులందరికీ ఈ ఏడాది బోనస్‌లు తగ్గుతాయని స్పష్టం చేశారు.

ఐసిఐసిఐ బ్యాంక్‌కు రూ.9,122 కోట్ల లాభాలు

ముంబయి : ప్రయివేటు రంగంలోని ఐసిఐసిఐ బ్యాంక్ 2023 మార్చి 31తో ముగిసిన త్రైమాసికంలో 30 శాతం వృద్ధితో రూ.9,121.87 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.7,018.71 కోట్ల లాభాలు నమోదు చేసింది. ప్రతీ ఈక్విటీ షేర్‌కు రూ.8 తుది డివిడెండ్‌ను ప్రకటించింది. 2022-23 మార్చితో ముగిసిన త్రైమాసికంలో బ్యాంక్ మొత్తం ఆదాయం 32 శాతం పెరిగి 36,108.88 కోట్లకు చేరింది. మొత్తం డిపాజిట్లు 10.9 శాతం పెరిగి రూ.11,80,841 కోట్లకు చేరాయి. నికర నిరర్థక ఆస్తులు 0.48 శాతానికి తగ్గాయి. ఇంతక్రితం డిసెంబర్ త్రైమాసికంలో ఇవి 0.55 శాతంగా ఉన్నాయి.

ఉడ్‌ఛలో నుంచి ఇవి 'వీర్ బైక్'



హైదరాబాద్ : కన్స్యూమర్ టెక్ సంస్థ ఉడ్‌ఛలో అధునాతన విద్యుత్ వాహనం 'వీర్‌బైక్'ను విడుదల చేసినట్లు ప్రకటించింది.పర్యావరణ అనుకూల, అందుబాటు ధరల్లో రవాణా అవకాశాలను ప్రతి ఒక్కరికీ అందించాలనే కంపెనీ ప్రయత్నాలలో ఇది ఓ భాగమని వీర్ బైక్ కో-ఫౌండర్, ఆర్అండ్‌డి హెడ్ సాహిల్ ఉత్తేకర్ తెలిపారు. "అత్యున్నత పనితీరు కనబరిచే విద్యుత్ సైకిల్ వీర్ బైక్. సౌకర్యవంతమైన, మృదువైన సవారీని ఇది అందిస్తుంది. అత్యంత కఠినమైన పరిస్థితులను సైతం తట్టుకునేలా తీర్చిదిద్దాము. రోజువారీ వినియోగానికి అత్యంత అనుకూలమైనది." అని సాహిల్ పేర్కొన్నారు. భారతీయుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని దీన్ని తయారు చేశామని ఉడ్‌ఛలో సిఇఒ రవి కుమార్ తెలిపారు. ఇది తమ వీర్‌బైక్ డాట్ కామ్‌లో విక్రయాలకు అందుబాటులో ఉంటుందన్నారు.

టాటా ఎఐఎ లైఫ్ నుంచి ఫార్చ్యున్ గ్యారంటీ పెన్షన్

న్యూఢిల్లీ : జీవిత బీమా కంపెనీల్లో ఒక్కటైన టాటా ఎఐఎ లైఫ్ ఇన్సూరెన్స్ కొత్తగా ఫార్చ్యున్ గ్యారెంటీ పెన్షన్‌ను విడుదల చేసింది. ఈ యాన్యుటీ (గ్యారెంటీడ్ ఇన్‌కమ్ ఫర్ లైఫ్) ప్లాన్‌లో అత్యధిక యాన్యుటీ రేట్లు, మరణ ప్రయోజనాలు ఉండటంతో వినియోగదారులు తమ గోల్డెన్ ఇయర్స్‌లో ఆర్థికంగా స్వేచ్ఛను పొందగలరని ఆ సంస్థ పేర్కొంది. "వినియోగదారులు ఖచ్చితంగా తమ రిటైర్‌మెంట్ తరువాత ఆర్థిక స్వేచ్ఛకు భరోసా కలిగి ఉండాలి. భవిష్యత్ కోసం ప్రణాళికలు చేసుకునే వివాహితులు, మహిళలు, వ్యక్తులతో పాటుగా ఎస్ఎంఇ వినియోగదారులకు ఈ ప్లాన్ అత్యంత అనుకూలంగా ఉంటుంది." అని టాటా ఎఐఎ లైఫ్ ఇన్సూరెన్స్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ సమిత్ ఉపాధ్యాయ్ పేర్కొన్నారు.

యెస్ బ్యాంక్‌కు కేటాయింపుల దెబ్బ

- క్యూ4 లాభాల్లో 45 శాతం పతనం

ముంబయి : యెస్ బ్యాంక్ లాభాలకు రాని బాకీలు గండికొట్టాయి. గడిచిన ఆర్థిక సంవత్సరం (2022-23) మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో యెస్ బ్యాంక్ నికర లాభాలు 45 శాతం పతనమై రూ.202 కోట్లకు పడిపోయాయి. 2022-23లో బ్యాంక్ స్థూల లాభాలు 32.7 శాతం తగ్గి రూ.717 కోట్లుగా నమోదయ్యాయి. గడిచిన క్యూ4లో బ్యాంక్ నికర వడ్డీపై ఆదాయం 15.4 శాతం పెరిగి రూ.2,105 కోట్లకు చేరింది. స్థూల డిపాజిట్లలో 10 శాతం వృద్ధి చోటు చేసుకుంది. వడ్డీయేతర ఆదాయం 22.8 శాతం పెరిగి రూ.1,082 కోట్లుగా నమోదయ్యింది. క్రితం క్యూ4లో మొండి బాకీల కోసం చేసే కేటాయింపులు 127 శాతం పెరిగి రూ.618 కోట్లకు చేరాయి. దీంతో లాభాలు తగ్గాయి. 2023-24 రుణాల మంజూరులో 15-20 శాతం వృద్ధి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని యెస్ బ్యాంక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రశాంత్ కుమార్ తెలిపారు. 2022-23లో కొత్తగా 3,000 మంది ఉద్యోగులను తీసుకున్నట్లు తెలిపారు. దీంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 27,517కు చేరిందన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా మెడికల్ కాలేజీకి ఎన్ఎంసీ ఒకే

- సీఎంకు మంత్రి కేటీఆర్ ధన్యవాదాలు
- ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి 100 ఎంబీబీఎస్ సీట్ల అడ్మిషన్లకు అనుమతి

నవతలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీలో ప్రస్తుత సంవత్సరం నుంచి అడ్మిషన్లకు అనుమతి లభించనుంది. ఈ నేపథ్యంలో ఆ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి, కే.తారక రామారావు జిల్లా ప్రజల తరపున సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో జిల్లాకో వైద్య కళాశాలను ఏర్పాటు చేయాలన్న లక్ష్యంలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాకు మెడికల్ కాలేజ్‌ని కేటాయించడంతోపాటు దానికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్న నేపథ్యంలో ప్రజలు ఎల్లప్పుడూ రుణపడి ఉంటారని కేటీఆర్ ఈ సందర్భంగా తెలియజేశారు.

తాజాగా సిరిసిల్ల మెడికల్ కాలేజీలో ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి ప్రవేశాలను చేపట్టేందుకు నేషనల్ మెడికల్ కమిషన్ ఫర్ మెడికల్ అసెస్మెంట్ అండ్ రేటింగ్ బోర్డ్ అనుమతినిచ్చింది. ఇందులో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజ్‌ను ప్రారంభించి, 100 ఎంబీబీఎస్ సీట్లకు అడ్మిషన్లను స్వీకరించనున్నారు. ఈ మేరకు జాతీయ మెడికల్ కమిషన్ జిల్లా మెడికల్ కాలేజీకి అనుమతిస్తూ ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేసింది.

హరీశ్ రావు హర్షం

100 ఎంబీబీఎస్ సీట్లతో రాజన్న సిరిసిల్లా జిల్లాలో మెడికల్ కాలేజీ ఏర్పాటుకు అనుమతి రావడం పట్ల వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ట్వీట్ చేశారు. తొమ్మిది మెడికల్ కాలేజీలకు గాను ఇప్పటి వరకు ఏడింటికీ అనుమతి వచ్చినట్టు ఆయన తెలిపారు. 24 ప్రభుత్వ మెడికల్ కాలేజీలతో జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలన్న సీఎం కేసీఆర్ లక్ష్యం విజయవంతంగా ముందుకెళ్తున్నదని పేర్కొన్నారు.

30న కానిస్టేబుల్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- 24 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి : టీఎస్ఎల్‌పీఆర్‌బీ చైర్మెన్ శ్రీనివాసరావు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

ఈనెల 30న జరిగే కానిస్టేబుల్, తత్సమాన పోస్టులకు తుది రాతపరీక్షకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) చైర్మెన్ వి.వి శ్రీనివాసరావు తెలిపారు. హైదరాబాద్‌తో పాటు శివారు ప్రాంతాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు. 30వ తేదీన ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు ఒక పరీక్ష ఉంటుందనీ, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు కానిస్టేబుల్ ఐటీ అభ్యర్థులకు పరీక్ష ఉంటుందని ఆయన తెలిపారు. నిర్ణీత సమయంలోగా అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలనీ, పరీక్ష నిర్వహణ కోసం బోర్డు విధించిన నిబంధనలను అభ్యర్థులు కచ్చితంగా పాటించాలని కోరారు. ఈ పరీక్ష నిర్వహణకు అవసరమైన పోలీసు అధికారులు, సిబ్బందిని నియమించడం జరిగిందని ఆయన చెప్పారు. కాగా, ఈనెల 24 నుంచి 28వ తేదీ వరకు అభ్యర్థులు తమ హాల్ టికెట్లను అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు.

సుప్రసిద్ధ సాహితీవేత్త రవ్వా శ్రీహరి ఇకలేరు

- గుండెపోటుతో కన్నుమూత
- నేడు హైదరాబాద్‌లో అంత్యక్రియలు
- కేసీఆర్, జగన్ సహా పలువురి సంతాపం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సుప్రసిద్ధ సాహితీవేత్త, హైదరాబాద్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు, ద్రావిడ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి, మహా మహోపాధ్యాయ ఆచార్య రవ్వా శ్రీహరి (80) శుక్రవారం రాత్రి గుండెపోటుతో కన్నుమూశారు. గత కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధ పడుతున్నారు. హైదరాబాద్‌లోని మలక్‌పేట యశోద ఆస్పత్రి ఎదురుగా ఉన్న జడ్జెస్ కాలనీలో రుక్మిణి అపార్టుమెంట్‌లో ఆయన నివసిస్తున్నారు. ఆయన భౌతికకాయాన్ని సరూర్‌నగర్ అవేర్ ఆస్పత్రిలో ఉంచారు. అమెరికాలో ఉన్న ఆయన కుమారులు హైదరాబాద్‌కు బయలుదేరి వస్తున్నారు. ఆదివారం ఉదయం మలక్‌పేటలో ఆయన అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు ప్రకటించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వెల్వర్తి గ్రామంలో సామాన్య చేనేత కుటుంబంలో 1943, సెప్టెంబర్ 12న ఆయన జన్మించారు.

చిన్నతనంలోనే తల్లిని కోల్పో యాడు. చెల్లెలు, తమ్ముడికి ఇతడే ఆ ఇంటికి పెద్ద. యాదగిరి లక్ష్మినరసింహ సంస్కృత విద్యాపీఠంలో సురవరం ప్రతాపరెడ్డి, ఎం నరసింగరావుల సహాయంతో చేరాడు. కప్పగంతుల లక్ష్మణశాస్త్రి అతనికి గురువు. హైదరాబాద్‌లోని సీతారాంబాగ్‌లో గల సంస్కృత కాలేజీలో డీఓఎల్, బీఓఎల్ వ్యాకరణం చదివారు. కతకోప రామానుజాచార్యులు, ఖండవల్లి నరసింహశాస్త్రి, అమరవాది కృష్ణమాచార్యుల వద్ద మహాభాష్యాంతం వ్యాకరణం నేర్చుకున్నారు. వివేకవర్ధిని కాలేజీలో తెలుగు పండితుడిగా చేరాడు. బీఏ తెలుగు పండిత శిక్షణ పూర్తయ్యాక ఎంఏ తెలుగు, సంస్కృతం, పూర్తి చేశారు. ఆంధ్ర సారస్వత పరిషత్తులో 1967లో లెక్చరర్‌గా చేరారు. ఆ విద్యార్థులకు తెలుగు, సంస్కృతం రెండు సబ్జెక్టులనూ బోధించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) తెలుగు శాఖలో 1973లో చేరాడు. ఆచార్య బిరుదు రాజు రామరాజు సలహాతో తెలుగులో భాస్కర రామాయణం మీద పరిశోధన చేసి పీహెచ్‌డీ పట్టా పొందారు. కేంద్రీయ విశ్వవిద్యాలయంలో 17 ఏండ్లు బోధన, పరిశోధనలను నిర్వహించారు. 2002లో ద్రావిడ విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా నియమితులయ్యారు. 2011లో తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణల విభాగానికి ఎడిటర్ ఇన్ చీఫ్‌గా పనిచేశారు. సంస్కృతాంధ్ర భాషల్లో ఆయన అపారమైన కృషి చేశారు. సామాన్య కుటుంబంలో జన్మించినా భాషా సాహిత్యంలో ఆయన సుప్రసిద్ధ సాహితీవేత్తగా, ద్రావిడ విశ్వవిద్యాలయానికి ఉపకులపతి స్థాయికి ఎదిగారు. ఆయన మరణం పట్ల తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు కె చంద్రశేఖర్‌రావు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహా పలువురు సంతాపం ప్రకటించారు.

భాషా, సాహిత్య రంగాలకు తీరనిలోటు : సీఎం కేసీఆర్

సుప్రసిద్ధ సాహితీవేత్త, ప్రముఖ తెలుగు సంస్కృత భాషా పండితుడు, ఆచార్య రవ్వా శ్రీహరి మరణం పట్ల ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు సంతాపాన్ని ప్రకటించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన రవ్వా శ్రీహరి.. సామాన్య కుటుంబంలో జన్మించి, కృషి పట్టుదలతో భాషా సాహిత్య రంగంలో అంచెలంచలుగా ఎదిగారని తెలిపారు. లెక్చరర్‌గా, ప్రొఫెసర్‌గా, వైస్ చాన్సలర్‌గా పలు పదవులను చేపట్టి అత్యున్నత శిఖరాలను అధిరోహించారని పేర్కొన్నారు. ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని సీఎం కొనియాడారు. ఆయన మరణం భాషా, సాహిత్య రంగాలకు తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సిఎం కేసీఆర్ ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.



తెలుగు సాహిత్యానికి పూడ్చలేని లోటు : జూలూరు గౌరీశంకర్

సామాన్య చేనేత కుటుంబం నుంచి వచ్చి తెలుగు సాహిత్యంలో మహోన్నత శిఖరంగా ఎదిగిన మహా మహోపాధ్యాయుడు రవ్వా శ్రీహరి మరణం పట్ల తెలంగాణ సాహిత్య అకాడమి చైర్మెన్ జూలూరు గౌరీశంకర్ సంతాపం ప్రకటించారు. నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన ఆయన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సంస్కృత పాఠశాలలో చదువుకుని తెలుగు సాహిత్యానికే ప్రొఫెసర్‌గా, ద్రావిడ విశ్వవిద్యాలయం వీసీగా అంచెలంచలుగా ఎదిగారని తెలిపారు.

తెలుగు సాహిత్యానికే మహా సంపదగా మారారని పేర్కొన్నారు. శ్రీహరి నిఘంటువు పేరుతో ఆయన గొప్ప నిఘంటువునందించారని వివరించారు. తెలంగాణ భాషలో ఉన్న గొప్పతనాన్ని తెలియజేస్తూ నల్లగొండ పదకోశాన్ని తయారు చేశారని తెలిపారు. ఆయన మరణం తెలుగు సాహిత్యానికి పూడ్చలేని లోటు అని పేర్కొన్నారు. భాషా శాస్త్రవేత్త రవ్వా శ్రీహరి మరణం పట్ల తెలంగాణ సాహితీ అధ్యక్షులు వల్లభాపురం జనార్దన, ప్రధాన కార్యదర్శి కె ఆనందాచారి సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

పునరావాసంలో అమానుషం

- అసోం ప్రభుత్వంపై గౌహతి కోర్టు మండిపాటు

న్యూఢిల్లీ : అసోంలోని హోజై జిల్లాలో ఒక పునరావాస శిబిరంలో నెలకొన్న దయనీయ పరిస్థితులపై గౌహతి కోర్టు హేమంత్ బిశ్వశర్మ ప్రభుత్వంపై మండిపడింది. శిబిరంలో తలదాచుకుంటున్న వారికి సరైన ఏర్పాట్లు చేయకపోవడం అత్యంత అమానుషమని వ్యాఖ్యానించింది. దొబోకా ప్రాంతంలో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరంలో నెలకొన్న పరిస్థితులపై దాఖలైన కేసును ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సందీప్ మెహతా విచారిస్తున్నారు. 2021 నవంబర్‌లో వందలాది కుటుంబాలను ఖాళీ చేయించి దొబోకా శిబిరంలో ఉంచారు. 'టార్పాలిన్ పట్టాలతో కట్టిన తాత్కాలిక శిబిరాలలో ప్రజలను పశువుల మాదిరిగా ఎలా ఉంచుతారు ?' అని ప్రభుత్వ న్యాయవాది నాథ్‌ను న్యాయమూర్తి ప్రశ్నించారు. హైకోర్ట్ ఆదేశాల మేరకు ఆ శిబిరాన్ని సందర్శించిన సీనియర్ న్యాయవాది భాస్కర్ దేవ్ కొన్వర్ ఇచ్చిన నివేదిక ఆధారంగా న్యాయమూర్తి ఈ వ్యాఖ్యలు చేశారు. శిబిరంలో 18 నెలల వయస్సు నుండి ఆరేండ్ల వయస్సులోపు ఉన్న యాభై మంది పిల్లలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారంటూ స్థానిక వార్తాపత్రికలో వచ్చిన కథనాన్ని ఆధారంగా చేసుకొని హైకోర్ట్ ఈ కేసును విచారిస్తోంది. లుమ్‌డింగ్ అడవి సమీపంలో నివసిస్తున్న ప్రజలను రాష్ట్రప్రభుత్వం ఖాళీ చేయించి ఈ పునరావాస శిబిరంలో ఉంచింది. అందులో పశువుల కొట్టంలో కంటే పరిస్థితులు దారుణంగా ఉన్నాయని ఆ పత్రిక కథనాన్ని ప్రచురించింది. మరుగుదొడ్లు, స్నానపుగదులు వంటి కనీస సౌకర్యాలు కూడా అక్కడ లేవని తెలిపింది. డ్రైనేజ్ వ్యవస్థ లేదని, విద్యుత్ సౌకర్యం కూడా లేదని ప్రస్తావించింది. ఈ శిబిరంలో 735 మంది పిల్లలు ఉంటున్నారు. 'మీ పిల్లలే ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో ఉంటే... ఊహించుకోండి' అని ప్రభుత్వ న్యాయవాదిని జస్టిస్ మెహతా నిలదీశారు. చిన్నారులకు వైద్య సహాయం అందిస్తున్నామన్న ప్రభుత్వ వాదనను ప్రస్తావిస్తూ వారిని మళ్లీ అక్కడికే పంపుతారు కదా అని ప్రశ్నించింది. అసోంలోని బీజేపీ ప్రభుత్వం 2021 మే నుంచి ఇప్పటివరకూ 4,449 కుటుంబాలను ఖాళీ చేయించింది. వీరిలో ఎక్కువ మంది బెంగాలీ ముస్లింలే. 'వీరి జాబితాను చూస్తే వారంతా ఒకే సామాజిక తరగతికి చెందిన వారని అర్థమవుతుంది' అని కోర్టు వ్యాఖ్యానించింది.

వారి రాజకీయం...ఉగ్రవాదులకు ఊతం

- పూంచ్ ఘటనపై 'సామ్నా' మండిపాటు

న్యూఢిల్లీ : ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కర్నాటక ఎన్నికల రాజకీయాలలో మునిగి తేలుతుంటే ఉగ్రవాదులు దానిని అవకాశంగా తీసుకొని జమ్మూకాశ్మీర్‌లో దాడికి తెగబడ్డారని శివసేన (ఠాక్రే గ్రూప్) తన అధికార పత్రిక 'సామ్నా' సంపాదకీయంలో విమర్శించింది. పుల్వామా ఘటన తర్వాత ఇదే ఘోరమైన ఉగ్రవాద దాడి అని అభివర్ణించింది. పూంచ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిలో రాష్ట్రీయ రైఫిల్స్ దళానికి చెందిన ఐదుగురు జవాన్లు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని ఇచ్చే ఆర్టికల్ 370ని రద్దు చేసినప్పటికీ కాశ్మీర్ లోయలో హింస కొనసాగుతోందని, శాంతి నెలకొనలేదని 'సామ్నా' తెలిపింది. కేంద్ర సంస్థలు మోడీ-షా ద్వయం చేతిలో ఆయుధాలుగా మారాయని, ఉగ్రవాదులు వాటిని చూసి ఏ మాత్రం భయపడడం లేదని విమర్శించింది.

హోం మంత్రి ఇంటికి సీఎం..

(మొదటిపేజీ తరువాయి)


మత పెద్దలు, సామాన్యులను పేరు పేరునా పలకరించి, అలాయ్ బలాయ్ తీసుకుని వారికి సీఎం పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఉద్యమకాలం నుంచి నేటి వరకు తనతో కొనసాగుతున్న సీనియర్ కార్యకర్త సత్తార్ గుల్షనీని పేరు పెట్టి పిలిచి దగ్గరకు తీసుకుని ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. కార్యక్రమంలో మంత్రులు కొప్పుల ఈశ్వర్, ప్రశాంత్ రెడ్డి, సత్యవతి రాథోడ్, పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీలు కె.కేశవరావు, జోగినపల్లి సంతోష్ కుమార్, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, మధుసూదనాచారి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్, నగర మేయర్ విజయలక్ష్మీ, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, పలు కార్పొరేషన్ల చైర్మెన్లు మసీఉల్లాఖాన్,సలీం, రవీందర్ సింగ్, మేడే రాజీవ్ సాగర్, సీనియర్ నేతలు మొయిత్ ఖాన్, రాయిడన్ రోచ్ పాల్గొన్నారు.

దేవుళ్లపై ప్రమాణం చేసే సంప్రదాయాన్ని పాటించట్లేదు

(మొదటిపేజీ తరువాయి)

వెల్లడించారు. మునుగోడు ఉప ఎన్నికల్లో బీజేపీ భారీగా డబ్బు ఖర్చు పెట్టిందని ఆరోపించారు. శనివారం శామీర్ పేటలోని తన నివాసంలో రేవంత్ విసిరిన సవాల్‌పై ఈటల స్పందించారు. వ్యక్తిగతంగా తాను ఎవరినీ కించపరచలేదని చెప్పారు. తనకు కూడా ఆత్మవిశ్వాసం ఉందని.. అమ్మవారి మీదనో, తల్లి మీదనో ఒట్టేసే అవసరం తనకు లేదని చెప్పారు.

కొక్కొరోకో..



ప్రజల ముంగిటకు టీఎస్ ఆర్టీసీ..

ఊరికో బస్ ఆఫీసర్ నియామకం..! :ఆర్టీసీ ఎండీ సజ్జన్నార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రజా రవాణా వ్యవస్థను ప్రజల వద్దకు మరింతగా తీసుకెళ్లేందుకు వీలుగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్‌టీసీ) వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆర్టీసీ వైపు ప్రజలను ఆకర్షించేందుకు పల్లెల్లో బస్ ఆఫీసర్లను నియమించాలని నిర్ణయించింది. ప్రయాణీకుల సౌకర్యార్థం కల్పిస్తున్న వివిధ కార్యక్రమాలను వివరిస్తూ.. ఆర్టీసీ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు విలేజ్ బస్ ఆఫీసర్ల వ్యవస్థకు రూప కల్పన చేసింది.ఆయా ఆఫీసర్ల నియామకం, విధి విధానాలకు సంబంధించిన మార్గదర్శకాలను సంస్థ వీసీ సజ్జన్నార్ జారీ చేశారు. బస్ ఆఫీసర్లను వీలైనంత త్వరగా నియమించాలని అధికారులను ఆదేశించారు. ఆఫీసర్ల వ్యవస్థ మే ఒకటో తేది నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి వస్తుందని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా టీఎస్ ఆర్టీసీ 10వేల గ్రామాలకు బస్సులు నడిపిస్తున్నది. ఈ క్రమంలో ఆయా గ్రామాల్లో 2వేలకుపైగా వీలేజ్ బస్ ఆఫీసర్లను నియమించాలని నిర్ణయించింది. సంస్థ ఏ కార్యక్రమం తీసుకువచ్చినా ప్రజలు ఆదరిస్తున్నారనీ, అదే రకంగా విలేజ్ బస్ ఆఫీసర్ల వ్యవస్థను వినియోగించుకుని, సంస్థను ప్రోత్సహించాలని టీఎస్ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్దన్తో సజ్జన్నార్ కోరారు.

మార్గదర్శకాలు..

గ్రామాల్లో నివసించే కండక్టర్లు, డ్రైవర్లు, ఇతర ఉద్యోగులను విలేజ్ బస్ ఆఫీసర్లుగా డిపో మేనేజర్లు నియమిస్తారు. నియామకాల్లో ప్రజల స్నేహపూర్వకంగా సంబంధాలుండి, స్వచ్ఛందంగా పని చేసేందుకు ముందుకొచ్చే వచ్చే వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. పెద్ద గ్రామాలకు ఒకరిని, చిన్న పల్లెలైతే రెండు మూడు గ్రామాలకు కలిపి ఒకరిని ఆఫీసర్‌గా నియమించనున్నారు.

మార్గదర్శకాల మేరకు ఒక్కొక్కరికి ఐదు గ్రామాల కంటే ఎక్కువగా కేటాయించేందుకు వీలుండదు. హైదరాబాద్ సహా మిగతా మున్సిపాలిటీల్లోనూ వార్డుకో బస్ ఆఫీసర్‌ను నియమించనున్నారు. వారు కూడా విలేజ్ బస్ ఆఫీసర్ల మాదిరిగానే పని చేస్తూ.. ప్రజలకు అందుబాటులో ఉంటారు. ఆయా అధికారులు 15 రోజులకోసారి గ్రామంలోని ప్రజలతో సమావేశవుతారు. బస్సుల రాకపోకలు, సమయాలు, కొత్త రూట్‌లు, కొత్త సర్వీస్‌లు, సమస్యలు, తదితర అంశాల గురించి సమాచారాన్ని సేకరించి, ఉన్నతాధికారులకు అందిస్తారు.

గ్రామాల్లో పెండ్లిళ్ళు, శుభకార్యాలు, జాతరల వివరాలను సేకరిస్తారు. రద్దీ ఎక్కువగా దే సమయాల్లో అందుకు తగినట్టుగా బస్ ట్రిప్పులను పెంచుతారు. వివాహాది శుభకార్యాలకు ఆర్టీసీ అద్దె బస్సులను ఉపయోగించుకోవాలని కోరనున్నారు. ప్రయివేటు వాహనాల్లో వెళ్తే జరిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు.

ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, సంఘాల నాయకులు, డ్వాక్రా సంఘాల సభ్యులు, ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులను బస్ ఆఫీసర్లు సంప్రదించి, వారి సెల్ ఫోన్ నంబర్లను అధికారులకు అందజేస్తారు. ప్రజా రవాణా వ్యవస్థతో పాటు టీఎస్ఆర్టీసీ కార్యక్రమాలను వివరిస్తారు.

ప్రతి గ్రామపంచాయతీ కార్యాలయంలోని నోటీస్ బోర్డులో సంబంధిత విలేజ్ బస్ ఆఫీసర్ వివరాలను స్థానిక డిపో మేనేజర్ పొందుపరుస్తారు. బస్ ఆఫీసర్ పేరు, ఫోన్ నంబర్ ఉంటుంది.

గ్రామానికి వచ్చే బస్సులకు సంబంధించిన సమస్యలు, ఫిర్యాదులు, రాయితీ పథకాలతో పాటు పెండ్లిండ్లు, శుభకార్యాలకు బస్సుల కోసం విలేజ్ ఆఫీసర్‌ను సంప్రదించేలా వివరాలను ప్రదర్శిస్తారు. ప్రతి గ్రామ సర్పంచ్‌కు ఆ ఆఫీసర్ వివరాలను లేఖ రూపంలో తెలియజేస్తారు. ఇదే సమయంలో మంచిగా పని చేసే విలేజ్ బస్ ఆఫీసర్లను ప్రోత్సహించాలని యాజమాన్యం నిర్ణయించింది. ప్రతి మూడు నెలలకోసారి మంచి పనితీరు కనబరిచిన వారిని 'బెస్ట్ విలేజ్ బస్ ఆఫీసర్' అవార్డుతో సంత్కరించనున్నది. ఈ విధానంతో అందరూ మెరుగ్గా పని చేసే అవకాశం ఉండదనున్నది.

విద్యలో మూఢత్వం పెంచడమే : ఎస్ఎఫ్ఐ

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నించారు. డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించడం వంటి చర్యల వల్ల సైన్స్ పాఠ్యాంశాలను మళ్లీ పాత పద్ధతిలో విశ్వాసాలు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. డార్విన్ పాఠాన్ని పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. "సైన్స్, చరిత్ర లేకపోతే ఈ దేశానికి భవిష్యత్ లేదు" అని తెలిపారు. ఆర్ఎస్ఎస్ ఈ దేశ చరిత్రను, పాఠ్యాంశాలను మార్చి తన భావజాలాన్ని తీసుకుని రావడాన్ని ప్రజాస్వామిక వాదులు ఖండించాలని కోరారు.

కాయకష్టం..వర్షంపాలు

తడిసి ముద్దైన ధాన్యం



- ఆరబెట్టేందుకు అవస్థలు
- తూకం నెమ్మదిగా కొనసాగుతుందని ఆరోపణ
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు
- రెండ్రోజులుగా వడగండ్లు, ఈదురుగాలలతో వర్షం
- మల్యాలలో పిడుగుపాటుకు గీత కార్మికుడు మృతి



నవతెలంగాణ -నల్లగొండ కలెక్టరేట్/ విలేకరులు

కాయ కష్టం చేసి పంట పండితే.. కండ్ల ముందే వర్షం పాలైంది. రెండ్రోజులుగా వడగండ్లు, ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం, ఈదురు గాలులు రైతులను నట్టేట ముంచాయి. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు అవకాశాలూ లేకపోవడంతో అన్నదాతలు అవస్థ పడుతున్నారు. కనీసం టార్పారిన్లు వేసైనా కాపాడాల్సిన అధికారులు పత్తాలేరు. రాష్ట్ర ప్రభుత్వం ఈసారి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా ప్రారంభించడమూ పంట తడవడానికి కారణమైంది. కరీంనగర్ జిల్లా మల్యాల మండలం కొండగట్టు సమీపంలో తాటిచెట్టుపై పిడుగు పడటంతో పక్కనే ముంజలు విక్రయిస్తున్న గీతకార్మికుడు ముత్యం మల్లేష్(65) అక్కడికక్కడే మరణించాడు.

ఏప్రిల్ ఒకటో తేదీన కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని చెప్పిని ఆలస్యంగా 10వ తేదీన ప్రారంభించారు. శుక్రవారం అకాలంగా కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటాలు నెమ్మదిగా కొనసాగుతున్నాయని, ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇలా అయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గన్నీ బ్యాగుల, లారీల కొరతతో ఇబ్బంది. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా కొనుగోలులో వేగం పెంచేలా అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు వేడుకుంటున్నారు.

నల్లగొండ జిల్లాలో ఐకేపీ138, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 140 మొత్తం 278 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 268 కేంద్రాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. నేటికీ 60,2508 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా.. 3408 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉంది. కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. పలు రకాల కారణాలను చూపుతూ ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ఆలస్యం చేస్తున్నారు. అధికారులు సరైన ఏర్పాట్లు చేయకపోవడం, దళారుల నియంత్రణలో చర్యలు లేకపోవడంతో రైతులు తక్కువ ధరకే ధాన్యాన్ని విక్రయించాల్సి వస్తుంది.

ధాన్యం కొనుగోలు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఓ వైపు తూకంలో నష్టం చేస్తుండగా.. మరోవైపు మిల్లర్లు కోతను విధిస్తున్నారు. ఇదేమని ప్రశ్నించిన రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. లారీల యజమానులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. బస్తాకు నిర్ణయించిన ధరను చెల్లిస్తే రవాణా చేస్తామని బహిర్గతంగా చెబుతున్నారు. ఇంత తతంగం జరుగుతున్నా అధికారులు పట్టనట్టు వ్యవహరించడం ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. దాంతో చేసేదేమీ లేక లారీ యజమానులు బస్తాకు నిర్ణయించిన రెండు నుంచి మూడు రూపాయలను చెల్లించి రవాణా చేయించుకోవలసిన దుస్థితి నెలకొంది. నాంపల్లిలో ఏర్పాటు చేసిన పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో తేమశాతం తక్కువగా ఉందని సాకు చూపుతూ ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదంటూ రైతులు శుక్రవారం ఆందోళనకు దిగారు. తడిసిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేసి ప్రకటించిన మద్దతు ధరను చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఇప్పటికైనా అధికారులు కొనుగోలులో వేగం పెంచాలని రైతులు వేడుకుంటున్నారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి
బందా శ్రీశైలం - రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు



జిల్లావ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని ప్రభుత్వమే బాధ్యత వహిస్తూ కొనుగోలు చేయాలి. తడిసిన, రంగు మారిన, మొలకెత్తిన ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే కొనుగోలు చేయాలి. దళారులను అరికట్టాలి.

జిల్లాల్లో వర్షం..

చౌటుప్పల్ మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన ఈదురు గాలులకు, వర్షానికి ఎస్. లింగోటం గ్రామంలో కోళ్లఫారం కూలిపోయింది. అందులో ఉన్న 300 కోళ్లు చనిపోయాయి. అదే విధంగా దండు మల్కాపురం గ్రామంలో గొర్రెలపై ప్రహరి గోడ కూలి 20గొర్రెలు చనిపోయాయి. మరికొన్ని గొర్రెలు గాయపడ్డాయి. గొర్రెల కాపరిని ఆదుకోవాలని యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు అయోధ్య యాదవ్ కోరారు. నల్లగొండ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం 300.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. అత్యధికంగా నకిరేకల్ మండలంలో 46.2, పీఏపల్లిలో 0.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.

మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలంలో మిర్చి కల్లాల్లో ఆరబోసిన మిర్చి తడిసింది. ఓ వైపు పట్టాలు కప్పుతుండగా.. మరోవైపు ఈదురు గాలలకు అవి ఎగిరిపోయాయి. కోతకొచ్చిన వరి నేల వాలింది. మామిడికాయలు మొత్తం రాలిపోయాయి. కరెంటు స్తంభాలు, చెట్లు, రేకుల షెడ్లు కూలాయి. ములుగు జిల్లా గోవిందరావుపేట మండల వ్యాప్తంగా శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో ఉరుములు మెరుపులు పిడుగులతో గాలివాన కురిసింది. మండలంలోని పసరలో కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. పలు ఇండ్ల కప్పులు ఎగిరిపోగా టీవీలు, ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు కాలిపోయాయి. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలో శనివారం ఒక్కసారిగా వర్షం కురవడంతో ఇటు జాతీయ రహదారుల పైన చెట్లు విరిగిపడటంతో పాటు కోతకు వచ్చిన వరి పూర్తిగా రాలిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. జాతీయ రహదారిపై భారీ వక్షాలు సైతం నేలకు ఒరిగాయి.ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో శనివారం సాయంత్రం 6గంటలకు సుమారు 40కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలతో కూడిన వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. ఆయా గ్రామాల్లో పెద్దఎత్తున ఆరబోయిన ధాన్యం కుప్పలు తడిసి ముద్దయ్యాయి. వరిపొలాలన్నీ వడగళ్ల మంచుతో నిండిపోయాయి. మొక్కజొన్న నేలవాలిపోగా.. మామిడి పెద్దఎత్తున రాలిపోయింది. చాలా చోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడి పలు గ్రామాలకు కరెంటు సరఫరా నిలిచిపోయింది. కరీంనగర్-రామగుండం జాతీయ రహదారిపై చెట్లు విరిపడటంతో రాత్రి 9గంటల వరకూ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కరీంనగర్, చొప్పదండి నియోజకవర్గాలు, పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్, గర్రెపల్లి,



జగిత్యాల జిల్లా మల్యాల, కొండగట్టు, రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట, చందుర్తి, బోయిన్‌పల్లి మండలాల్లో వరి పంటకు తీవ్ర నష్టమే వాటిల్లింది. కొనుగోలు కేంద్రాల్లో అమ్మకం కోసం తీసుకొచ్చిన ధాన్యం తడిసిపోగా, వడగండ్ల కూడా పెద్దఎత్తున పడ్డాయి. గర్రెపల్లిలో పంట పొలాలతోపాటు ఇంటి పైకప్పులు లేచిపోవడంతో పాటు ఇన్ని ఇండ్ల గోడలు కూలిపోయాయి. కరీంనగర్ నగరంలో హోర్డింగ్‌లు ప్రమాదకరంగా వంగిపోయాయి.

గొలుసు చోరీ దొంగను పట్టుకున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్

- మహిళను కత్తితో బెదిరించి చోరీ చేసిన ఆటో డ్రైవర్
- వెంబడించి పట్టుకున్న భద్రతా సిబ్బంది





నవతెలంగాణ-నర్సాపూర్

ఆటోలో ప్రయాణిస్తున్న మహిళను డ్రైవర్ కత్తితో బెదిరించి మెడలోని పుస్తెలతాడును చోరీ చేరి పరావుతుండగా.. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పట్టుకున్నారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా నర్సాపూర్‌లో శనివారం జరిగింది. ఒంటరి మహిళను కత్తితో బెదిరించి దొంగతనానికి పాల్పడి పారిపోతున్న ఆటో డ్రైవర్‌ను రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి తన గన్‌మెన్లతో కలిసి పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా జోగిపేట సమీపంలోని సంఘుపేట గ్రామానికి చెందిన ఊరడి సురేష్ ఆటో నడుపుతాడు. శనివారం తన ఆటోలో తన భార్య స్వప్నతో కలిసి నర్సాపూర్ వస్తున్నాడు. ఇస్మాయిల్‌ఖాన్‌పేట్ స్టేజ్ వద్ద అమృత అనే మహిళ నర్సాపూర్ వెళ్లేందుకు సురేష్ ఆటో ఎక్కింది. నర్సాపూర్ మండలం ఆవంచ గ్రామ స్టేజీ సమీపంలోకి రాగానే సురేష్ ఆటోను పక్కకు ఆపాడు. తన ఆటోలో ఉన్న అమృతను కత్తితో బెదిరించాడు. చంపుతానంటూ భయపెట్టి ఆమె మెడలో ఉన్న పుస్తెలతాడును తెంపుకుని ఆమెను వదిలేసి పరారయ్యాడు. అమృత గట్టిగా అరుస్తుండటంతో అదే సమయంలో ఆ దారిలో ప్రయాణిస్తున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి చూశారు. కాన్వాయ్ ఆపి అమృతను ఏం జరిగిందనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. దాంతో చైర్‌పర్సన్ తన భద్రతా సిబ్బందికి చెప్పి పారిపోతున్న ఆటో డ్రైవర్ సురేష్‌ను పట్టుకోవాలని సూచించారు. భద్రతా సిబ్బంది వెంబడించి సురేష్‌ను పట్టుకున్నారు. జరిగిన సంఘటన గురించి స్థానిక పోలీసులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. చోరీకి పాల్పడిన సురేష్‌తో పాటు అతని భార్య స్వప్నను పోలీస్ స్టేషన్‌లో అప్పజెప్పారు. వెంటనే ఎస్ఐ శివకుమార్ సురేష్ నుంచి దొంగిలించిన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

గూడు కోసం పోరాడి ఓడిన సగటు జీవి

- డబుల్ బెడ్‌రూమ్ సాధన కోసం చివరకంటా పోరాటం
- గుండెపోటుతో మృతి





నవతెలంగాణ-జనగామ

సొంత ఇల్లు లేదు.. కనీసం జాగా లేదు.. ఇంటి కిరాయి కట్టలేక.. ఆర్థిక ఇబ్బందులతో సతమతమై.. డబుల్ బెడ్‌రూమ్ కోసం పోరాడి అలసిపోయిన సగటు మైనార్టీ జీవి చివరకు వారి పవిత్ర పండుగ రంజాన్ రోజే ప్రాణం కోల్పోయాడు.. జనగామ పట్టణం మైనార్టీ కాలనీలో గత 30 సంవత్సరాలుగా కిరాయికి ఉంటున్న ఎండి గౌస్ పాషా గుండెపోటుతో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..

పాషా 30 ఏండ్లుగా అద్దె ఇంట్లోనే ఉంటున్నాడు. గతంలో బాణాపురంలో ఇందిరమ్మ ఇల్లు, స్థలం కోసం.. ప్రస్తుతం డబుల్ బెడ్ కోసం పోరాడాడు. ఇండ్ల సాధన పోరాటంలో ప్రధాన పాత్ర పోషించాడు. ఇన్నేండ్లయినా తమకు ఇల్లు మంజూరవుతుందో లేదోనని తీవ్ర మానసిక వేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున చాతిలో నొప్పి వస్తుందని చెప్పడంతో కుటుంబీలకు స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. రంజాన్ పండుగ రోజే ఇంటి పెద్ద మృతిచెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర దుఃఖసాగరంలో మునిగిపోయారు. పాషది ఇద్దరు కుమారులు, కోడలు, ఇద్దరు మనవరాండ్లు.. భార్య.. ఉమ్మడి కుటుంబం.

ఈ విషయం తెలిసి సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్, ఇందిరమ్మ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సాధన కమిటీ అధ్యక్షులు కళ్యాణం లింగం, నాయకులు, కార్యకర్తలు మైనార్టీ కాలనీలోని వారి ఇంటికి వెళ్లి పాషా భార్య ఫాతిమాను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉమ్మడి కుటుంబానికి పెద్దదిక్కును కోల్పోయి ఆ కుటుంబం తీవ్ర దుఃఖంలో ఉందన్నారు. పాషా మరణం పేదల ఇండ్ల స్థలాల సాధన పోరాటానికి తీరని లోటని అన్నారు. పాషా మరణానికి ప్రభుత్వ అధికారులు బాధ్యత వహించాలని, వారికి తక్షణం డబుల్ బెడ్ రూమ్ ఇల్లు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే లబ్దిదారులు అనేకమంది సొంత ఇంటి కల నెరవేరకనే కిరాయిండ్లలోనే ప్రాణం వదిలిన ఘటనలు అనేకం జరిగాయని చెప్పారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ పేదల ఇండ్ల స్థలాల జీవన్మరణ సమస్యను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వారిలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సాధన పోరాట కమిటీ సభ్యులు పొన్నాల ఉమా, పిట్టల శారద, కొలిపాక శోభ, బొల్లాపల్లి ఇందిరా, వల్లాల పద్మ, వేణు తదితరులు ఉన్నారు.

26న ఇందిరాపార్క్ వద్ద టీ -సేవ్ నిరుద్యోగ దీక్ష :వైఎస్ఆర్‌టీపీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నిరుద్యోగుల పక్షాన టీ-సేవ్ ఆధ్వర్యంలో ఈ నెల 26న దీక్ష నిర్వహించేందుకు కోర్టు అనుమతి ఇచ్చిందని వైఎస్ఆర్‌టీపీ పీఏసీ సభ్యులు గట్టు రామచందర్‌రావు,ఏపూరి సోమన్న, రాంరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీ మినహా ఇతర అన్ని పార్టీల అధ్యక్షులను కలిసి మద్దతు కోరుతామని తెలిపారు. విద్యార్థి,ప్రజా సంఘాలను సైతం ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించే వరకూ పోరాడుతాం

- సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎస్‌వి.రమ
- రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న సమ్మె



నవతెలంగాణ-కందుకూరు, తలకొండపల్లి

వీవోఏలు సమస్యలు పరిష్కరించే వరకూ పోరాడుతామని తెలంగాణ ఐకేపీ వీవోఏల సంఘం(సీఐటీయూ) రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎస్‌వి.రమ అన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం వారం రోజులుగా వీఓఏలు చేస్తున్న సమ్మె కొనసాగుతోంది. శనివారం రంగారెడ్డి జిల్లా కందుకూరు, తలకొండపల్లి మండల కేంద్రాల్లో కొనసాగుతున్న వీవోఏల నిరవధిక సమ్మెకు రమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చాలీచాలని వేతనాలతో వీవోఏలు పనిచేస్తున్నారన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీఓఏలకు సీఐటీయూ రాష్ట్ర కమిటీ పూర్తిగా మద్దతు ప్రకటిస్తుందన్నారు. అక్కడక్కడ బీఆర్ఎస్ నాయకులు సమ్మె జరగకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. గ్రామస్థాయిలో 19 ఏండ్లుగా పనిచేస్తున్న వీవోఏలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వీవోఏలలో ఎక్కువ మంది మహిళలే ఉన్నారన్నారు. మహిళల సమస్యలను దృష్టిలో పెట్టుకునైనా వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా శ్రామిక మహిళా కన్వీనర్ జి.కవిత, సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు అలువాల రవికుమార్, సీఐటీయూ మహేశ్వరం మండల కన్వీనర్ ఏర్పుల శేఖర్, కందుకూరు మండల కన్వీనర్ బుట్టి బాలరాజు, శివలీలా, సరస్వతి, సంగీత, లక్ష్మి, పద్మ రామచంద్రారెడ్డి, రమేష్, రవి, వీవోఏలు పాల్గొన్నారు.

నా చావుకు కారణం సీఐ గోపిసారే..

- సెంట్రల్ ఇంటెలిజెన్స్ సీఐ వేధింపులకు రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య
- సుసైడ్ నోట్ లభ్యం
- భూపాలపట్నం గ్రామంలో విషాదఛాయలు

నవతెలంగాణ - చొప్పదండి

భూమి విషయంలో డబ్బులు కట్టాలని సెంట్రల్ ఇంటెలిజెన్స్ సీఐ ఒత్తిడి, వేధింపులు భరించలేకపోతున్నా.. 'నా చావుకు కారణం సీఐ గోపిసార్' అని సూసైడ్ నోట్ రాసిపెట్టి ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం భూపాలపట్నం గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. చొప్పదండి ఎస్ఐ ఉపేంద్రచారి తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం భూపాలపట్నం గ్రామానికి చెందిన బొడిగె శ్యామ్ అలియాస్ సాంబయ్య(55) జిల్లా కేంద్రంలోని విద్యారణ్యపురిలో నివాసం ఉంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో పది నెలల కిందట కరీంనగర్‌కు చెందిన సెంట్రల్ ఇంటెలిజెన్స్ బ్యూరో సీఐ గోపాలకృష్ణకు చొప్పదండి మండలం భూపాలపట్నం గ్రామ శివారులో 20గుంటల భూమి గుంటకు రూ.2లక్షల 50వేల చొప్పున రూ.50లక్షలకు శ్యామ్ ఇప్పించాడు. ఆ తర్వాత ఆ భూమిని అమ్మి పెట్టాలని శ్యామ్‌కు చెప్పాడు. 5నెలల్లో భూమిని అమ్మి రూ.10లక్షల లాభం ఇప్పిస్తానని శ్యామ్.. సీఐకి మాట ఇచ్చాడు. కానీ ఆ భూమి సమయానికి అమ్మలేకపోవడంతో.. నువ్వే ఉంచుకొని రూ.10లక్షలు కలిపి డబ్బులు ఇవ్వాలని శ్యామ్‌ను సీఐ వేధించడం మొదలుపెట్టాడు. శ్యామ్ ఇచ్చిన మాటకు కట్టుబడి రూ.6లక్షలు సీఐ గోపాలకృష్ణకు చెల్లించాడు. మిగతా డబ్బులు ఈనెల 15న కట్టడానికి వాయిదా ఉండగా.. డబ్బులు సర్దుబాటు కాలేదని సీఐని శ్యామ్ బతిమిలాడినా వినకుండా బెదిరిస్తూ మానసికంగా వేధించాడు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం భూపాలపట్నంలో ఉన్న భూమికి అడ్వాన్స్ ఇవ్వడానికి పార్టీ వస్తున్నదని ఇంట్లో చెప్పి వెళ్లిన శ్యామ్ సాయంత్రం భార్య బొడిగె సుజాతకు ఫోన్ చేశాడు. సీఐ గోపాలకృష్ణ డబ్బులు మొత్తం ఇవ్వాలని, రూ.100తక్కువైనా నీ అంతుచూస్తానని బెదిరిస్తున్నాడని చెప్పాడు. రాత్రి 7:15సమయంలో భూపాలపట్నంలోని ఇంటి పక్కనవారు తలుపుకొట్టినా స్పందించకపోయే సరికి విషయం శ్యామ్ భార్యకు ఫోన్ ద్వారా చెప్పారు. ఆమె వాళ్ల బంధువులను పంపించగా శ్యాం ఫ్యాన్‌కు ఉరేసుకుని విగతజీవిగా కనిపించాడు. మృతుని భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. శ్యామ్‌కు కొడుకు, కూతురు ఉన్నారు. సెంట్రల్ ఇంటెలిజెన్స్ సీఐ గోపాలకృష్ణ వేధింపులే తన చావు కారణం అని రియల్ ఎస్టేట్ వ్యాపారి బొడిగె శ్యామ్ సూసైడ్ నోట్ రాసి పెట్టాడు. దాంతో పూర్తి వివరాలు డైరీలో రాసిపెట్టాడు.


---

800 ఫీట్లకు ఇంచు నీళ్లు

ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో అడుగంటుతున్న భూగర్భ జలాలు

- మెట్ట ప్రాంతాల బావుల్లో ఇంకిపోతున్న నీరు
- కరెంటు కష్టాలు తోడై ఎండిపోతున్న పంట పొలాలు
- అధికారులు చర్యలు తీసుకోవాలని రైతు సంఘాల విజ్ఞప్తి

మే నెల రానేలేదు.. ఏప్రిల్ మొదటి వారం నుంచే ఎండలు మండిపోతున్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. మెట్ట ప్రాంతాల్లోని బోరు బావుల్లో నీరు ఇంకిపోవడంతోపాటు కరెంటు కష్టాలు తోడయ్యాయి. దీంతో వరి మొక్కజొన్న, వేరుశనగ పంట పొలాలు ఎండుతున్నాయి. ప్రధానంగా కల్వకుర్తి, అచ్చంపేట లింగాల, బల్మూరు, చిన్నంబావి, పెంట్లవెల్లి మండలాల పరిధిలో ఈ సమస్య తీవ్రంగా కనిపిస్తోంది. బోరుబావులే ఆధారంగా సాగుచేసిన మెట్ట ప్రాంత పంటలు చేతికి అందుతాయో అందవోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఫిబ్రవరి మార్చితో పోల్చితే ప్రస్తుతం మీటరు లోతుకు నీరు పడిపోయిందని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. ఇలాగే ఉంటే మే చివరి నాటికి అవి మరో మీటరు లోతుకు పడిపోయే అవకాశం ఉందని అంచనా. సమస్య తీవ్రం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతు సంఘాలు కోరుతున్నాయి. ఎక్కడెక్కడ నీటి సమస్య ఉందో గుర్తించి ప్రణాళికలు రూపొందించాలని కోరాయి.









నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

కల్వకుర్తి మండలం పంజుగుల్ సిలార్‌పల్లి, ఎల్లికళ్ళు తదితర గ్రామాల్లో రోజురోజుకూ భూగర్భజలాలు పాతాళానికి చేరుకుంటున్నాయి. తాడూరు మండలం గుంతకోడూరు యాదరెడ్డి పల్లి, నెల్లికుదురు, యంగంపల్లి, ఏటిధర్పల్లి, అంతారం వంటి గ్రామాల్లో తాగు సాగునీటి సమస్య మొదలైంది. లింగాల మండలం అప్పాపూర్ దారారం, దత్తారం, అవసలికుంట తదితర గ్రామాల్లో నీరందక పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయి. బావుల్లోనూ నీరు అడుగంటుతుంది. కల్వకుర్తి మండల పరిధిలో పారుతున్న కేఎల్ఐ కాల్వలు ఎండిపోయాయి. దీంతో ఎగువ ప్రాంతంలోని గ్రామాల్లో భూగర్భ నీటి మట్టం గణనీయంగా పడిపోయింది. దీని వలన బల్మూరు మండలం కొండనాగుల రామాశిపెల్లి వీరమరాశిపల్లి సాయిన్‌పల్లి గ్రామాల్లో తాగునీటి అవసరాలూ తీరడం లేదు.

మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్, గండీడు, మండలాల పరిధిలో నీటిమట్టాలు తగ్గిపోతున్నాయి. ఈ జిల్లాలో 2022 నవంబరులో సగటున 4.50 మీటర్ల లోతున భూగర్భ జలాలు ఉండేవి. డిసెంబరు నాటికి అవి 5.16 మీటర్లకు పడిపోయాయి. గత ఏడాది నవంబరులో ఐదు మీటర్లకు పడిపోగా, ఈ సంవత్సరం జనవరి నాటికి 6.21 మీటర్లకు చేరుకున్నాయి. ఫిబ్రవరిలో 7.13 మీటర్లకు భూగర్భజలాలు పడిపోయాయి. మార్చి నాటికి 8.5 మీటర్ల వరకు పడిపోయాయి. ప్రతి నెలా సగటున మీటరు నుంచి రెండు మీటర్ల లోతు వరకు నీరు పడిపోతూ వస్తున్నది. 2021 ఫిబ్రవరిలో 5.96 మీటర్ల లోతున నీరు లభ్యంకాగా, ఈ సంవత్సరం భూగర్భ జలాలు7.13 మీటర్లకు పడిపోయాయి. గట్టు మండలంలో భూగర్భజలాలు 23.53 మీటర్లకు, ఐజ మండలంలో 12.80, మల్దకల్ మండలంలో 10.44, బిజినపల్లి 10.25, కోస్గి 9.85, ఉట్కూరు మండలంలో 8.31, మక్తల్ మండలంలో 7.40, నర్వలో 7.17 మీటర్లకు పడిపోయాయి. మిగతా మండలాల్లో 3.50 మీటర్ల నుంచి ఆరు మీటర్ల లోతున భూగర్భ జలాలు లభిస్తున్నాయి. వచ్చే నెలలో భూగర్భ జలాలు మరింత అడుగంటి తాగునీటికి ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు కనబడుతున్నాయి.

కృష్ణానది సమీపంలో సాగునీటి సమస్య

కృష్ణానది సమీపాన నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. నదికి మూడు కిలోమీటర్ల దూరాన ఉన్న కొప్పునూనురులో పది మీటర్ల లోతుకు భగర్భజలాలు పడిపోయాయి. చిన్నంబావి మండలం కొప్పునూరుకు చెందిన ఉల్పాల మహేశ్వ వ్యవసాయ పొలంలో 800 ఫీట్లలోతు బోరు బావిని తవ్వించారు. ఇంచున్నర మాత్రమే నీళ్లు వచ్చాయి. ఉల్పాల్ రమేష్ 300 ఫీట్లు, గుడెం బలీశ్వరయ్య 300, శేరిపల్లి బాలయ్య 400, చిన్నంబావి బొక్కలరావు 500 ఫీట్లు, ఉసేన్ నాయుడు 400, చిన్నారెడ్డి 500 అడుగుల లోతు బోరు వేసినా చుక్క నీరు రాలేదు. ఇప్పటికే 10 మీటర్ల లోతుకు భూగర్భజలాలు పడిపోగా.. ఎండలు ముదిరితే తాగునీటికి సైతం సమస్య ఏర్పడే పరిస్థితి ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రిజర్వాయర్ల నీరు సైతం యాసంగి పంటలకు వదిలారు. ఎండలు ముదిరితే మూగ జీవాలకూ తాగునీరు దొరకడం కష్టం ఉంటుందని ఆందోళన వ్యక్తమవుతోంది.

ఆందోళనలో చివరి ఆయకట్టు రైతులు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న రిజర్వాయర్ల చివరి ఆయకట్టు భూములు సాగునీరందక ఎండిపోతున్నాయి. చివరి ఆయకట్టుకు కాలువల నీరు పూర్తిగా నిలిచిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కల్వకుర్తి, కోయిల్‌సాగర్, నెట్టెంపాడు, బీమా వంటి రిజర్వాయర్ల పరిధిలోనూ ఇదే పరిస్థితి. ఒకవైపు రిజర్వాయర్లలో నీరు లేకపోవడం.. మరోవైపు కాల్వలు ఆగిపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

800 ఫీట్లు తవ్వితే.. ఇంచు నీళ్లు
ఉల్పల మహేష్- చిన్నంబావి మండలం- నాగర్‌కర్నూల్ జిల్లా

నేను నా వ్యవసాయ పొలంలో 800 ఫీట్ల వరకు బోరు బావి తవ్వాను. 7 వందల వరకు చుక్క నీరు రాలేదు. 800 దగ్గర ఇంచు నీళ్లు వచ్చాయి. చెక్‌డ్యాంలు, రిజర్వాయర్లు లేకనే ఈ దుస్థితి నెలకొన్నది. కృష్ణానది పక్కన ఉన్నా.. పంట పొలాలు ఎండిపోతున్నాయి.

చెక్‌డ్యాంలు నిర్మించి అవగాహన కల్పించాలి
బాల్‌రెడ్డి - రైతు సంఘం జిల్లా కార్యదర్శి, వనపర్తి

పడిపోతున్న భూగర్భ జలాలపై రైతులు, ప్రజలకు అవగహన కల్పించాలి. వర్షాల వల్ల వచ్చే వరదలను నిల్వ చేసేందుకు చెక్‌డ్యాంలు నిర్మించాలి. తద్వారా భూగర్భజలాలు పెంచే అవకాశం ఉంది. కెఎల్ఐ జూరాల, నెట్టెంపాడు బీమా పథకాల ద్వారా వచ్చే నీటిని నిల్వ చేయడానికి చెక్‌డ్యాంలు, రిజర్వాయర్లు నిర్మించాలి.కల్వకుర్తి ఎత్తిపోతల కింద వచ్చే నీటికి చెక్‌డ్యాంలు ఏర్పాటు చేయాల్సి ఉంది.

తాగునీటి ఇబ్బందులు
పెద్ద మల్లయ్య- వెల్టూరు గ్రామం



చెంతనే కృష్ణా నది ఉన్నా అక్టోబర్ నుంచి వేసవిలో కూడా తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. వెల్టూర్ దగ్గర జోగులాంబ బ్యారేజీ నిర్మిస్తే భూగర్భ జలాలు పెరిగి సాగు, తాగునీటి సమస్య తీరుతుంది. అధికారులు అధ్యయనం చేయాలి.


సంపాదకీయం

గోమూత్ర అపవిత్రం!

శతాబ్దాలు దాటుతున్నా వెంటాడుతున్న దుర్మార్గం. పుట్టుకనే అపవిత్రమనీ, జీవితమూ అపవిత్రమనీ, హీనంగా, నీచంగా, మనుషుల్ని ఊరవతలికి వెలికొట్టిన దుష్టత్వం ఇప్పుడూ మరింత జడలు విప్పుతూ వికృతమై విహరిస్తోంది. తొంభైయేండ్ల క్రితమే ఈ వికృత బోధన నిండివున్న మనుధర్మశాస్త్రాన్ని దహనం చేసి, మనుషులంతా సమానులని

> మనువాద ప్రబోధం అస్పృశ్యత ఒక్కటి మాత్రమే కాదు, అన్ని విషయాలలోనూ అది మనుషుల్ని తక్కువ చేస్తుంది. లైంగిక దాడికో, హత్యకో దళితులు, ఆదివాసీలు గురయితే అదేమంత నేరంగా పరిగణించదు. అదే అగ్రవర్ణాలపై జరిగితే మహానేరమవుతుంది. అందుకే హత్రాస్‌లో, వున్నావోలో జరిగిన ఘటనలు, వారికి అంతతీవ్రమైనవిగా అనిపించవు. అందుకే బిల్కిస్ బానో కేసులో నిందితులని నిర్ధారణయి శిక్షలు పడ్డవారినీ విడుదల చేసి వారి ఔదర్యాన్ని ప్రకటిస్తుంటారు. స్త్రీల పట్ల అసమానతలను స్పష్టంగానే ప్రకటిస్తుంది ఆవాదం. అలాంటి మనుస్మృతిని తమ పవిత్ర గ్రంథంగా చెప్పకునేవారు రాజ్యాంగాన్నీ, శాస్త్రీయతను ఎలా గౌరవిస్తారు!

నినదించిన అంబేద్కర్ జయంతినాడు ఆయనను స్మరించుకున్న నేలను గోమూత్ర గంగాజలాలతో లజ్జారహితంగా పవిత్రం చేసుకున్న ఘటన మనుషులను సిగ్గుపడేలా చేస్తోంది. మొన్ననే అంబేద్కర్ నూటముప్పయిరెండేండ్ల జయంతి ఉత్సవాలను ఈ దేశం జరుపుకుంది. ప్రభుత్వాలూ, నాయకులు అంబేద్కర్ సేవలను కొనియాడారు. అందులో భాగంగానే ఆయన జన్మించిన రాష్ట్రం మహారాష్ట్రలోని నాగపూర్‌లో దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలు, మైనారిటీలు జయంతి సభకు వచ్చి ఆ ప్రాంతాన్ని అపవిత్రం చేశారంటూ సభానంతరం బీజేపీ కార్యకర్తలు, ఆరెస్సెస్ కార్యకర్తలు ఆ ప్రదేశంలో గోమూత్రం, గంగాజలాన్ని చల్లి శుభ్రం చేశామని బహిరంగంగానే ప్రకటించారు. నిజంగా ఆ దృశ్యాన్ని చూస్తుంటే మనం ఎంతెంత వెనక్కి, అంధకార మూఢత్వంలోకి నెట్టబడుతున్నామోనని బాధేస్తోంది! వాస్తవంగా గోమూత్రమూ, దాన్ని చల్లిన కల్మష మనుషులతో ఆ ప్రాంతమంతా అపవిత్రమూ, మురికీ నిండిపోయింది.



బీజేపీ, సంఘ్ పరివారం అసలు స్వరూపం, స్వభావం అది. ఈ దేశంలో అసంఖ్యాకంగా ఉన్న దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీల పట్ల వివక్షాపూరిత, అమానవీయ విధానం వారిది. మనుధర్మం బోధించిన కుల ధర్మాచారం పవిత్రంగా భావించి, కులమత వివక్షతలకు తావులేని సమాన హోదాను కల్పించిన రాజ్యాంగ విలువలను పాతిపెడుతున్న వారి ఆగడాలు మరింత విజృంభిస్తున్నాయి. ఈ దేశానికి తలెత్తుతున్న ప్రమాదం అధికారమై బుసలుకొడుతోంది. వివక్షత, అస్పృశ్యతా భావన ఎక్కడో మనస్సంతరాలలో ఉంటుందనుకున్న రోజులు పోయి, పవిత్రం, అపవిత్రం అంటూ అధికారమే విభజనకు దిగుతున్న చిత్రం ఆందోళన కలిగించే అంశం. ఇది మధ్యయుగాల చీకటిని తిరిగి తోడిపోస్తున్న దుర్మార్గం. కులం పోలేదు. కుల పునాదులూ పోలేదు. అయితే కులాల నిచ్చెనమెట్లను సమర్థిస్తున్న దురహంకార శక్తులు పెరిగిపోవటం కలవరపెట్టే విషయం.

అందుకే కర్నాటక మాజీ మంత్రి పరమేశ్వర్ ఇటీవల కుల వ్యవస్థ గురించి, తాను అనుభవించిన విషయాలనూ పంచుకున్నారు... "విదేశాలలో చదివాను, అత్యున్నతమైన డాక్టరేటు పొందాను, ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగానూ పనిచేశాను. అయినా ఇప్పటికీ నన్ను ఆలయాల్లోకి అనుమతించకపోవటం విచారకరం" అని వాపోయాడు. ఇప్పటికీ పూజకోసం ఆలయానికి వెళితే అర్చకులే బయటికి వచ్చి హారతిస్తారని, ఇలాంటి దయనీయ పరిస్థితి ఇంకా కొనసాగడం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. తాగునీటినీ కుల వ్యవస్థ వెంటాడుతోంది. కుక్కసైతం చెరువు వద్దకు వెళ్ళి నీరు తాగగలదు. కానీ దళితులు చెరువులోని నీటిని తాకలేరు. ఇదెంతటి అమానవీయమన్న ఆయన బాధ కేవలం ఆయనదే కాదు, మానవత నిండిన ప్రతివారిదీనూ. తరతరాలుగా సాగుతున్న ఈ జాఢ్యం పునర్జననమొందుతూనే ఉంది. మతమౌఢ్యం మరింత ఆజ్యం పోస్తోంది.

మనువాద ప్రబోధం అస్పృశ్యత ఒక్కటి మాత్రమే కాదు, అన్ని విషయాలలోనూ అది మనుషుల్ని తక్కువ చేస్తుంది. లైంగిక దాడికో, హత్యకో దళితులు, ఆదివాసీలు గురయితే అదేమంత నేరంగా పరిగణించదు. అదే అగ్రవర్ణాలపై జరిగితే మహానేరమవుతుంది. అందుకే హత్రాస్‌లో, వున్నావోలో జరిగిన ఘటనలు, వారికి అంతతీవ్రమైనవిగా అనిపించవు. అందుకే బిల్కిస్ బానో కేసులో నిందితులని నిర్ధారణయి శిక్షలు పడ్డవారినీ విడుదల చేసి వారి ఔదర్యాన్ని ప్రకటిస్తుంటారు. స్త్రీల పట్ల అసమానతలను స్పష్టంగానే ప్రకటిస్తుంది ఆవాదం. అలాంటి మనుస్మృతిని తమ పవిత్ర గ్రంథంగా చెప్పుకునేవారు రాజ్యాంగాన్నీ, శాస్త్రీయతను ఎలా గౌరవిస్తారు! హిందువులంతా బంధువులంటారు. అంటుకోవటం అపరాధమంటారు. పైకి మాత్రం చాలా మాటలు వినిపిస్తారు. ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలన్నింటికి బౌద్ధం పరిష్కారం చూపుతుందని చెబుతూనే... మత, కుల, కల్మష బుద్ధులతో, నీచత్వంతో వ్యవహరించటం వారికే చెల్లుతుంది. గంగాజలం చల్లితే పవిత్రం కాలేరు వీళ్ళు. గంగలో ముంచేసినా వారి మనసుల మలినం అంతరించదు. సాంస్కృతిక విప్లవం వెల్లువెత్తాల్సిందే!



చరిత్ర ఆయుధంగా హిందూత్వ మతోన్మాద ప్రాజెక్టు

ఆదిత్య ముఖర్జీ, మృదుల ముఖర్జీ

(నిన్నటి సంచిక తరువాయి)

2014, 2019లో బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడంతో ఆర్ఎస్ఎస్, బీజేపీలు తమకు అనుకూలమైన చరిత్రను తిరగరాసే అవకాశాన్ని పొందాయి. ముద్రణలో ఉన్న ఎన్‌సీఈఆర్టీ పాఠ్యపుస్తకాల్లోని తొలగింపుల నివేదికలు బయటపడడం మొదలయ్యాయి. 2001లో వలె ఎన్‌సీఈఆర్టీ పాఠ్యాంశాల తొలగింపులకు ముందు ఆర్ఎస్ఎస్ ప్రచురణలు కూడా దాన్నే డిమాండ్ చేశాయి. జూన్ 2021లో బీజేపీ ఈ-ట్రైనింగ్ సెల్ నేషనల్ కన్వీనర్ నేతృత్వంలోని 'పబ్లిక్ పాలసీ రీసెర్చ్ సెంటర్' ప్రస్తుత చరిత్ర పాఠ్యాంశాల్లో మార్పుల్ని డిమాండ్ చేస్తూ ఒక నివేదికను రూపొందించింది. అదేవిధంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త సహస్రబుద్ధే నేతృత్వంలోని పార్లమెంటరీ కమిటీ కూడా ఇలాంటి నివేదికనే రూపొందించింది. ఎన్ సీఈఆర్టీ సవరించిన సిలబస్‌ను రూపొందించింది. ఈ సిలబస్‌లో మొగలుల కాలంనాటి చరిత్రతో పాటు ఢిల్లీ సుల్తానులు, తుగ్లక్‌లు, ఖిల్జీలు, లోడీల చరిత్ర భాగాల్ని భారీగా తొలగించారు.

ఇది పూర్తిగా విద్యావిషయక వ్యవహారమని అనుకోకుండా కేంద్ర హోంశాఖ మంత్రి నవంబర్ 24, 2022న గత చరిత్ర వక్రీకరణల్ని తొలగించడానికి భారతదేశం తన చరిత్రను గర్వంగా తిరగరాసే పనిని ఎవరూ ఆపలేరని ప్రకటించాడు. డిసెంబర్ 26, 2022న ప్రధానమంత్రి ఇప్పటివరకు "బోధించబడిన కల్పిత కథనాల" గురించి మాట్లాడి, వాటిని సరిచేయాల్సిన అవసరం ఉందన్నాడు. "ఒకవైపు తీవ్రవాదం, మరొకవైపు ఆధ్యాత్మిక వాదం. ఒకవైపు మతోన్మాదంతో అంధుడైన శక్తివంతుడైన మొగల్ సుల్తాన్, మరోవైపు విజ్ఞానంతో ప్రకాశిస్తున్న మన గురువులు పురాతన భారతదేశ సూత్రాలతో జీవిస్తున్నారు" అని ప్రధాని ప్రకటించాడు.

అన్ని తొలగింపులతో కూడిన కొత్త పాఠ్యపుస్తకాలు ఏప్రిల్ 2023లో మార్కెట్ లోకి వచ్చాయి. పుస్తకాలు విడుదలైన వెంటనే మళ్ళీ బీజేపీ నాయకుడు కపిల్ మిశ్రా ఏప్రిల్ 4, 2023న ఇలా ప్రకటన చేశాడు... "ఎన్ సీఈఆర్టీ సిలబస్ నుండి మొగలుల తప్పుడు చరిత్ర తొలగింపు గొప్ప నిర్ణయం. దొంగలు, జేబు దొంగల్ని మొగల్ సుల్తానులని, భారతదేశ చక్రవర్తులని పిలిచారు. అక్బర్, బాబర్, షాజహాన్, ఔరంగజేబులు చరిత్ర పుస్తకాల్లో లేరు, వారంతా చెత్తబుట్టలో ఉన్నారు." ముస్లింలను నిత్యం దూషించడం, రోడ్లకు, నగరాలకు పెట్టిన వారి పేర్లను తొలగించే ప్రయత్నాలు, ఇప్పుడు కొత్త పాఠ్యపుస్తకాలు, ఇవన్నీ ముస్లింల పట్ల వారికున్న ఆలోచనలకు అనుగుణంగానే జరిగాయి. ముఖ్యంగా 2002 గుజరాత్ అల్లర్లకు సంబంధించిన అంశాలు, ఈ అల్లర్లను నరేంద్రమోడీ నాయకత్వం లోని గుజరాత్ ప్రభుత్వం ఎలా అదుపు చేసిందనే విషయంపై జాతీయ మానవహక్కుల కమిషన్ పరిశీలనలు లాంటి తదితర అంశాల్ని కూడా పాఠ్యాంశాల నుండి తొలగించారు.

ఒక జాతి సంహారానికి ముందుగా ఇతర మతాలకు చెందిన వారిని ప్రమాదకారులుగా చూపించడం, వారి పేర్లను మార్చడం, వారి చరిత్రను చెరిపి వేయడం, వారి రోజువారీ జీవితంలో ప్రజలు ఎవరూ కలవకుండా వారిని ప్రత్యేకమైన ప్రాంతాలకు తరలించడం జరుగుతుందని అనేక ప్రపంచ పరిశోధనలు తెలియజేస్తున్నాయి. ఈ ప్రక్రియలు భారతదేశంలో ఇప్పటికే మొదలయ్యాయి. దేశంలోని అనేక ప్రాంతాల్లో ముస్లింల సంహారానికి బహిరంగంగా పిలుపులు ఇస్తున్నారు. ఈ దేశంలో ఇలాంటి నేరాలకు ఎలాంటి శిక్షలు లేకుండా పోయాయి. ఇలాంటి చర్యల్ని గుర్తించి దేశంలోని ప్రజాస్వామిక శక్తులు వాటిని తీవ్రంగా ప్రతిఘటించాలి.


మొగలుల, సుల్తానుల కాలాల్ని చరిత్రలో లేకుండా చెరిపి వేయడం కూడా మన చరిత్ర అవగాహనకు చాలా హానికరం. భారత ప్రజలు ఈ కాలాన్ని హిందువులపై ముస్లింలు కొనసాగించిన ఆగడాలలో ఒకటిగా చూడలేదు. బ్రిటిష్ వలస సిద్ధాంతకర్తలు మొదటిసారిగా ఆ దృష్టితోనే ఈ కాలాన్ని వీక్షించారు. దీనిని హిందూ మతోన్మాదులు ప్రచారంలో పెట్టారు. 1857 సిపాయిల తిరుగుబాటు కాలంలో సైనికులు, అన్ని కులమతాలకు చెందినవారు బ్రిటిష్ వారిని పడగొట్టే ప్రయత్నం చేశారు. వారి స్థానంలో వచ్చింది మొగల్ చక్రవర్తి బహదూర్ షా జాఫర్ తప్ప వేరెవరో కాదు. మన పిల్లల్ని ఈ కాలంలోకి తొంగి చూడకుండా చేయడం అంటే ఎవరి కాళ్ళని వారే నరికేసుకోవడం లాంటిది.

పాఠ్యాంశాల తొలగింపులలో ఒకటి మహాత్మాగాంధీ హత్య. ఈ తొలగింపుల్ని కూడా చాలా రహస్యంగా చేశారు. ఏప్రిల్ 2022లో పాఠశాలలకు పంపిన జాబితాలో కూడా ఈ తొలగింపుల గురించి పేర్కొనలేదు. "భారతదేశాన్ని హిందువుల కోసం మాత్రమే మార్చే ఏ ప్రయత్నమైనా భారతదేశాన్ని నాశనం చేస్తుందనే" గాంధీ దృఢ విశ్వాసం గురించి, ఆయన హిందూముస్లిం ఐక్యత యొక్క దృఢమైన అన్వేషణ హిందూ తీవ్రవాదుల్ని ఎంతగా రెచ్చగొట్టిందో, వారు గాంధీజీని హత్య చేయడానికి ఎలాంటి ప్రయత్నాలు చేశారనే అంశాలు కూడా తొలగించబడ్డాయి. 12వ తరగతి చరిత్రలో గాంధీజీని హత్య చేసిన వ్యక్తికి సంబంధించిన రాజకీయ (సవరించిన పేరాలో) వివరాల్ని తొలగించారు. అది ఇలా ఉంది... "ఆయన రోజువారీ ప్రార్థనా సమయంలో (జనవరి 30న) గాంధీజీని ఒక యువకుడు కాల్చి చంపాడు. ఆ తరువాత లొంగిపోయిన గాంధీ హంతకుడు నాథూరాం గాడ్సే." ఇదే సమయంలో ప్రస్తుత రాజకీయ వాతావరణంలో నాథూరాం గాడ్సేను ఆరాధించడానికి అనుమతి ఇస్తున్నారు. బీజేపీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్, గాడ్సేని "దేశభక్తుడు" అని పిలిచిన తరువాత కూడా ఆమె మామూలుగానే కొనసాగుతుంది.

ఇలాంటి తొలగింపులతో మనం ప్రశ్నలు అడగని, ఆలోచించని భక్తుల తరాన్ని సృష్టించడంలో విజయం సాధిస్తాం. మన పిల్లలు మతాంధులుగా ఉండాలని మనం కోరుకోం. అదృష్టవశాత్తు ఈ తొలగింపులపై పెద్ద సంఖ్యలో విద్యావేత్తలు, అనేక రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిరసనలు వ్యక్తం చేశాయి. అనేక వార్తాపత్రికలు ఎన్‌సీఈఆర్టీ నిర్ణయాన్ని విమర్శిస్తూ సంపాదకీయాలు ప్రచురించాయి. రాజ్యాంగ ధర్మానికి, భారత ఉపఖండంలోని ప్రజాస్వామ్య, మిశ్రమ సంస్కృతికి వ్యతిరేకంగా విభజన లక్ష్యాలతో మార్గనిర్దేశం చేస్తున్న మార్పుల్ని వెంటనే ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేయాలి.

("ద వైర్" సౌజన్యంతో)
అనువాదం:బోడపట్ల రవీందర్, 9848412451

బీజేపీపై పోరాటం ప్రజాస్వామ్యానికి తొలిపాఠం



తెలకపల్లి రవి

తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో తరచూ ఒక అంశంపై చర్చ తప్పించబడుతుంటుంది. ఈ దేశాన్ని తొమ్మిదేండ్లుగా పాలిస్తూ మరోసారి వచ్చేది మేమేనంటున్న బీజేపీ గురించి దాని విధానాల మంచి చెడ్డల గురించి మన పత్రికలు విమర్శనాత్మకంగా పతాకశీర్షికలివ్వడం చాలా అరుదు. ప్రైమ్‌టైమ్ డిబేట్లు కూడా పెద్దగా ఉండవు. ఈ మధ్య తెలంగాణలో బండి సంజయ్ వంటివారి హడావుడి పెరిగింది గనక, కేసీఆర్, బీఆర్ఎస్ స్థాపించి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు గనక ప్రస్తావన ఉంటుందేమో గాని, ఏపీలో అయితే అసలే నాస్తి. బీజేపీకి ఇక్కడ బలమే లేదు. దాని గురించి మాట్లాడటం ఎందుకన్నది అధికార వైసీపీ, టీడీపీల మాట. జనసేన సరే నేరుగా బీజేపీతోనే చేతులు కలిపింది గనక విమర్శల ప్రసక్తి కనీసం చర్చ కూడా ఉండవు. టీడీపీ అధినేత చంద్రబాబు కూడా బీజేపీపై పూర్తి మౌనం పాటించాలని వారి నాయకులకు ఆదేశాలిచ్చారంటారు. ఎవరైనా పెదవి మెదిపితే వెంటనే ఆగ్రహిస్తారు. ప్రధాని మోడీ బాబును పలకరించారనీ, ఫోన్ చేశారనీ గొప్పగా చెప్పుకుంటారు. మేమే ఆయనకు సలహాలిచ్చాం అని గొప్పలు పోతుంటారు. 2018కి ముందు మతతత్వంపై చెలరేగిపోయిన చంద్రబాబు ఇప్పుడు అదంతా మ్యూట్ చేశారు. ఇక ముఖ్యమంత్రి జగన్ ఆయన పార్టీ ప్రభుత్వమూ మోడీకి అతి వీర విధేయులు. పదేపదే ఢిల్లీ వెళ్లి ఆయన ఆదేశాలు తీసుకుని అభ్యర్థనలు సమర్పించి రావడం తప్ప, ఇవ్వాల్సిన విశాఖ ఉక్కు వాటికోసం

> కమ్యూనిస్టులకేదో సైద్ధాంతిక చాదస్తం పట్టి బీజేపీని ప్రథమ రాజకీయ ప్రమాదంగా పరిగణిస్తున్నారని వాదించేవారిలో ఈ పార్టీల వారే గాక ఇతరులు కూడా ఉంటారు. మొదటే అన్నట్టు ఒక జాతీయ కోణం మితవాద, మతవాద రాజకీయాల ముప్పు వీరికి తెలియదా? ఎన్నికల సంఘం, సుప్రీం కోర్టు న్యాయవ్యవస్థ, ప్రతిపక్షాల పాత్ర, విద్యారంగం, చరిత్ర, సైన్సు, ప్రజాస్వామ్యం, లౌకిక భావన, రాష్ట్రాల హక్కులు, పార్లమెంటు చర్చలు, దర్యాప్తు సంస్థలు, ప్రభుత్వరంగం, మహిళల హక్కులు, మతస్వేచ్ఛ, మీడియాస్వేచ్ఛ, సినిమాల సెన్సార్, కార్మిక ఉద్యోగ హక్కులు వంటి ప్రతి ప్రజాస్వామిక విలువకూ చట్టాలకూ శిలువ వేస్తున్న మోడీ సర్కారును ప్రతిఘటించకపోతే ప్రజాస్వామ్యం ఏమవుతుంది?

పట్టుపట్టిన ఉద్యమించిన దాఖలాలే లేవు. పోనీ ఇందుకు బీజేపీ ప్రతిస్పందన గమనిస్తే ఏపీ బీజేపీ నాయకులు నిరంతరం జగన్ సర్కారుపై దాడి చేస్తుంటారు. అంతర్వేది నుంచి అంతర్యామి శ్రీనివాసుని వరకూ ప్రతి పుణ్యక్షేత్రాలలో చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తుంటారు. మతపరమైన ఉద్రేకాలు రెచ్చగొట్టడానికి విఫలయత్నాలు చేస్తుంటారు.


పిల్లివచ్చె, ఎలకాభద్రం

వైసీపీ నాయకులెవరైనా ఎప్పుడైనా రాష్ట్ర బీజేపీవారిని ఒక మాట అంటారు తప్ప కేంద్రం జోలికి పోరు. పైగా మత రాజకీయాలలో తాము తీసిపోమని ముఖ్యమంత్రి గోపూజల్లోనూ దైవదర్శనాలు పీఠాధిపతుల ఆశీస్సుల స్వీకారంలో పోటీ పడుతుంటారు. రాష్ట్రానికి నిధులివ్వని హామీలు నెరవేర్చని మోడీ సర్కారుపై ఈ మూడు పార్టీలకూ ఇంత భయమెందుకో మాత్రం చెప్పరు గానీ అందరికీ తెలుసు. వైసీపీది పరోక్ష మద్దతు, జనసేనది పరోక్ష మద్దతు, టీడీపీది గత మద్దతు భవిష్యత్తుకై తపస్సు ఇంకా విపరీతమేమంటే రాష్ట్రపతి పాలన విధించాలనీ ఆర్థిక ఎమర్జన్సీ ప్రకటించాలని టీడీపీ నేతలు కేంద్రాన్ని కోరుతుంటారు. కేంద్రం చెప్పే కరెంటు మీటర్లు డిస్కంలు వంటి ఆదేశాలను బీజేపీ సర్కార్ల కంటే ముందు ఏపీ ప్రభుత్వమే అమలు చేస్తూ ప్రజలపై భారాలు మోపుతుంటుంది. అదే తెలంగాణలో కాంగ్రెస్ గానీ, మరికొన్ని చిన్న పార్టీలూ గానీ కేంద్ర బీజేపీ మత రాజకీయాలను పెత్తందారీ పోకడలతో రాష్ట్ర హక్కులు హరించడాన్ని పెద్దగా పట్టించుకోవు. కేసీఆర్ కుటుంబ పాలనను అంతం చేయడమే ఏకైక లక్ష్యమన్నట్టు కేంద్ర జోక్యాన్ని ఆహ్వానిస్తుంటాయి. ప్రతిపక్షాలతో కలిసి ఈడీ, సిబిఐ, ఐటి వేధింపులపై కేసు వేసే కాంగ్రెస్ నేతలు రాష్ట్రంలో మాత్రం మరింత గట్టిగా దర్యాప్తు చేయలేదేమని ఆక్షేపిస్తుంటారు. బీఆర్ఎస్ బీజేపీ ఒకటేనని తిట్టిపోస్తుంటారు. మరోవంక బీఆర్ఎస్ కూడా కాంగ్రెస్ బీజేపీ ఒకటే నంటే బీజేపీ ఈ ఇద్దరూ ఒకటేనంటుంది. ఇదంతా ఒక ప్రహసనం. రాజకీయ అవకాశవాదం. ఇవన్నీ తాము చేస్తూ సీపీఐ(ఎం) వామపక్షాలపై ఎదురు దాడి చేస్తుంటారు. బీజేపీని గురించి తర్వాత మాట్లాడ వచ్చు, రాష్ట్ర సర్కార్లపై ముందు యుద్ధం చేయాలని చిందులేస్తుంటారు. ఇందులో చేతులు కలపకుండా బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వడమేమిటని తిట్టిపోస్తుంటారు. మునుగోడులో వామపక్షాల మద్దతు కారణంగానే బీఆర్ఎస్ గట్టెక్కడంతో ఇలాంటి వారి కోపం మరీ శృతిమించినట్టు కనిపిస్తుంది. కమ్యూనిస్టులేదో పొత్తుల కోసం, సీట్ల పాకులాడుతున్నట్టు వ్యతిరేకులతో కలిసి ఆరోపిస్తుంటారు. మన మీడియా మొత్తం ఈ గాడిలోనే సంచరిస్తుంటుంది గనక షరా మామూలుగా కమ్యూనిస్టులను ఆపహాస్యం చేసేందుకు ఆరాటపడు తుంటుంది. ఈ ఒక్కుమ్మడి దాడితో ఉద్యమాభిమానుల లోనూ కొన్నిసార్లు తికమక సృష్టిస్తారు.

రాష్ట్రాలు దేశం వేర్వేరా?

ఏపీ, తెలంగాణ రాజకీయాలు దేశ రాజకీయాలలో భాగం తప్ప విడిగా ఉండవు. ఆ రాజకీయాలను నిశితంగానూ జాగ్రత్తగానూ పరిశీలించేవారెవరికైనా బీజేపీ పాలన ఎంత ప్రమాదకరంగా తయారైందో తెలుస్తుంది. రాష్ట్రాలను దిష్టిబొమ్మలుగా మార్చి రాజ్యాంగ సూత్రాలను తుంగలో తొక్కి బీజేపీ మరీ ముఖ్యంగా ప్రధానిమోడీ నిరంకుశాధికారం చెలాయిస్తున్న తీరు గతంలో ఎరగం. ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ నాటికంటే ఈ అప్రకటిత ఎమర్జన్సీ భయంకరంగా సాగుతున్నది. నేను తల్చుకుంటే మీ ప్రభుత్వం ఉండేదా అని తెలంగాణ గవర్నర్ తమిళిసై కేసీఆర్‌ను ప్రశ్నిస్తారు. అనేక బిల్లులపై సంతకం చేయకుండా ప్రతిష్టంభన సృష్టిస్తే ఆ ప్రభుత్వం సుప్రీం కోర్టుకు వెళ్లవలసి వచ్చింది. అక్కడ ఏవో అంగీకరించినట్టు చెప్పి మళ్లీ షరామామూలే! ఏపీకి ప్రత్యేక హోదా నిరాకరణ, పోలవరం నిధుల బిగింపు, రాజధానికి సహాయ నిరాకరణ, రెవెన్యూ లోటు భర్తీకి తిరస్కరణ అన్నీ ఈ పరంపరలోవే. రాజకీయంగా జగన్ సర్కారు ఎంతగా లోబడ వ్యవహరిస్తున్నా మోడీ సర్కారు తీరులో మార్పులేనేలేదు. గతంలో కేసీఆర్ కూడా చాలా సానుకూలంగా ఉండేవారు. దాని వల్ల చీమంత ప్రయోజనం లేదని తెలిశాకే వ్యతిరేక వైఖరి తీసుకున్నారు. ఆ మాటకొస్తే చంద్రబాబు నాయుడు కూడా 2014-18 మధ్య మోడీ ప్రభుత్వంలో ఉండి వారినీ చేర్చుకుని ఆ తర్వాతే ఎన్నికల సమయంలో అడ్డం తిరిగారు. తమాషా ఏమంటే 2019 ఎన్నికల్లో అధిక సీట్లతో గెలిచాక మోడీ నిరంకుశత్వం పెరిగిందే గానీ తగ్గలేదు. చంద్రబాబు మాత్రం అనుకూల వైఖరి ఎత్తుకున్నారు. పవన్‌కళ్యాణ్ కూడా 2018-19లో మోడీపై నిప్పులు చెరిగారు. తర్వాత చల్లగా ఆ పక్షానే చేరారు. ఓట్ల చీలిక నివారించాలంటూ బీజేపీని ప్రసన్నం చేసుకోవడానికి తంటాలు పడుతున్నారు. జగన్‌కు వ్యతిరేకత పేరిట బీజేపీ, టీడీపీ, జనసేన కలవాలనేదే ఈ శిబిరంలో ప్రధాన కాంక్షగా ఉంది. తెలంగాణలో కేసీఆర్‌కుటుంబ పాలన తప్ప బీజేపీ సమస్య కాదన్నటు కాంగ్రెస్ వ్యవహరిస్తుంది.

కమ్యూనిస్టులకేదో సైద్ధాంతిక చాదస్తం పట్టి బీజేపీని ప్రథమ రాజకీయ ప్రమాదంగా పరిగణిస్తున్నారని వాదించేవారిలో ఈ పార్టీల వారే గాక ఇతరులు కూడా ఉంటారు. మొదటే అన్నట్టు ఒక జాతీయ కోణం మితవాద, మతవాద రాజకీయాల ముప్పు వీరికి తెలియదా? ఎన్నికల సంఘం, సుప్రీం కోర్టు న్యాయవ్యవస్థ, ప్రతిపక్షాల పాత్ర, విద్యారంగం, చరిత్ర,



సైన్సు, ప్రజాస్వామ్యం, లౌకిక భావన, రాష్ట్రాల హక్కులు, పార్లమెంటు చర్చలు, దర్యాప్తు సంస్థలు, ప్రభుత్వరంగం, మహిళల హక్కులు, మతస్వేచ్ఛ, మీడియాస్వేచ్ఛ, సినిమాల సెన్సార్, కార్మిక ఉద్యోగ హక్కులు వంటి ప్రతి ప్రజాస్వామిక విలువకూ చట్టాలకూ శిలువ వేస్తున్న మోడీ సర్కారును ప్రతిఘటించకపోతే ప్రజాస్వామ్యం ఏమవుతుంది? ఆ ఖరుకు డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించి మహాత్మాగాంధీ హంతకుణ్ని కూడా దేశ భక్తునిగా చిత్రించిన తర్వాత ఈ దేశ ఘన వారసత్వం ఏమవుతుంది? ఆర్థిక రంగంలోనూ పెద్దనోట్లరద్దు వంటి బాధ్యతా రహిత నిర్ణయాలు చేసి మరోవైపున రిజర్వుబ్యాంకు నుంచి అదనపు నిల్వలు ఖాళీ చేస్తున్న వైనాన్ని విస్మరిద్దామా? సామాన్యుల పన్నులను పెంచి వసూళ్లు బిగించి బడా కుబేరులను కాపాడటం, అదానీ వంటి కళంకిత కుబేరులకు సమస్తం కట్టబెట్టడమే గాక విదేశాలకు అనధికార రాయబారులుగా పంపడం మర్చిపోదామా? కమ్యూనిస్టులు బీజేపీ పాలనపై

> కాంగ్రెసే బీజేపీని ఎదుర్కొగల శక్తిగా ఉంటే బలపర్చేవారమనీ ఆ పరిస్థితి లేదు గనకే బీఆర్ఎస్‌కు మద్దతు నిస్తున్నామని తెలంగాణ సీపీఐ(ఎం) కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పడానికి కారణమదే. అంతిమంగా ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు కుదిరేది లేనిది అంతిమంగా తేలుతుంది. బీజేపీపై పోరాటం మాత్రం ప్రథమ కర్తవ్యం. ఇక ఏపీలోనూ ఎవరితోకలసి పనిచేయాలి, ఎన్నికల పోరాటం ఎలా చేయాలి అనేది ఈ అంశంపైనే ఆధారపడి ఉంటుంది. బీజేపీతో ఏ మాత్రం సంబంధం ఉన్నా తాము ఆమోదించేది ఉండదని సీపీఐ(ఎం) ఏపీ కార్యదర్శి శ్రీనివాసరావు కూడా స్పష్టం చేశారందుకే.

పోరాడాలని చెప్పడంలో కొన్ని కఠోరవాస్తవాలివి.

మారణహోమంలో అవకాశవాదమా?

రాష్ట్రాల్లో అధికారంకోసం ఏవైనా పార్టీలు జాతీయ ఉపద్రవం వంటి మత రాజకీయాలను కార్పొరేట్ విధాన విన్యాసాలను విస్మరించవచ్చు గాని వామపక్షాలు ఒకనాటికి ఆ పనిచేయవు. దేశంలో ఒకమేరకైనా మతతత్వ కేంద్రీకృత పాలనకు వ్యతిరేకంగా ప్రతిపక్షాల ఐక్యత పెరుగుతుంటే తెలుగునాట ప్రాంతీయ పక్షాలూ కాంగ్రెస్ కూడా ఆ విషయంలో ఉదాసీనత వహించడం దురదృష్టకరం. కాంగ్రెసే బీజేపీని ఎదుర్కొగల శక్తిగా ఉంటే బలపర్చేవారమనీ ఆ పరిస్థితి లేదు గనకే బీఆర్ఎస్‌కు మద్దతు నిస్తున్నామని తెలంగాణ సీపీఐ(ఎం) కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పడానికి కారణమదే. అంతిమంగా ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు కుదిరేది లేనిది అంతిమంగా తేలుతుంది. బీజేపీపై పోరాటం మాత్రం ప్రథమ కర్తవ్యం. ఇక ఏపీలోనూ ఎవరితోకలసి పనిచేయాలి, ఎన్నికల పోరాటం ఎలా చేయాలి అనేది ఈ అంశంపైనే ఆధారపడి ఉంటుంది. బీజేపీతో ఏ మాత్రం సంబంధం ఉన్నా తాము ఆమోదించేది ఉండదని సీపీఐ(ఎం) ఏపీ కార్యదర్శి శ్రీనివాసరావు కూడా స్పష్టం చేశారందుకే. అయినా టీడీపీ ఇప్పటికి ఒకటికి రెండుసార్లు బీజేపీ విషయంలో అవకాశవాద కలయిక కట్టిన తీరు మర్చిపోలేం. ఇప్పటికీ టీడీపీపైనో, జనసేనపైనో ఇంకా ఆశలున్నవారు ఉంటే ఉండొచ్చు గాని ఆ ఉభయులు బీజేపీని వదులుకునే సూచనలే కనిపించడం లేదు. ఉన్నావోలో గతంలో యువతిపై ఘోర లైంగికదాడి ఒకటైతే జైలు నుంచి బెయిలుపై వచ్చిన బీజేపీ వర్గీయులు ఆమె ఇంటిని తగలబెట్టి పసికందును భర్తను బలిగొనడం తాజాఘట్టం. గుజరాత్‌లో బిల్కిస్ బానోపై పైశాచికంగా లైంగికదాడి చేసిన వారికి స్వేచ్ఛ ప్రసాదించిన కేంద్రం గుజరాత్ ప్రభుత్వం నిర్ణయం గగుర్పాటు కలిగిస్తుంది. ఇతర మతస్తులపై విద్వేషం రగిలించడమే పనిగా పెట్టుకున్న వారు భిన్న మత నిలయంగా బహుళ సంస్కృతికి ఆట పట్టయిన ఈ దేశానికి ఎంతటి ప్రమాదాన్ని తెచ్చిపెడు తున్నారు? హైదరాబాదులో ఈ క్షణంలో కూడా సర్జికల్ స్ట్రయిక్స్ గురించి బెదిరించడం చూడలేదా? రాష్ట్ర ప్రభుత్వాల తప్పులపై హానికర నిర్ణయాలపై పోరాడ వలసిందే. కానీ ఆ పేరిట బీజేపీతో జత కట్టడం దేశానికే చేటు. కనుక బీజేపీపై పోరాటం ఏదో రాజకీయ ఎత్తుగడ కాదు, భారతీయుల రాజ్యాంగ విహిత కర్తవ్యం. దీన్ని వక్రంగా చిత్రించడం లేదా తక్కువచేసి చూపడం బాధ్యతా రహితం. దురుద్దేశ పూరితం.

ఎ ఎస్ డి ఎఫ్ జి...



జంధ్యాల రఘుబాబు

ఈమధ్య మా ఆఫీసులో పనిచేసే జూనియర్ అసిస్టెంటు దస్తగిరి నేనేదో సిస్టంలో టైప్ చేస్తుంటే అన్నివేళ్ళతో చేస్తారు కద సార్ అన్నాడు. మరి? అన్న నా కొచ్చెన్ మార్కు ముఖం చూసి ఏమనుకున్నాడో ఏమో ఎక్కువ మంది నాలుగు వేళ్ళతో అంటే చెరో చేయి నుండి రెండువేళ్ళను మాత్రమే వాడతారని తానే చెప్పాడు. మీరు చిన్నప్పుడు టైపు నేర్చుకున్నారు కాబట్టి ఇలా చేస్తున్నారు అని తానే మళ్ళీ సమాధానమిచ్చాడు. ఇప్పుడు కీ బోర్డుపై రోజూ టైపు చేసి అలవాటు చేసుకోవాలేగాని ఎవరైనా అలాగే చేయొచ్చు.

అప్పుడు గుర్తొచ్చింది చిన్నప్పుడు ఎ, ఎస్, డి, ఎఫ్, జి, కోలన్, ఎల్, కె, జె, హెచ్ అని మొదట్లో టైపు చేయడం. చిన్నప్పుడు అ, ఆ, ఇ, ఈలు తరువాత ఏ, బి, సి, డిలు రాస్తుంటే పడ్డ తిప్పలు గుర్తొచ్చాయి. టైపు చేయబోతే అసలు కొన్ని అక్షరాలు పడనే పడవు, ఒకటే తిప్పలు. వేళ్ళు అక్షరాల కీబోర్డుల మధ్యలో ఇరుక్కుపోతాయి. ఎవరూ చూడకుండా వాటిని బైటికి లాక్కోవడం. అలాంటిది టైపు రైటర్లో ఆ వరుసనే కాదు పైవరుస, తరువాత కిందిది ఇలా అన్నీ నేర్చుకొని ఎ, బి, సి, డిలు చేసే స్థాయికి, పదాలు చేసే లెవెలుకు, అ క్విక్ బ్రవున్ ఫాక్స్ అంటూ ఇంగ్లీషు వర్ణమాల అంతా వచ్చేలా ఉండే ఒక వాక్యాన్ని రోజూ టైపు చేయడం, చిన్న చిన్న పేరాలు ఇలా ఎన్నో గుర్తొచ్చాయి. రోజూ సాధన చేస్తే ఇక మెదడుతో అవసరం లేకుండా చేతులు తమంత తామే టైపు చేసే స్థాయికొస్తాం. బండి నడపడమూ అంతే, మనకు తెలిసిన రూట్లో అదంతకదే పోతుంటుంది, మన అవసరం లేకుండానే. అంతెందుకు రోజూ పోతున్న దారిలో, పొలాన్నుండి వస్తున్న రైతు బండిలో నిద్రపోయినా అతణ్ణి ఇంటికి చేర్చే ఎద్దులనూ చూశాం. చెబితే కోపమొస్తుందేమో కాని మనం నిత్యం ఎస్.ఎస్.డి.ఎఫ్.జి అని టైప్ చేసినట్టు మూస జీవితాల్లో, మూస ఉద్యోగాల్లో, ఇంకా ఇంకా చెప్పాలంటే మూస ఆలోచనల్లో ఉండటంలేదా? అలా కోపమొచ్చినా నొచ్చుకోక కూసింత కళాపోషణ చేయొద్దూ ప్రతి ఒక్కరు. చిన్నప్పటినుండి చూస్తున్నాం అవే బడ్జెట్లు, అవే విమర్శలు, అవే సమర్థనలు. సినిమాల్లో పాటలు మారిండొచ్చు కాని హీరో చుట్టూ తిరిగే కథ, దానికి ఇంకొంతమందిని పక్కన పెట్టి అవే మూస కథనాలు. క్రికెట్ ఒక్కటే మార్పులు చేసుకుంటూ ఇరవై ఇరవై దాకా వచ్చిందంటే ఒప్పుకోవాల్సిందే. అఫ్ కోర్స్... దాని వెనుక వ్యాపార సామ్రాజ్యాలు ఉండొచ్చు. అయినా డార్విన్ మహాశయుడు చెప్పినట్టు బతికి బట్ట కట్టడానికి మార్పులు చేసుకోవలసిందే.

మూస మూస అనుకుంటూ టీవీ సీరియళ్ళను మరచిపోతే వాళ్ళకు కోపమొస్తుంది. సాగదీతకు, బబుల్‌గంలాంటి, రబ్బరులాంటి సాగే గుణం ఉన్నవాటి లిస్టులో ఈ టీవీ సీరియళ్ళనే మొదట వేసుకోవాలి. వాటిపైన జోకులూ అలాగే వస్తుంటాయి. అయినా అవి మారవు. హెచ్‌డీలో తీయడం, పాటలు పెట్టడం లాంటివి చేసినా అవి సినిమాల్లా అవుతున్నాయే తప్ప ఇతరత్రా మార్పులు ఊహూ...

కేంద్రీయ విద్యాలయాల్లో పనిచేసేటప్పుడు మాతోపాటు ఉన్న రమణ అనే ఎల్‌డిసి మొదటిరోజు ఉద్యోగంలో చేరినప్పుడు తాను భయపడ్డాడట. వాళ్ళ చిన్నాయన ధైర్యం చెప్పి



పంపాడు, అదేమిటంటే నీ ముందు పనిచేసిన క్లర్కులు ఎలా రాశారో నీవూ అలాగే రాస్తూ పో అంతే అని గీతకర్ణుడిలా చెప్పాడట. సరే రమణ ఉద్యోగంలో చేరాడు. ఆఫీసులోకి వచ్చి చూస్తే విషయం తెలిసింది, అదేమిటంటే ఆ స్కూలు మొదటి క్లర్కు తానే! అది మొదలుపెట్టిందే తమ బ్యాచతో. ధైర్యం చెప్పి పంపిన బాబాయిపై కోపం ఎంతొచ్చిందో అతనే చెప్పాలి. మళ్ళీ ఆ బాబాయే సలహా ఇచ్చాడు, అదేమంటే పాత స్కూళ్ళ రికార్డులు చూసిరమ్మని. కొంతలో కొంత బాబాయి అబ్బాయి కథ సుఖాంతమయింది. మొత్తం పైన గొర్రెదాటులా దాటమని చెప్పేటోళ్ళే ఎక్కువమంది. అలా ఎందుకు దాటాలి అని ప్రశ్నించేటోళ్ళు ఎంతమంది?

ఎం ఐ ఎల్ కె మిల్క్ ఎం ఐ ఎల్ కె మిల్క్ అని పలుకుతూ ఉంటే అదే వచ్చేస్తుంది స్పెల్లింగు. ఉప్పుకప్పురంబు పద్యమూ అంతే. క్లాసంతా కలిపి పలికేటప్పుడు మనం పలక్కపోయినా చెల్లిపోతుంది. వింటాం కాబట్టి అది మెదడులో సేవ్ అయిపోతుంది. అదే తరువాత జీవితంలోనూ అలవాటైపోతుంది చాలామందికి. ప్రపంచంలో జరిగేవన్నీ అందరికంటే బాగా చూస్తుంటారు. కామెంట్ చేయరు, లైక్ కొట్టరు, షేర్ చేయరు. నువ్వు 'ఎక్కడ మొదలయ్యావో అక్కడే ఉంటావు బిడ్డం' అన్నట్టు అక్కడే ఉండటం వారికి ఇష్టమైన పని అనుకుంటా. కడుపులోని చల్ల కదలకుండా జీవించడమూ ఓ కళే. అలాగని వీరలెవెల్లో ఇతరుల పనులు చేసుకుంటూ, తన పనిని తగలెట్టేసుకొమ్మని ఎవరూ తత్వబోధనలు చేయడం లేదిక్కడ. నీ చుట్టూతా ఏం జరుగుతుందో, నీకు తెలీకుండా, నీ ప్రమేయం లేకుండా ప్రజలకు జరిగే నష్టం గురించి తెలుసుకుంటే ఎక్కువవాటిల్లో నీకు కూడా నష్టం జరుగుతోందని తెలుసుకుంటే అంతేచాలు.

ఉండనీలెండి ఎవరికి వారు ఆత్మానందంతో ఉంటే అంతకన్నా జీవితానికి పరమార్థం ఇంకొకటి ఉంటుందా అని ఇంకో సగం స్వామీజీ చెప్పొచ్చు. అసలు నీ జీవిత పరమార్థమే ఇతరులకు మేలు చేయడం, సహాయం చేయడం, ఆపదలో

> చెప్పొచ్చే దేమిటంటే కొట్టందే టైపు అక్షరాలు కూడా పడవు, అడగందే అమ్మైనా పెట్టదు అన్నట్టు. అలా అడగకుండా రాలేదు, పెట్టలేదు, వైజాగు స్టీలును అమ్మేస్తున్నారు, సింగరేణికి ప్రమాదమొస్తోంది, ఇంకా ఎన్నెన్నో ప్రజలకు వ్యతిరేకంగా చేస్తున్నారు అనేకంటే అది మంచిది కాదని ప్రజలవైపు నాలుగు మాటలు చెప్పమని మనవి. లేదూ అలా చెబుతున్నోళ్ళకి సపోర్టు చేయమని వినతి. వింటే సరి, లేకపోతే హరి. ఆపైన ఎ.ఎస్.డి.ఎఫ్.జి... అంతే...

ఆదుకోవడం అని ఈ సగం స్వామీజీలెందుకు చెప్పరు అన్నదే నా ప్రశ్న అధ్యక్షా. ఊరికే కళ్ళతో స్క్రిప్ట్ చూస్తూ టైపు చేసుకుంటూ, ఇతరులతో మాట్లాడుకుంటూ కూడా చేస్తూ పనిని ఆనందించొచ్చు. ఆనందానికి మించిన పరమానందం ఇంకేముంటుంది బ్రహ్మానందం అనే వీరానందాలు నిత్యానందం అనుభవిస్తూ మస్తుగా కనిపిస్తారు మనకి. చెప్పొచ్చే దేమిటంటే కొట్టందే టైపు అక్షరాలు కూడా పడవు, అడగందే అమ్మైనా పెట్టదు అన్నట్టు. అలా అడగకుండా రాలేదు, పెట్టలేదు, వైజాగు స్టీలును అమ్మేస్తున్నారు, సింగరేణికి ప్రమాదమొస్తోంది, ఇంకా ఎన్నెన్నో ప్రజలకు వ్యతిరేకంగా చేస్తున్నారు అనేకంటే అది మంచిది కాదని ప్రజలవైపు నాలుగు మాటలు చెప్పమని మనవి. లేదూ అలా చెబుతున్నోళ్ళకి సపోర్టు చేయమని వినతి. వింటే సరి, లేకపోతే హరి. ఆపైన ఎ.ఎస్.డి.ఎఫ్.జి... అంతే... కొనసాగించండి...

సెల్:9849753298



ఆమె పుట్టింది ఓ సాధారణ కుటుంబం. అప్పటి వరకు ఇంట్లో ఎవరికీ పెద్దగా చదువుకోలేదు. తండ్రి టైలరింగ్ చేసి కుటుంబాన్ని పోషించేవారు. అలాంటి నేపథ్యం నుండి వచ్చిన ఆమె కసితో చదువుకున్నారు. పట్టుదలతో ఉన్నత విద్యను అభ్యసించారు. సైన్స్ రంగంలో విస్తృతమైన పరిశోధన చేశారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో మొదటి మహిళా యూనివర్సిటీ కోఠి ఉమెన్స్‌కు మొదటి వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆమే **ప్రొ.ఎం.విజ్జులత.** యూనివర్సిటీ అభివృద్ధి కోసం పక్కా ప్రణాళికతో ముందుకు పోతున్న ఆమెతో మానవి ఇంటర్వ్యూ...



మొదటి మహిళా యూనివర్శిటీకి వైస్ ఛాన్సలర్

> నేను ప్రిన్సిపల్‌గా ఉన్నప్పుడు మెంటర్ మెంటీ అనే పద్ధతిని ప్రవేశపెట్టాం. అంటే ప్రతి 20 మంది అమ్మాయిలకు ఒక టీచర్ మెంటర్‌గా ఉంటారు. వాళ్ళకు ఎలాంటి సమస్య వచ్చినా అది ఆర్థికంగా కావొచ్చు, మానసికంగా కావొచ్చు. ఆ సమస్య పరిష్కరించే విధంగా ఆ మెంటర్ ప్రయత్నం చేస్తారు. ఈ విషయంలో టీచర్స్ కూడా చాలా సపోర్ట్ చేస్తున్నారు. అమ్మాయిలు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా చదువుకునేలా ప్రయత్నం చేస్తున్నాము.



మొదటి మహిళా యూనివర్సిటీకి వీసీగా మీపై ఎలాంటి బాధ్యతలు ఉన్నాయనుకుంటున్నారు?

కోఠీ ఉమెన్స్ కాలేజీకి ఎంతో చరిత్ర వుంది. అలాంటి యూనివర్సిటీకి వీసీగా బాధ్యతలు తీసుకోవడం చాలా సంతోషంగా ఉంది. పైగా ఈ కాలేజీతో నాకెంతో అనుబంధం ఉంది. ఇదే కాలేజీలో నేను డిగ్రీ చదువుకున్నాను. ఏడాదిన్నర పాటు ప్రిన్సిపల్‌గా కూడా చేశాను. కాబట్టి ఇక్కడ ఎలాంటి సమస్యలు ఉన్నాయి, పిల్లలకు ఎలాంటి సౌకర్యాలు అవసరమో తెలుసుకోగలిగాను. ఆ సమస్యలన్నింటినీ పరిష్కరించే ప్రయత్నంలో ఉన్నాము. కాలేజీ అభివృద్ధి కోసం ఏం చేయాలి అనే అవగాహన కూడా ఉంది. వీసీ అయినందుకు వీటన్నింటినీ చేయగలను అనే దృఢ నమ్మకం వచ్చింది.

ఉన్నత విద్యలో అమ్మాయిల సంఖ్య ఎలా ఉందంటారు?

పీజీ వరకు అమ్మాయిల సంఖ్య బాగానే ఉంటుంది. అయితే పీహెచ్‌డీకి వచ్చే సరికి తగ్గిపోతున్నారు. పీజీ చేసి ఏదో ఒక ఉద్యోగం వస్తే చేసుకుందాం అనే ఆలోచనలో ఉంటున్నారు. అలాగే పెండ్లి, పిల్లలు, కుటుంబం అనే బంధాలు కూడా ఏర్పడతాయి. పెండ్లి తర్వాత కూడా ఉన్నత చదువు కొనసాగించి జీవితంలో స్థిరపడాలంటే ఉమ్మడి కుటుంబాలు ఉండాలి. పెద్ద వాళ్ళు ఇంట్లో ఉంటే పిల్లల్ని చూసుకుంటారు. మనం ఏదైనా చేయగలం. అలా కాకుండా నేనూ నా భర్త, నా పిల్లలు అనుకుంటే ఏమీ సాధించలేం. నేను పెండ్లి తర్వాతే పీహెచ్‌డీ చేశాను. ఆ సమయంలో మా అత్తయ్య నాకు చాలా సపోర్ట్ చేశారు.

యూనివర్సిటీ అభివృద్ధి కోసం మీ ప్రాణాళిక?

మా దగ్గరకు వచ్చే అమ్మాయిల్లో 90శాతం మంది గ్రామీణ ప్రాంతం నుండి వస్తారు. వారి కుటుంబాలకు పెద్దగా ఆదాయం వుండదు. చాలా మంది ప్రభుత్వం ఇచ్చే స్కాలర్‌షిప్‌లపై ఆధారపడి చదువుకుంటారు. డిగ్రీ చేరిన వారికి మేము ఒక ఇన్‌ట్రాక్షన్ క్లాసు పెడతాము. మీరు భవిష్యత్‌లో ఏం కావాలనుకుంటున్నారు అని అడిగితే చాలా మంది పోలీస్ కానిస్టేబుల్ అవుతాననో, టీచర్‌ని అవుతాననో, చిన్న ఉద్యోగం చూసుకుంటాననో చెబుతుంటారు. ఇలా ఇక్కడికి వచ్చినపుడు వారి ఆలోచనలు పరిమితంగా ఉంటాయి. అదే డిగ్రీ తర్వాత అడిగితే ఐఏఎస్, ఐ పీ ఎ స్ , బిజినెస్ చేద్దామను కుంటున్నా నని చెప్తారు. అంటే వారి ఆలోచనల్లో మార్పు రావడం గమనించాము. ఇలాంటి పిల్లలకు అవసరమైన సహకారం ఇస్తే జీవితంలో ఉన్నతంగా స్థిరపడతారు. కాబట్టి అలాంటి వారికి అవసరమైన కొత్త కొత్త కోర్సులు ప్రవేశపెట్టాలని అనుకుంటున్నాము. ఇలాంటి కోర్సుల వల్ల అమ్మాయిలు మంచి ఉద్యోగాలు సంపాదించుకోగలరు. జీవితంలో మంచిగా స్థిరపడతారు. వెనక్కి తిరిగి చూసుకోవలసిన అవసరం కూడా ఉండదు.

అమ్మాయిల్లో చదువుపై ఆసక్తి పెంచడానికి చేస్తున్న ప్రయత్నం?

చాలా మంది ఇంజనీరింగ్ మాత్రమే మంచి చదువు అనుకుంటున్నారు. అలా కాకుండా బీఎస్సీలోనే మంచి కోర్సులు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నాము. అలాగే యూపీఎస్‌సీ, గ్రూప్ కోచింగ్ కూడా ఇక్కడే ఏర్పాటు చేశాం. చాలా మంది ఉపయోగించుకుంటున్నారు. డిగ్రీ తర్వాత ఏం చేస్తే బాగుంటుంది అనేది వాళ్ళకు నేర్పిస్తున్నాం. దీనికోసమే నేను ప్రిన్సిపల్‌గా ఉన్నప్పుడు మెంటర్ మెంటీ అనే పద్ధతిని ప్రవేశపెట్టాం. అంటే ప్రతి 20 మంది అమ్మాయిలకు ఒక టీచర్ మెంటర్‌గా ఉంటారు. వాళ్ళకు ఎలాంటి సమస్య వచ్చినా అది ఆర్థికంగా కావొచ్చు, మానసికంగా కావొచ్చు. ఆ సమస్య పరిష్కరించే విధంగా ఆ మెంటర్ ప్రయత్నం చేస్తారు. ఈ విషయంలో టీచర్స్ కూడా చాలా సపోర్ట్ చేస్తున్నారు. అమ్మాయిలు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా చదువుకునేలా ప్రయత్నం చేస్తున్నాము.

మీ కుటుంబం గురించి చెబుతారా..?

నేను పుట్టింది, పెరిగింది, చదువుకుంది అంతా హైదరాబాద్‌లోనే. అమ్మ పారిజాత, గృహిణి. నాన్న రామేశ్వరావు, టైలరింగ్ చేసేవారు. మేము నలుగురం పిల్లలం. నాకు ఒక అక్క, ఇద్దరు తమ్ముళ్ళు. అమ్మ పీయూసీ వరకు చదువుకున్నారు. తనకు మేము బాగా చదువుకోవాలని కోరిక. మా అక్క రూపలత ఎన్‌ఐఎల్‌లో పీహెచ్‌డీ చేసి, యుఎస్ వెళ్ళి పీడీఎఫ్ చేసింది. అక్కడే స్థిరపడింది. నేను రాంనగర్‌లోని సెయింట్ పాయిస్ స్కూల్లో చదువుకున్నాను. డిగ్రీ కోఠీ ఉమెన్స్ కాలేజీలో చేశాను. పీజీ, పీహెచ్‌డీ సెంట్రల్ యూనివర్సిటీలో పూర్తి చేశాను. 1998లో నా పీహెచ్‌డీ సబ్‌మిట్ చేశాను.

పెండ్లి తర్వాత ప్రోత్సాహం ఎలా ఉంది..?

నెట్ కూడా క్వాలిఫై కావడంతో వెంటనే జాబ్ వచ్చింది. మా అత్తమ్మ నేను చూసుకుంటాను నువ్వు వెళ్ళు అంటూ నా చదువులో, ఉద్యోగంలో ఎంతో ప్రోత్సహించారు. మా అత్తయ్య, మామయ్య ఏం చదువుకోలేదు. కానీ నన్ను బాగా ప్రోత్సహించేవారు. ఇంటి నుండి బయటకు వెళితే పిల్లల గురించి అస్సలు ఆలోచించేదాన్ని కాదు. వాళ్ళు చూసుకున్నారు కాబట్టి నేను ఇదంతా చేయగలిగాను. అలాగే మా అమ్మ కూడా చాలా ప్రోత్సహించేది. బాగా చదువుకోవాలి అని ఎప్పుడూ చెబుతుండేది. తనకు నన్ను పీడీఎఫ్ కూడా చేయమంది. కానీ చేయలేకపోయాను. మా వారు ఎంబీఏ చేశారు. మాకు కల్పన అనే స్టూడియో ఉంది. అది ఆయనే చూసుకుం టారు. వాళ్ళు కూడా నలుగురు అన్నదమ్ములు. అందరం కలిసే వుంటాము.

అధ్యాపకురాలుగా మీ ప్రయాణం..?

1999 డిసెంబర్‌లో నిజాం కాలేజీలో నా మొదటి పోస్టింగ్. అక్కడే 15 ఏండ్లు చేశాను. అయితే మొదట్లో నాపని కేవలం టీచింగ్ మాత్రమే. నాకైతే ఇంకా ఏదో చేయాలని ఉండేది. ఏదైనా అంశం తీసుకుని రీసెర్చ్ చేద్దామనుకున్నాను. కానీ అక్కడ సరైన రీసెర్చ్ ల్యాబ్ లేదు. దాంతో ల్యాబ్ లేకపోయిన రీసెర్చ్ ఎలా చేయవచ్చు అనే దాని గురించి ముందు రీసెర్చ్ చేశాను. అలా నా రూంలోనే నా డబ్బుతో ఓ కంప్యూటర్ కొనుక్కొని పెట్టుకున్నాను. నాకున్న అవగాహన మేరకు సాఫ్ట్‌వేర్ డౌన్‌లోడ్ చేసుకుని వర్క్ ప్రారంభిచాను. మొదటి సారి 2008లో ఐదుల లక్షల రూపాయలతో క్యాన్సర్‌పై యూజీసీ ప్రాజెక్ట్ ఒకటి తయారు చేసి పంపిచాను.

మరి అది సక్సెస్ అయ్యిందా..?

యూజీసీ వారు ఢిల్లీకి పిలిచి ఇంటర్వ్యూ చేశారు. సాధారణంగా అందరూ 20 లక్షల ప్రాజెక్ట్ పెడతారు. ఇంత తక్కువకు ఎందుకు రాశారని అడిగారు. ఇది చేయడం నాకు చాలా అవసరం. ఎక్కువ పెడితే అవకాశం వస్తుందో లేదో అని ఐదు లక్షలు పెట్టాను. దీంతోనే నా ప్రాజెక్ట్ పూర్తి చేస్తానని చెప్పా. అలాగే అందరూ ఓ రీసెర్చ్ అసిస్టెంట్‌ని కూడా అడుగుతారు. నేను అది కూడా అడగలేదు. నేనే చేద్దామనుకుంటున్నా అని చెప్పాను. వెంటనే వాళ్ళు ఓకే చెప్పి సంతకం చేశారు. అది చేస్తూనే హెచ్ఐవీపై మరో ప్రాజెక్ట్‌కి అప్లయి చేశాను. అది కూడా ఓకే అయింది. అప్పటి నుండి పీహెచ్‌డి స్కాలర్స్ కూడా రావడం మొదలయింది. ఇప్పటి వరకు 13 మంది నా దగ్గర పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఇంకా 8 మంది స్కాలర్స్ ఉన్నారు. 2013లో బదిలీపై ఉస్మానియా యూనివర్సిటీకి వచ్చాను. ఇప్పటి వరకు 7 రీసెర్చ్ ప్రాజెక్టులు పూర్తి చేశాను. 108 ఆర్టికల్స్ పబ్లిష్ చేశాను. నా దగ్గర చేసే స్కాలర్స్ కూడా చాలా కష్టపడతారు. ఇక్కడ కూడా నా రూంలోనే ఒక ల్యాబ్ ఉంటుంది. ఇటీవల కోవిడ్‌పైన కూడా ఒక ప్రాజెక్ట్ చేశాము.

సైన్స్‌లో అమ్మాయిల సంఖ్య ఎలా ఉందంటారు?

ప్రాథమిక స్థాయిలో చూస్తే బాగా ఉన్నారు. డిగ్రీ, పీజీ వరకు కూడా పెద్దగా సమస్య లేదు. అయితే పీహెచ్‌డీకి వచ్చే సరికి సంఖ్య తగ్గిపోతుంది. దానికి కారణం ఖర్చు ఒకటైతే, పెండ్లి, పిల్లలు, బాధ్యలు పెరుగుతాయి. అయితే పీజీ అయిపోయిన వెంటనే నెట్ క్వాలిఫై అయితే వాళ్ళకు ఆర్థికంగా ఎలాంటి సమస్య ఉండదు. పీహెచ్‌డీ చేస్తే మన రాష్ట్రంలోనే ఎన్నో అవకాశాలు ఉన్నాయి. చేయగలిగే శక్తి ఉన్నా అవగాహన లేకపోవడంతో ముందుకు వెళ్ళలేకపోతున్నారు. అలాంటి అవగాహన కల్పించాలనే మేమే ఎన్నో సెమినార్లు ఏర్పాటు చేస్తున్నాము. జీవితంలో ఉన్నతంగా స్థిరపడటానికి, సొంతకాళ్ళపై నిలబడటానికి మహిళలకు అవసరమైన అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నాము.

మహిళా సాధికారత గురించి మీరేంటారు..?

నా దృష్టిలో మహిళలు ఎప్పుడో సాధికారత సాధించారు. ఎందుకంటే మహిళలు చేసినన్ని పనులు మగవాళ్ళు చేయలేరు. అయితే ఒకరి కింద పని చేయకుండా మనమే ఏదైనా చేయాలి, రిస్క్ తీసుకోనైనా అభివృద్ధి చెందాలి అనే ధైర్యం వాళ్ళలో రావాలి. ముఖ్యం గా మహిళలు పారిశ్రామిక రంగంలో అభివృద్ధి చెందడానికి అవసరమైన కోర్సులు యూనివ ర్సిటీలో ప్రవేశపెట్టాలి. అందుకు అనుగుణంగా సిలబస్‌లో కూడా మార్పులు తీసుకురావాలి. అలాగే ప్రభుత్వం ఫండ్స్ ఇస్తే యూనివర్సిటీలో పెద్ద హాస్టల్ ఏర్పాటు చేయాలని వుంది. మహిళల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకునే ప్రభుత్వం కోఠీ ఉమెన్స్ కాలేజీ యూనివర్సిటీ చేసింది. కాబట్టి ప్రభుత్వ సహకారంతో యూనివర్సిటీని మరింత అభివృద్ధి చేస్తాము.

ఇంటర్వ్యూ : సలీమా

ఫొటోలు : పిప్పళ్ల వెంకటేశ్

కేసీఆర్‌తో ఎలాంటి లాలూచీ లేదు

(మొదటిపేజీ తరువాయి)

రేవంత్ రెడ్డి అన్నారు. మునుగోడు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కేసీఆర్ రూ.25 కోట్లు ఇచ్చారన్న ఈటల ఆరోపణలపై సవాలు విసిరిన రేవంత్ రెడ్డి శనివారం సాయంత్రం చారిత్రక చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మునుగోడు ఉప ఎన్నికల్లో ఏం జరిగిందో అందరికీ తెలుసు అని, మూడు నెలల్లో మూడు వందల కోట్ల మద్యం ఏరులై పారిందని అన్నారు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన అభ్యర్థి పాల్వాయి స్రవంతి ఒక్క రూపాయి ఖర్చు పెట్టకుండా ప్రజా తీర్పు కోరారన్నారు. తమ పార్టీ నాయకులు చందాలు వేసుకొని ప్రచారం చేశారన్నారు. ఆధారాలు లేకుండా ఈటల ఎట్లా కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు చేస్తున్నారని ప్రశ్నించారు. మునుగోడు ఉప ఎన్నికల్లో బీజేపీ ఓటమి తర్వాత ఆ పార్టీలో కుమ్ములాటలు అందరికీ తెలిసిందేనన్నారు. మునుగోడు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 25 వేల ఓట్లు వచ్చాయన్నారు. ఈటల రాజేందర్ వ్యవహారశైలి రెండ్రోజులుగా విచిత్రంగా వుందన్నారు. మునుగోడు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కేసీఆర్ నుంచి ఒక్క రూపాయి ముట్టలేదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నామని తెలిపారు. కేటీఆర్ ఫామ్‌హౌస్ నిర్మించుకుంటే వ్యతిరేకించి పోరాటం చేస్తున్న తనను చర్లపల్లి, చంచల్‌గూడ జైలుకు కేసీఆర్ పంపలేదా అని గుర్తు చేశారు. తన మనోధైర్యం దెబ్బతీయాలని కేసీఆర్ ప్రయత్నం చేయలేదా అని ప్రశ్నించారు. హైదరాబాద్ నగరాన్ని కేసీఆర్ ప్రభుత్వం అపార్ట్‌మెంట్స్ పేరు మీద విధ్వంసం చేస్తుంటే నిలబడి కొట్లాడమన్నారు. నేరేళ్ళ ఇసుక దోపిడీపై, మల్లన్నసాగర్ నిర్వాసితుల కోసం, కాళేశ్వరం అవినీతిపై పోరాటం చేశామన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ అంశంపై 30 లక్షల మంది విద్యార్థులకు అండగా కాంగ్రెస్ ఈడీకి ఫిర్యాదు చేసిందన్నారు.

తాము తమ జీవితాలను త్యాగం చేసి తెలంగాణ ప్రజల కోసం కొట్లాడుతున్నామన్నారు. అలాంటి తమను ఈటల రాజేందర్ అమ్ముడుపోయారని విమర్శిస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను తన పార్టీని, పాల్వాయి గోవర్ధన్ రెడ్డి కుటుంబాన్ని విమర్శించడం సరికాదన్నారు. ఈటల పట్ల తమకు సానుభూతి ఉండేదని.. కానీ తమ నిజాయితీని ఆయన శంకిస్తున్నారా అని ప్రశ్నించారు. బీజేపీలో ప్రాధాన్యత లేకనే తమపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. తాను కేసీఆర్‌పై పోరాటం చేస్తుంటే ఈటల మంత్రిగా కేసీఆర్ పక్కన లేరా అని ప్రశ్నించారు. కేసీఆర్ తప్పుల్లో ఈటల భాగస్వామ్యం ఉందా లేదా అనేది ఆయన నిర్ధారించుకోవాలన్నారు. ప్రశ్నించే గొంతును నొక్కాలని ప్రయత్నం చేస్తున్నారన్నారు. కేసీఆర్‌తో ఎట్టి పరిస్థితుల్లో లాలూచీ పడే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, అనిల్ కుమార్ యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పీఎస్ఎల్వీ -సీ55 రాకెట్ ఘనవిజయం

(మొదటిపేజీ తరువాయి)

16 కిలోల లుమెలైట్ అనే ఉపగ్రహాన్ని అనుకున్న సమయానికి కక్ష్యలో ప్రవేశపెట్టారు. ఇస్రో శాస్త్రవేత్తల, ఉద్యోగస్తుల కృషి ఫలితమే ఈ విసయమని ఇస్రో చైర్మెన్ సోమనాథ్ అన్నారు. కొంచెం క్లిష్టమైన ప్రయోగమైనా దీనిని ఉపగ్రహాలతో పాటు ఏడు పేలోడ్స్‌ని కూడా పంపామన్నారు. భవిష్యత్తులో కీలక ప్రయోగాలు చేపడతామన్నారు. అలాగే మరిన్ని విదేశీ ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెడతామన్నారు. ఈ సారి ప్రయోగించిన రాకెట్‌లో కొన్ని మార్పులు చేయడం వల్ల వ్యయం తగ్గిందన్నారు. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో విదేశాల నుంచి భారీ డిమాండ్ వస్తుందని తెలిపారు. అంతరిక్ష సేవల కోసం ప్రయివేటు సంస్థలు ముందుకు వస్తున్నాయని అన్నారు. భవిష్యత్తులో ఎన్నో మార్పులు వస్తాయని తెలిపారు. దేశీయ నావిగేషన్ సేవలు త్వరలోనే అందుబాటులో ఉంటాయన్నారు. ఈ రాకెట్ విజయవంతం అవడంతో షార్‌లో సంబురాలు అంబరాన్నంటాయి. ఇస్రో చైర్మన్‌తో పాటు షార్ డైరెక్టర్ ఏ.రాజరాజన్, బి.ఎన్ రామకష్ణ, డైరెక్టర్ ఐఎస్ టిఆర్ ఎసి నారాయణ, డైరెక్టర్ ఎల్పీఎస్సీ, రాధాకృష్ణన్, సీఎండీ ఎన్ఎస్ఐఎల్ ఎం శంకరం, డైరెక్టర్ యూఆర్ఎస్‌సీ ఎస్సార్ బీజు, మిషన్ డైరెక్టర్ ఉన్నికష్ణన్, డైరెక్టర్ విఎస్ఎస్‌సి తదితరులు పాల్గొన్నారు.

నిర్బంధంలో సత్యపాల్ మాలిక్!

న్యూఢిల్లీ : జమ్ముకాశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్‌తో పాటు ఆయనకు మద్దతు తెలిపేందుకు వచ్చిన సుమారు 25 మంది రైతు సంఘాల నేతలను ఢిల్లీ పోలీసులు శనివారం నిర్బంధించినట్లు తెలిసింది. రైతు సంఘాల నేతలతో పాటు మాలిక్ కూడా ఆర్.కె. పురమ్ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న దృశ్యాలను వివిధ వార్తా ఛానెళ్లు ప్రసారం చేశాయి. హర్యానా, ఢిల్లీ, రాజస్తాన్, పంజాబ్, ఉత్తరప్రదేశ్‌లకు చెందిన సుమారు 250 నుండి 300 మంది మద్దతుదారులతో సహా పలువురు రైతు సంఘాల నేతలు మధ్యాహ్నం 12.30కి ఢిల్లీలోని మాలిక్ నివాసానికి చేరుకున్నారు. మాలిక్ తమను విందుకు ఆహ్వానించారని, అందుకే అక్కడికి చేరుకున్నామని వారు పేర్కొన్నారు. మాలిక్ తన ఇంటికి సమీపంలోని పార్క్‌లో సమావేశం ఏర్పాటు చేసినట్లు సమాచారం. అయితే నివాస ప్రాంతాల్లో అనుమతి లేకుండా ఎలాంటి సమావేశాలు నిర్వహించరాదంటూ వారందరినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు మాలిక్ మద్దతుదారులు తెలిపారు.

అయితే సత్యపాల్ మాలిక్‌ను తాము నిర్బంధించలేదని పోలీసులు పేర్కొనడం గమనార్హం. మాలిక్, రైతు సంఘాల నేతలను విడుదల చేస్తేనే తాము స్టేషన్ వదిలి వెళతామని పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆందోళన చేపట్టిన మద్దతుదారుల్లో ఒకరు మీడియాతో పేర్కొన్నారు. మోడీది అవినీతి ప్రభుత్వమని, పుల్వామా ఘటనపై మాలిక్ వాస్తవాలే చెప్పారని ఆయన అన్నారు.

పుల్వామా ఉగ్రవాద ఘటనలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వైఫల్యాలపై నోరు విప్పవద్దంటూ ప్రధాని నరేంద్ర మోడీ తనకు చెప్పారని సత్యపాల్ మాలిక్ ఇటీవల మీడియాకు తెలిపారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే రిలయన్స్ ఇన్సూరెన్స్ అంశంపై మాలిక్‌పై సిబిఐ దాడికి దిగిన సంగతి తెలిసిందే. బిజెపి నేత అయిన మాలిక్ జమ్ముకాశ్మీర్ సహా నాలుగు రాష్ట్రాలకు గవర్నర్‌గా వ్యవహరించారు. జమ్ముకాశ్మీర్‌లో బీమా పథకాన్ని ప్రారంభించేందుకు రిలయన్స్ ఇన్సూరెన్స్‌కు తాను మొదట అనుమతిని నిరాకరించానని సత్యపాల్ మాలిక్ మీడియాకు వివరించారు. అయితే ఆర్ఎస్ఎస్, బిజెపి నేత రామ్ మాధవ్ తనపై ఒత్తిడి తీసుకువచ్చారని ఆయన చెప్పారు. ఈ పథకంతో పలువురు ప్రభుత్వ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారని అన్నారు.

మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని ప్రయివేటీకరించొద్దు

(మొదటిపేజీ తరువాయి)

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీకి, సిబ్బందికి గత ఆర్థిక సంవత్సరంలో కావాల్సినంత పని ఉండేది. దాదాపు రూ.930 కోట్ల ఆర్డర్లను సమయానికి పూర్తి చేశారు. సంస్థ సిబ్బంది ఎలాంటి సవాళ్లనైనా స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నారు. కానీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సంస్థకు పెద్దగా పని అప్పగించలేదు. దీన్ని సాకుగా చూపి ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని "సిక్ ఇండస్ట్రీ"గా ప్రకటిస్తారని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే జరిగితే ప్రత్యక్షంగా 2,500 మంది ఉద్యోగులు, పరోక్షంగా 5,000 మంది ఉపాధి దెబ్బతింటుంది. మొత్తంగా సుమారు 25 వేల మంది భవిష్యత్తు అంధకారంలో పడుతుంది..... " అని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో "ఆయుధ కర్మాగార తెలంగాణ ఉద్యోగుల సమాఖ్య" ప్రతినిధులు తనకు ప్రయివైటేజేషన్ ను అడ్డుకోవాలంటూ తనను కలిసి విజ్ఞప్తి చేశారని మంత్రి పేర్కొన్నారు. మూడు రైతు చట్టాల మాదిరిగానే డిఫెన్స్ రంగ సంస్థల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలనీ, పరిశోధనల విభాగాన్ని మరింత పటిష్టం చేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. మిషనరీని ఆధునికరించడం ద్వారా ఉద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని ఆయన కోరారు. పరిపాలన, కొనుగోలు విధానాలను సరళీకరించాలనీ, ఆర్మీ అవసరాలకు అనుగుణంగా ఆర్డినెన్స్ ఫ్యాక్టరీకి ఆర్డర్లు ఇవ్వాలని కోరారు. ప్రసార భారతిలో మాదిరిగానే ఉద్యోగులకు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల విషయంలో కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

రైలు..దిగులు..!

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంతాల మీదుగా కోదాడ, హుజూర్‌నగర్, మిర్యాలగూడెం వరకు నిర్మించాలనేది ప్రతిపాదన. ఇప్పటికే గూగుల్ మ్యాప్ ఆధారంగా సర్వే చేపట్టారు. నేలకొండపల్లి వరకు గతంలోనే ఈ సర్వే పూర్తి చేశారు. తాజాగా ఖమ్మం రూరల్ మండలంలో చేపట్టిన సర్వేను సీపీఐ(ఎం), సీపీఐ, ఇతర రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఎక్కడికక్కడ సిబ్బందిని అడ్డుకున్నారు. ముత్తగూడెం, పల్లెగూడెంలో సర్వే సిబ్బందిని వెనక్కి పంపారు.

భూములకు ముప్పు

పవర్‌ప్లాంట్, సిమెంట్ కంపెనీల కోసం వేస్తున్న ఈ రైల్వేలైన్ వల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోనున్నారు. ప్రజలు చెమటోడ్చి, పైసా పైసా కూడబెట్టి నిర్మించుకున్న వందలాది ఇండ్లు, ముత్తగూడెం, ఏదులాపురం, మద్దులపల్లి, తెల్దారుపల్లి రెవెన్యూలో వెంచర్లు, ప్లాట్లు రైలుమార్గంలో కొట్టుకుపోనున్నాయి. ఇటీవల నిర్వహించిన సర్వే ప్రకారం ఏదులాపురం పెట్రోల్ బంక్ సమీపంలోని కోటి ధాబా, ఆదిత్య టౌన్‌షిప్, వెంకటాద్రినగర్, ఆటోనగర్, మద్దులపల్లి అగ్రికల్చర్ మార్కెట్ తదితర ప్రాంతాల్లో రూ.కోట్ల విలువ చేసే అనేక ఇండ్లు, ప్లాట్లు, భూములు పోనున్నాయి. బహిరంగ మార్కెట్లో గజం విలువ రూ.10వేల పైమాటే ఉన్నా రిజిస్ట్రేషన్ విలువపై మూడంతలు ఇచ్చినా రూ.4వేలలోపే ప్రభుత్వం లెక్కలు కడుతుంది. ఎకరం రూ.3 కోట్లకు పైగా విలువ చేసే భూములకు రూ.30లక్షల లోపే చెల్లిస్తానంటోంది. నూతనంగా వేసిన డీటీసీపీ లేఅవుట్ వెంచర్ల యజమానుల పరిస్థితి మరింత దారుణంగా మారింది. గ్రీన్‌బెల్ట్, మార్టుగేజ్‌లు, 60 అడుగుల వెడల్పు రోడ్లతో ఎకరం భూమిలో 18లోపు ప్లాట్లే అయ్యాయి. ఇప్పుడు ఈ రైల్వేలైన్‌తో అక్కడి రిజిస్ట్రేషన్ విలువపై మూడింతలు అధికంగా ఇస్తే గజం రూ.3వేల వరకే పలికే అవకాశం ఉంది. పై పెచ్చు 300 ఫీట్ల వెడల్పుతో వేసే ఈ రైల్వేలైన్ వల్ల దానికి ఇరువైపులా మరో వంద అడగుల మేర ఎటువంటి నిర్మాణాలున్నా నిరుపయోగంగా మారనున్నాయి. వీటికి ప్రభుత్వం నుంచి ఎటువంటి పరిహారం అందే అవకాశం లేదు. దీంతో బిల్డర్లు, ఇండ్ల యజమానులు, నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇండ్లు కొంటరో.. లేదోనని భయం
లక్ష్మణ్- న్యూ బిల్డర్- వెంకటాద్రినగర్- ఏదులాపురం

కొత్తగా మేము కడుతున్న ఇండ్ల సమీపం నుంచి రైల్వేలైన్ కోసం మార్కింగ్ చేశారు. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి సుతారి పనిచేసుకుని ఇప్పుడిప్పుడే బిల్డర్లుగా మారాం. ఒకటి, రెండు ఇండ్లు నిర్మించి అమ్ముకుంటున్నాం. ఇప్పుడీ రైల్వేలైన్ మేము కొత్తగా కట్టే ఇండ్ల దగ్గరి నుంచి పోనున్నాయి. వాటిని కొంటారో లేదోనని భయంగా ఉంది. రైల్వేలైన్ కింద ఇండ్లు పోవట్లేదు కాబట్టి పరిహారం కూడా రాదు. మా పరిస్థితి ఏంటో అర్థం కావట్లేదు.

అలైన్‌మెంట్ మార్పుకు కృషి చేస్తా..
నామ నాగేశ్వరరావు- ఖమ్మం ఎంపీ

ఈ రైల్వేలైన్ వల్ల అనేక మంది నిర్వాసితులుగా మారే అవకాశం ఉంది. ఇప్పటికే రోడ్ల విస్తరణ, జాతీయ ప్రాజెక్టుల కోసం వేలాది ఎకరాల భూములు జిల్లా నుంచి సేకరించారు. కొత్తగా ఈ రైలుమార్గంతో ప్రజలు ఇబ్బంది పడతున్నారనే విషయాలను తెలియజేస్తూ.. రైల్వేమంత్రికి లేఖ రాసిన. అలైన్‌మెంట్ మార్చేందుకు కృషి చేస్తాను. నిర్వాసితుల పక్షాన పోరాడుతాను.

నోరు విప్పరేం...?

(మొదటిపేజీ తరువాయి)

అత్యంత ఆవశ్యకమైన విషయాలు. ప్రభుత్వం నుంచి ప్రజలకు సమాచారం లభించకపోవడం ప్రజాస్వామ్య వైఫల్యంగానే భావించాలి. కొన్ని విషయాలలో గోప్యత అవసరమే అయినప్పటికీ సాయుధ దళాల రక్షణలో ప్రజలను తప్పుదోవ పట్టించి, ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చడం సరికాదు. పాలనలో పారదర్శకత ఉండాలన్నా, ప్రజలకు అవసరమైన సమాచారం లభించాలన్నా పార్లమెంట్ అనేది చాలా కీలకం. కానీ దురదృష్టవశాత్తూ రక్షణ, భద్రతకు సంబంధించి ఎంపీలు ఎంతగా అరచి గీపెట్టినా పాలకులు పెడచెవిన పెడుతున్నారు. పుల్వామా ఘటనపై విచారణ జరిపించాలని ఎంపీలు డిమాండ్ చేసినప్పటికీ ఈ వ్యవహారం దర్యాప్తులో ఉన్నదని చెబుతూ సమాచారం ఇచ్చేందుకు ప్రభుత్వం నిరాకరించింది. ఆశ్చర్యకరమైన విషయమేమంటే ఈ దాడిపై ఇప్పటివరకూ సవివరమైన నివేదిక ఏదీ బయటకు రాలేదు. విచారణ ఎంత వరకూ వచ్చిందో కూడా తెలియడం లేదు. పుల్వామా దుర్ఘటన జరిగి నాలుగేండ్లు దాటినా ఆ హృదయవిదారకమైన దృశ్యాలు నేటికీ కళ్ల ముందు కదలాడుతూనే ఉన్నాయి. ఈ ఘటనలో తన ప్రమేయం ఏమిటో బయటపెట్టేందుకు మోడీ ప్రభుత్వం విముఖత వ్యక్తం చేస్తోంది.

ఐకేపీ వీవోఏల సమస్యలను పరిష్కరించండి

(మొదటిపేజీ తరువాయి)

పనిచేస్తున్నారని తెలిపారు. వారికి ఉద్యోగ భద్రత, గుర్తింపు కార్డులు, పదోన్నతులతోపాటు, సాధారణ, ఆరోగ్య బీమా సౌకర్యం లేదని పేర్కొన్నారు. వాటి సాధనకోసం రాష్ట్ర వ్యాప్తంగా ఐకేపీ వీవోఏలు చాలా కాలంగా పలు నిరసన కార్యక్రమాలు చేసినా, ప్రభుత్వం నుంచి స్పందన లేదని వివరించారు. దీంతో ఆరు రోజులుగా మండల కేంద్రాల్లో నిరవధిక సమ్మెకు పూనుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో మహిళల అభ్యున్నతికోసం డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేస్తూ, వారు ఆర్థికంగా, సామాజికంగా ఎదగడానికి అవగాహన కల్పిస్తున్నారని పేర్కొన్నారు. సభ్యులకు రుణాలు ఇప్పించి చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునేలా ప్రోత్సహిస్తున్నారని వివరించారు. డ్వాక్రా సంఘాల లావాదేవీలన్నీ రికార్డు చేస్తూ ఎస్‌హెచ్‌జీ లైవ్ మీటింగ్ పెట్టి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారని తెలిపారు. సంఘాల పనులే కాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా అమలయ్యేలా వారు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అయినా వారికి పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) నుంచి కేవలం రూ.3,900లు మాత్రమే గౌరవవేతనం ఇస్తూ చేతులు దులుపేసుకుంటున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామసంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతినెలా వీవోఏల వ్యక్తిగత ఖాతాల్లోకి కనీస వేతనంగా రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వారిని సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, గుర్తింపు కార్డులివ్వాలివ్వడంతోపాటు, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. రూ.10 లక్షల సాధారణ, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. జాబ్ చార్టర్‌తో సంబంధం లేని ఆన్‌లైన్ పనులను వారితో చేయించొద్దని సూచించారు. వారిపైన మహిళా సంఘాల ఒత్తిడి లేకుండా ఎస్‌హెచ్‌జీలకు వీఎల్ఆర్, అర్హులైన వీవోఏలను సీసీలుగా పదోన్నతి కల్పించాలని తమ్మినేని ఈ సందర్భంగా తెలిపారు. వారి న్యాయమైన డిమాండ్ల పట్ల సీఎం కేసీఆర్ సానుకూలంగా స్పందించి, ఐకేపీ వీవోఏలకు న్యాయం చేయాలని ఆయన తన లేఖలో కోరారు.

ముగిసిన రంజాన్ వేడుకులు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని వివిధ జిల్లాలపాటు రాజధాని హైదరాబాద్ నగరంలో రంజాన్ వేడుకలు ఘనంగా ముగిశాయి. మార్చి 22 నుంచి ఏప్రిల్ 21 వరకు ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేశారు. రంజాన్ పండుగ సందర్భంగా మసీదులన్నీ కొత్త కళను సంతరించుకున్నాయి. చార్మినార్, మక్కా మసీద్ వద్ద రంజాన్ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం 9:30 తర్వాత చార్మినార్, మక్కా మసీదు వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నెల రోజుల కఠిన ఉపవాస దీక్ష తర్వాత వారు రంజాన్‌ను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ముస్లిం సోదరులు పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ప్రతి మసీదు వద్ద పోలీసు కానిస్టేబుల్‌ను నిఘా కోసం ఉంచారు.

ప్రకృతి ప్రకోపం..



15నిమిషాలపాటు అతలాకుతలం చేసిన వర్షబీభత్సం

- గంటకు 40కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలు, వడగళ్ల వాన
- పిడుగుపాటుతో మల్యాలలో గీతకార్మికుడు మృతి
- పెద్దఎత్తున తడిసి ముద్దయిన ఆరబోసిన ధాన్యంకుప్పలు
- కోత కొచ్చినపొలాల్లో నేలరాలిన వడ్లగింజలు
- నేలరాలిన మామిడి, దెబ్బతిన్న మొక్కజొన్న పంటలు
- విద్యుత్‌స్తంభాలు విరిగి చాలా గ్రామాల్లో నిలిచిన కరెంటు సరఫరా
- రానున్న మూడు రోజులూ వడగళ్లవానలే!

ఊహకందని రీతిలో ప్రకృతి ప్రకోపించింది. శనివారం సాయంత్రం 6గంటల ప్రాంతంలో ఒక్క 15నిమిషాల్లోనే వడగళ్ల వానతో బీభత్సం సృష్టించింది. గంటకు 40కిలోమీటర్ల వేగంతో కూడిన ఈదురుగాలులకు పిడుగులూ తోడై అతలాకుతలం చేసింది. పెద్దఎత్తున వరిపంట కోసి ఆరబోయిన ధాన్యంకుప్పలు తడిసి ముద్దయ్యాయి. పెద్దఎత్తునమామిడి నేలరాలిపోగా.. మొక్కజొన్న పంట నేలవాలింది. విద్యుత్‌స్తంభాలు విరిగిపడటంతో చాలా గ్రామాల్లో కరెంటు సరఫరా నిలిచిపోగా రహదారులపై చెట్లు విరిగిపడి చాలాచోట్ల రాత్రివరకూ రాకపోకలు నిలిచిపోయాయి. ఎర్రటి ఎండాకాలంలో అకస్మాత్తుగా వచ్చిన ఈ వడగళ్ల వాన బీభత్సం మరో మూడు రోజులపాటు ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. పలు జిల్లాలకు హెచ్చరికలు జారీ చేయగా అందులో కరీంనగర్, పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల జిల్లాలు ఉండటం గమనార్హం.

నవతెలంగాణ - కరీంనగర్
ప్రాంతీయప్రతినిధి





శంకరపట్నం మండలంలో వరికుప్పల్లో వడగళ్ల మంచురాశులు



చొప్పదండి మండలంలో తడిసిముద్దయిన ఆరబోసిన ధాన్యం

శనివారం సాయంత్రం 6గంటల ప్రాంతంలో ఒక్కసారిగా గాలి దుమారం, పిడుగులతో కూడిన వడగళ్ల వాన 15 నిమిషాల పాటు బీభత్సం సృష్టించాయి. మల్యాల మండలం కొండగట్టు సమీపంలో తాటి చెట్టుపై పిడుగు పడటంతో ముంజలు విక్రయిస్తున్న గీత కార్మికుడు ముత్యం మల్లేష్(65) అక్కడికక్కడే మరణించాడు. కోతకొచ్చిన వరి చేలన్నీ నేలవాలగా.. ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. పలుచోట్ల వరదలో కొట్టుకుపోయింది. విద్యుత్‌స్తంభాలు విరిగి చాలా గ్రామాలకు కరెంటు సరఫరా నిలిచిపోయింది. కరీంనగర్-రామగుండం జాతీయ రహదారిపై చెట్లు విరిపడగా.. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కరీంనగర్, చొప్పదండి నియోజకవర్గాలు, పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్, గర్రెపల్లి, జగిత్యాల జిల్లా మల్యాల, కొండగట్టు, రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట, చందుర్తి, బోయిన్‌పల్లి మండలాల్లో వరి పంటకు తీవ్ర నష్టమే వాటిల్లింది. కొనుగోలు కేంద్రాల్లో అమ్మకం కోసం తీసుకొచ్చిన ధాన్యం తడిసిపోగా, వడగండ్ల కూడా పెద్దఎత్తున పడ్డాయి. ఈ కారణంగా పొలాలన్నీ మంచుముక్కలతో నిండిపోయి కోతకొచ్చిన వరిగొలుసులు రాలిపోయాయి. కరీంనగర్ జిల్లాలోని జూబ్లీనగర్‌లో రహదారికి అడ్డంగా చెట్టు పడిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గర్రెపల్లిలో పంట పొలాలతోపాటు ఇంటి పైకప్పులు లేచిపోవడంతో పాటు ఇన్ని ఇండ్ల గోడలు కూలిపోయాయి. కరీంనగర్ నగరంలో హోర్డింగ్‌లు ప్రమాదకరంగా వంగిపోయాయి.

కొనుగోలు కేంద్రాల ఆలస్యంతో భారీగా నష్టం

ఏప్రిల్ 14వరకు అన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ధాన్యం సేకరిస్తామని చెప్పిన అధికారులు ఎక్కడా కొనుగోళ్లు ప్రారంభించలేదు. ఏప్రిల్ రెండో వారం నుంచే వరి కోతలు ఊపందుకుని ధాన్యమంతా ఆయా ప్యాడీ సెంటర్లలో రైతులు ఆరబోసుకున్నారు. కుప్పలు తెప్పలుగా తీసుకొచ్చారు. ఎర్రటి ఎండతో తేమశాతం కూడా వస్తుందని ఆశపడ్డ రైతులకు అకాల వర్షం ఊహించని నష్టాన్ని తెచ్చిపెట్టింది. అధికారులు ధాన్యంసేకరణ ప్రారంభించకపోవడంతో పెద్దఎత్తున ఆయా సెంటర్లకు వచ్చిన ధాన్యంకుప్పలన్నీ ఇప్పుడు తడిసి ముద్దయ్యాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఈ యాసంగిలో 9లక్షలా 10వేలా 641 ఎకరాల్లో వరి సాగైంది. ఈ క్రమంలో 17.97లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనాగట్టి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1331 కేంద్రాలు ప్రారంభిస్తామని చెప్పారు. అయితే ఇప్పటి వరకు జిల్లాకు నాలుగైదు తప్ప ఎక్కడా పూర్తిస్తాయిలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభానికి నోచుకోలేదు. యాసంగి నాట్లు ముందుగా వేసుకున్న రైతుల పొలాలు దాదాపు కోతలన్నీ పూర్తికాగా .. ఆ ధాన్యమంతా ఇప్పుడు ప్రభుత్వం ప్రారంభిస్తామన్న కొనుగోలు కేంద్రాల్లోనే ఆరబోశారు. ఇప్పుడా పంటంతా వర్షంతో తడిసి ముద్దవడంతో పెద్దఎత్తున నష్టం వాటిల్లింది.



కోనరావుపేటలోని వట్టిమల్లలో కూలిన ఫౌల్ట్రీ షెడ్డుగోడ



చొప్పదండి: మండలంలో వడగళ్ల వానతో రైతులు మరోమారు కుదేలయ్యారు. వరి, మామిడి, కూరగాయలు తదితర పంటలు పెద్దఎత్తున దెబ్బతిన్నాయి. కోతకొచ్చిన వారి పంట పొలాల్లో వడ్లు నేల రాలిపోయాయి. చొప్పదండి వ్యవసాయ మార్కెట్ సహా ఆర్నకొండ, చొప్పదండి సింగిల్ విండో కేంద్రాల్లో వరి సేకరణ ప్రారంభించకపోవడంతో ఆయా సెంటర్లలో ఆరబోయిన ధాన్యం పెద్దఎత్తున తడిసి ముద్దయింది. భూపాలపట్నంలోని లింగాల రాజయ్య ఇంటిపైన తాటి చెట్టు పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. చాకుంట గ్రామంలో మిరప తోటలు మొక్కలన్నీ విరిగిపోయాయి. ఆర్నకొండ, మల్లన్నపల్లె, కాట్నపల్లి, పెద్ద కురుమ పల్లె, రేవెల్లి, రాగంపేట, దేశాయిపేట, మంగళపల్లి గ్రామాల్లో ఇంకా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో అయా గ్రామాల్లో వరి కుప్పలన్నీ వర్షార్పణం అయ్యాయి. వెదురుగట్ట, రుక్మాపూర్, కొలిమి కుంట, చొప్పదండిలో గాలివాన, అకాల వడగళ్ల బీభత్సానికి ధాన్యంకుప్పలు మంచురాళ్లతో నిండిపోయాయి.

తిమ్మాపూర్: చిగురుమామిడి మండలంలోని ఇందుర్తి, గునుకులపల్లె, ముదిమాణిక్యం, గాగిరెడ్డిపల్లి, సుందరగిరి, కొండాపూర్ రామంచ, ఓగులాపూర్ గ్రామాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో ఒక్కసారిగా భారీగా వర్షం కురవడంతో ఆరబోయిన ధాన్యంకుప్పలన్నీ తడిసిముద్దయ్యాయి. ఇప్పటికే మెడ విరుపు ఊస తిరుగుతూ ఎర్రబొమ్మిడి రోగాలతో దిగుబడి సైతం తక్కువగానే రావడం, వచ్చిన ఆ కాస్త పంట వర్షం పాలవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కోనరావుపేట : మండలంలోని కనపర్తి కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసిపోయింది. చేతికిచ్చిన పంట పూర్తిగా వడగళ్లతో దెబ్బతిన్నది. నిమ్మపల్లిలో విద్యుత్ స్తంభం విరిగిపడి వివిధ గ్రామాలకు కరెంటు సరఫరా నిలిచిపోయింది. వివిధ గ్రామాల మధ్య పెద్ద పెద్ద చెట్లు రోడ్లపై విరిగిపడటంతో రాక పోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. వట్టిమల్లలో నక్క మల్లేశం కు చెందినటువంటి కోళ్ల ఫారం షెడ్డు కూలిపోయింది. గోవిందరావుపేట తండా, వట్టిమల్ల గ్రామాల్లో కోతకొచ్చిన వరి పూర్తిగా నేలవాలిపోయింది. మామిడిపల్లి, బావుసాయిపేట సహా పలు గ్రామాల్లో సుమారు 50 వరకు విద్యుత్‌స్తంభాలు విరిగిపోయాయి.



చిగురుమామిడి మండలంలో వర్షంలో తడిసిపోతున్న వరి కుప్పలు



కోనరావుపేట రోడ్డులో విరిగిపడ్డ చెట్టు

కోనరావుపేటలో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు



చొప్పదండి మండలం భూపాలపల్లిలో ఇంటిపై పడ్డ తాటిచెట్టు



కోనరావుపేట మండలంలో నేలరాలిన మామిడితో రైతు దిగాలు





గాలిదుమారానికి సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి ప్రధాన రహదారిపైకి కొట్టుకొచ్చిన టేల



సుల్తాన్‌పూర్ గ్రామంలోని కవ్వంపల్లి అంజయ్యకు చెందిన కోతకు వచ్చిన పొలంలో వరిగొలుసుకు ఒక్క గింజ కూడా మిగలకుండా రాలిన దృశ్యం

ఘనంగా అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్టిక్ క్యాబినెట్ ఇన్‌స్టాలేషన్



నవతెలంగాణ - కరీంనగర్

కరీంనగర్ అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 137బి ఆధ్వర్యంలో పాస్ట్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ తిరుపతి రాజు నేతత్వంలో స్థానిక డిస్టిక్ గవర్నర్‌గా ప్రముఖ సైకాలజిస్ట్, మెమరీ ట్రైనర్ అలై డాక్టర్ వేణు కుమార్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అలై డాక్టర్ వేణు కుమార్ సహా వైస్ గవర్నర్లుగా సురేందర్ కటకం, కైలాస నాగేశ్వర్, పోలు సత్యనారాయణ, ట్రెజరర్‌గా పసుల హేమలత, అడ్వైజర్‌గా భూస శ్రీనివాస్, కమిటీ ఛైర్మెన్‌గా హరీష్ కుమార్ ఎన్నికయ్యారు. అలయన్స్ క్లబ్‌లో కొన్ని నూతన క్లబ్‌లను ఆవిష్కరించారు. సమాజసేయ శ్రేయస్సు కోసం అలయన్స్ ఎప్పుడూ ముందుంటుందని, ఈక్లబ్ లో సేవా భావం ఉన్నవారు ఎవరైనా అలయన్స్ లో సభ్యత్వం తీసుకొని సమాజానికి తోడ్పడాలని నూతన గవర్నర్ డాక్టర్ వేణు కుమార్ కోరారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో కొంత సమయమైనా సేవ కోసమని వెచ్చించి అందరూ కూడా పరోపకారం కోసం జీవించాలని కోరారు. కార్యక్రమంలో పసుల సతీష్ కుమార్ చార్టెడ్ గవర్నర్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ బాలగంగాధర్ శాస్త్రి, రాజేంద్రప్రసాద్, అంజయ్య, మధుసూదన్, వెంకట్రావు, రాజేంద్రన్, మంత్రి లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు. క్లబ్ ప్రెసిడెంట్, సెక్రటరీలుగా మురళి, సతీష్, కార్తీక్, అరవింద్, అనిల్ ఎంపికయ్యారు.

నియోజకవర్గ క్రికెట్ టోర్నీలో విన్నర్‌గా అలుగునూర్ జట్టు

ప్రథమ బహుమతి రూ.15 వేలు, ద్వితీయ బహుమతి రూ.8 వేలు



నవతెలంగాణ-గన్నేరువరం: మండలంలోని జంగపల్లి గ్రామంలో యువజన సంఘా ల అధ్యక్షుడు అల్లూరి శ్రీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మానకొండూర్ నియోజకవర్గ స్థాయి క్రికెట్ మ్యాచ్ శనివా రం జరిగింది. ఫైనల్ మ్యాచ్ లో అలుగునూర్, జంగపల్లి లెవన్స్ జట్టు తలపడ్డారు. ఉత్కంఠ భరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో అలుగునూర్ జట్టు విన్నర్‌గా గెలుపొందగా.. రన్నర్‌గా జంగపల్లి జట్టు నిలిచింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల యువజన సం ఘాల అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు అల్లూరి శ్రీనాథ్ రెడ్డి హాజరై మొదటి బహుమతి రూ.15 వేలు, ప్రైజ్ మనీతో పాటు ట్రోఫీని, అటికం రామచంద్రం గౌడ్ రూ.8 వేలు, ప్రైజ్ మనీని ద్వితీయ జట్టు క్రీడాకారులకు అందజేశారు. కార్య క్రమంలో యువజన సంఘల అధ్యక్షుడు అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, టోర్నమెంట్ నిర్వా హకులు తాడురి వంశీకృష్ణ రెడ్డి, రంజిత్ రెడ్డి, రాకేష్, మధు కిరణ్ రెడ్డి, అంజి పటేల్, కర్ర సాయి, శ్రీధర్, సురి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ దంపతులకు సన్మానం



నవతెలంగాణ-తిమ్మాపూర్:
రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా నానాజీ దేశ్ ముఖ్ స ర్వోత్తమ్ పంచాయత్ సతత్ వికా స్ పురస్కార్ నేషనల్ బెస్ట్ మండ ల అవార్డు అందుకుని, మండలా నికి వచ్చిన కేతిరెడ్డి వనిత దేవేం దర్ రెడ్డి దంపతులను మహాత్మా నగర్ గ్రామ పంచాయతీ పాలక వర్గం శనివారం మర్యాద పూర్వకం గా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జక్కుని శ్రీవాణి రవీందర్, వార్డ్ సభ్యులు గూడ తిరుప తి, మాశెట్టి మౌనిక, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు అడిచర్ల సత్యనారాయణ, కో ఆప్షన్ నెంబర్ కేతిరెడ్డి ఎల్లారెడ్డి, గ్రామ పంచాయతీ సెక్రటరీ ప్రణీత్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను ఓడించేందుకు సిద్ధంగా ఉండాలి

బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి



నవతెలంగాణ-తిమ్మాపూర్:
రాష్ట్రంలో నియంత పాలన కొనసాగిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడించేందుకు బీజేపీ కార్య కర్తలు సిద్ధంగా ఉండాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ సంస్థాగత బలోపేతంలో భాగంగా జాతీయ పార్టీ ఆదేశాల మేరకు జరుగుతున్న బూత్ సశక్తి కరణ్ అభియాన్ సమావేశాన్ని శనివారం తిమ్మాపూర్ మండల కేంద్రంలో మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అదితిగా పాల్గొన్న జిల్లా అధ్య క్షులు మాట్లాడుతూ, రాష్ట్రంలో జరుగుతున్న అవినీ తి, అరాచక వ్యవస్థను ప్రశ్నిస్తున్న బీజేపీ కార్యకర్తల ను పోలీసులతో ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించా రు. మండలంలో ప్రతి బూత్ లో పార్టీ కార్యక్రమా లను పూర్తి స్థాయిలో చేసి ప్రజల మద్దతును కూడ గట్టాలని అన్నారు. దేశ వ్యాప్తంగా అమలవుతున్న పలు సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలు కావా లంటే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలని అన్నారు. రాబోయే రోజుల్లో మానకొండూర్‌లో బీజేపీ జెండా ఎగురవేసేందుకు కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వ పథకాలను విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలని కోరారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ద్వారా వస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకునే ప్రయ త్నం చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి, జిల్లా కార్యాలయ కార్యదర్శి మాడ్గుల ప్రవీణ్, జిల్లా ఈసీ మెంబర్స్ తమ్మిశెట్టి మల్లయ్య, మావురపు సంపత్, మండల ఉపాధ్యక్షులు పబ్బ తిరుపతి, కిసాన్ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి వేల్పుల రవీందర్ యాదవ్, ఓబీసీ మోర్చా జిల్లా ఈసీ మెంబర్ కొయ్యడ శ్రీనివాస్ గౌడ్, బూత్ అధ్యక్షులు మాదన మహేష్ చంద్ర, మామిడి రాజు, వేల్పుల రవీందర్, గంకిడి కార్తీక్ రెడ్డి, దుంద్ర రవీందర్, ముత్యాల ఐలయ్య, పెంటమీది వెంకయ్య పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ కుట్ర బయటపడింది

- అందుకే పార్టీ నుండి బయటకు వచ్చా..
- 25 కోట్లపై ఇన్కమ్ టాక్స్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తా
- శాసనమండలి విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి

నవతెలంగాణ-హుజూరాబాద్:

హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో బీజేపీ గెలవడానికి ఎమ్మెల్యే ఈటల రాజేందర్, వివేక్ వెంకటస్వామి ఇచ్చిన డబ్బులు రేవంత్ రెడ్డికి ఇచ్చి బీఆర్ఎస్‌ను ఓడించడానికి పన్నిన కుట్ర బయటపడిందని శాసనమండలి విప్, ఎమ్మెల్సీ, హుజూరాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. శనివారం హుజూరాబాద్ బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎమ్మెల్యే ఈటల రాజేందర్ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డికి ఎన్నికల సమయంలో 25 కోట్ల రూపాయలు ఇవ్వడం వల్లనే కాంగ్రెస్ పార్టీ, బీజేపీ కి అనుకూలం గా వ్యవహరించిన మాట ప్రజలందరూ గమనిం చారని తెలిపారు. బీజేపీ కి కాంగ్రెస్ పార్టీ అనుకూ లంగా వ్యవహరించిందని తెలిసినందునే తాను ఆ పార్టీ నుండి బయటకు వచ్చానని చెప్పారు. ఎమ్మెల్యే ఈటల రాజేందర్ చెప్పిన 25 కోట్ల విషయంపై ఇన్కమ్ టాక్స్ కమిషనర్ కు ఫిర్యాదు చేస్తానన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక, హుజూరాబాద్ ఎంపీపీ ఇరుమల రాణి, ఐలయ్య, కౌన్సిలర్ తోట రాజేంద్రప్రసాద్, కుమారస్వామి, తోగరు బిక్షపతి, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి

మాలధారణతో మానసిక ప్రశాంతత

ఆలయ కమిటీ అధ్యక్షులు పొనగంటి మల్లయ్య



నవతెలంగాణ-జమ్మికుంట:
హనుమాన్ మాలధారణతో మానసిక ప్రశాంతత చేకూరతుందని ఆలయ కమిటీ అధ్యక్షులు పొనగంటి మల్లయ్య అన్నారు. శనివారం పట్టణంలోని మారుతీనగర్‌లో వెలసిన శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో 350 మంది భక్తులకు అర్ధ మండల దీక్ష మాలధారణ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం వివిధ గ్రామాల నుండి వచ్చిన భక్తులు హనుమాన్ మాలలు ధరించారు. ఆలయ ప్రాంగణం శ్రీ రామ జయ రామ జయ జయ రామ అనే నినాదాలతో మారుమోగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ పొనగంటి మల్లయ్య మాట్లాడుతూ, హనుమాన్ మాల వేసుకోవడం వల్ల మానసిక ప్రశాంతత చేకూరాడంతో పాటు చెడు వ్యాసనాలు దూరమావుతాయన్నారు. ఈ ప్రాంతంలో స్వాములు ఎక్కువగా పూజలు చేయటం వల్ల ఈ ప్రాంతం సుభింక్షంగా ఉంటుందని తెలిపారు. అనంతరం భక్తులకు మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మర్రి అవినాష్, పెంట రాజేందర్, మామిడి ఐలయ్య, భీమన్న, వట్టపెల్లి ప్రకాష్, ఊడుగుల సమ్మయ్య, మాలధారణ స్వాములు తదితరులు పాల్గొన్నారు.



వడ్డీ జలగలు!

- జిల్లాలో యథేచ్ఛగా వడ్డీ వ్యాపారుల దోపిడీ!
- పేదల అవసరాలను బట్టి 'వడ్డీ' పెంపు
- పలు చోట్ల గ్రూపులను ఏర్పరచి మరీ వడ్డీ వ్యాపారం
- దృష్టి సారించని పోలీసులు, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖలు

జిల్లాలో వడ్డీ వ్యాపారులు పేదలను దోపిడీ చేస్తున్నారు. ప్రయివేట్ వడ్డీ వ్యాపారుల చేతికి చిక్కి పేదలతోపాటు సామాన్యులు, కొందరు ఉద్యోగులు వడ్డీలు చెల్లించలేక విలవిల్లాడుతున్నారు. జిల్లా కేంద్రంతోపాటు కోరుట్ల, మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, తదితర ప్రాంతాలలో వడ్డీ వ్యాపారులు పెద్ద ఎత్తున వ్యాపారం సాగుతోంది.

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల జిల్లా కేంద్రంతోపాటు దాదాపుగా అన్ని గ్రామాలు, పట్టణాలల్లో వడ్డీ వ్యాపారులు పెద్ద ఎత్తున వ్యాపారం చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో అడ్డు చెప్పేవారు లేక పోవడంతో వారి ఆగడాలకు అంతు లేదు. సుమారుగా 10 శాతం వరకు వడ్డీ లాగుతూ పేదలను వడ్డీ జలగలు దోపిడీ చేస్తున్నాయి. డైలీ (రోజు), వారం, నెలవారీ కలెక్షన్ల పేరుతో వడ్డీకి డబ్బులిచ్చి కోట్లు గడిస్తున్నారు. ఈ వడ్డీ వ్యాపారుల ఒత్తిళ్ల తట్టుకోలేక కొందరు ఇండ్లు వదిలి వెళ్లిపోతుంటే.. మరికొందరు ఆత్మహత్యలకు పాల్పడు తున్నారు. కొందరు వ్యాపారులు రుణ గ్రహీతల ఇళ్లు, స్థలాలను తాకట్టుపెట్టుకుని చివరకు దౌర్జన్యంగా వాటిని స్వాధీనం చేసుకున్న సందర్భాలు జిల్లాలో అనేకం చోటు చేసుకుంటున్నాయి.

విచ్చలవిడిగా వడ్డీ..

జిల్లాలో వడ్డీ వ్యాపారులు అప్పు కోసం వచ్చే వారి అవసరాలను ఆసరాగా చేసుకోని ఒక్కోరకంగా వడ్డీ వసూలు చేస్తున్నారు. చిన్న చిన్న వ్యాపారులు, తోపుడు బండ్లు, తదితర వ్యాపారులు ఎక్కువగా ఏరోజుకారోజు జరిగే వ్యాపారం మీద ఆధారపడి జీవిస్తుంటారు. ఇలాంటి వారు పెట్టుబడి కోసం డైలీ ఫైనాన్స్ వారిని ఆశ్రయిస్తే.. ఉదయం రూ.900 ఇచ్చి.. సాయంత్రం రూ. 1000 వసూలు చేస్తుంటారు. తద్వారా రోజుకు అదనంగా ఒక్కొక్కరూ రూ.100 చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది. మరికొందరు నెలకు రూ.9000 ఇచ్చి నెల చివరి రోజున రూ.10,000 వసూలు చేస్తున్నారు. ఈ లెక్కన పేదలు చేస్తున్న వ్యాపారంలో వచ్చే ఆదాయం సగం ఫైనాన్స్ వారికే చెల్లించాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు.

అనుమతి లేకుండానే...

ప్రధానంగా ఫైనాన్స్, తాకట్టు వ్యాపారాలు చేయాలన్నా నిబంధనల ప్రకారం అనుమతి తీసుకోవాల్సి ఉంది. రెవెన్యూ, రిజిస్ట్రేషన్, పోలీసుశాఖ ద్వారా లైసెన్సులు కలిగి ఉండాలి. లైసెన్సులు పొందిన వారు మాత్రమే నియమ నిబంధనలకు లోబడి వ్యాపారాలు కొనసాగించాలి. కానీ జిల్లాలో ఎక్కువ మందికి ఎలాంటి లైసెన్స్‌లు లేవు. జిల్లా పోలీసు యంత్రాంగం ఇలాంటి వారిపై ప్రత్యేక నిఘా ఉంచి వారి దోపిడీకి కళ్లెం వేయాలని బాధితులు వాపోతున్నారు.

ఉద్యోగులే లక్ష్యంగా...

జిల్లాలో కొందరు వడ్డీ వ్యాపారుల కొత్త రకం దోపిడీకి తెరలేపారు. సామాన్యులు, మధ్యతరగతి వారికి వడ్డీకి ఇస్తే సక్రమంగా చెల్లించ లేరనే ఉద్దేశంతో ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. కొందరు వడ్డీ వ్యాపారులు ఉద్యోగుల వద్ద ఏటీఎం కార్డులు, బ్యాంకు పాస్ పుస్తకాలు, ఖాళీ చెక్కులు తీసుకుని అప్పుగా డబ్బులు ఇస్తున్నారు. ఇలా పలు రకాల గ్యారెంటీలతో వడ్డీ వ్యాపారులు జిల్లాలో ప్రజల శ్రమను దోచుకుని కోట్లకు పడగలెత్తారని సమాచారం. జిల్లాలో కొంత మంది పోలీస్ సిబ్బంది సంపూర్ణ సహకారంతో వడ్డీ వ్యాపారం వర్దిల్లుతుండగా, మరి కొంత మంది వ్యాపారులు పోలీస్ అధికారుల పేర్లు చెప్పి మరి వ్యాపారం చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

గ్రూప్‌లుగా ఏర్పరిచి మరి :

మహిళా సంఘముల వలే పలు చోట్ల గ్రూపులుగా ఏర్పరచి మరి వ్యాపార నిర్వహణ చేస్తున్నారు. ఒక్కో గ్రూప్‌కు కొంత మొత్తాన్ని వడ్డీ కింద ఇచ్చి వారం లేదా నెల వారీగా వసూలు చేస్తున్నారు. ఒక వ్యక్తికి ఇస్తే ఏదైనా ఇబ్బంది అవుతుందనే భావనతో కొత్తగా ఈ విధాన్ని అనుసరిస్తున్నారు. కొంతకాలం క్రితం పోలీసులు రైడింగ్ చేసి కొంతమంది వడ్డీ వ్యాపారుల నుండి ఇళ్లు, ఇళ్ల స్థలాల పత్రాలను, ఖాళీ చెక్కులు, ప్రామిసరి నోట్లు, బాండ్ పేపర్ లు, ఇతర స్థిరాస్తి తనఖా పత్రాలు స్వాధీన పరచుకున్నారు.


పత్రాల మార్పు

కొంత కాలం క్రితం ఉన్నతాధికారుల ఆదేశాలతో అధికారులు దాడులు చేసి పలు పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. కొన్ని రోజుల తరువాత అందులోని విలువైన కొన్ని పత్రాల ను తీసి వాటి స్థానములో తక్కువ విలువ గల పత్రాలతో, డుప్లికేట్ పత్రాలతో మార్చి తమ పోలీస్ మార్కును చూపించారు. అక్కడ అంతా రహస్యమే. ఈ తతంగం అంతా గప్ చుపే.

ఉన్నతాధికారుల ఆదేశాల తోనే దాడుల ?

ఎవరో ఎప్పుడో ఫిర్యాదు చేస్తే నో, లేదా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకో దాడులు, తనిఖీలు నిర్వహిస్తున్నారే తప్పా విధి నిర్వహణ లో భాగంగా చర్యలు తీసుకోకపోవడము ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారుల తీరు మారేనా వేచి చూడాల్సిందే.

యువతి అదృశ్యం



నవతెలంగాణ-చొప్పదండి :

చొప్పదండి మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైనట్టు పోలీసులు తెలిపారు. ఎస్సై ఉపేంద్ర చారి తెలిపిన కథనం ప్రకారం వివరాలు... మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన కొండమమత(24) మతిస్థిమితం సరిగాలేదు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం 10:30 గంటల ప్రాంతంలో ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. చుట్టు పక్కల వెతికినా ఆచూకి లభ్యం కాలేదు. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్టు ఎస్ఐ తెలిపారు. ఎవరికైనా అమ్మాయి కనిపిస్తే , ఆచూకీ తెలిస్తే వెంటనే ఈ క్రింది నెంబర్‌కు 8712670766 సంప్రదించాలని చొప్పదండి ఎస్ఐ ఉపేంద్ర చారి తెలిపారు.

శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవ గోడ పత్రికావిష్కరణ



నవతెలంగాణ - వీణవంక :

మండల కేంద్రంలోని అతి పురాతనమైన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం ఆలయ అర్చకులు సతీష్‌శర్మ ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సవ గోడపత్రికను ఆవిష్కరించారు అనంతరం వారు మాట్లాడుతూ..మే 1న కళ్యాణ, 3న శతకాభిషేకం 108 రకాల కలశముల అభిషేకాలు,4న కుంకుమార్చన,6 వ తేదీన రథోత్సవం చక్రస్నానం మొక్కులు మహా అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. ఈ కార్యక్రమంలో గోవింద స్వాములు దామోదర్, నరేష్ గౌడ్, రమేష్, శ్రీనివాస్, రవి, విశ్వంభర్, తిరుపతి, అరుణ్, రాజయ్య, అంకుష్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐకెపి కొనుగోలు కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-మేడిపల్లి :

మేడిపల్లి, భీమరం మండలాలకు చెందిన దమ్మనపేట, మన్నెగూడెం, గోవిందారం గ్రామాలలోని ఐకెపి కొనుగోలు కేంద్రాలను జడ్పీ వైస్ చైర్మెన్ హరిచరణ్‌రావు, ఎంపీపీ ఉమాదేవి రాజా రత్నాకర్‌రావు శనివారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఉదగిరి రమ్య ఆదిరెడ్డి, గ్రామ సర్పంచులు సురేష్, సింగిరెడ్డి నరేష్ రెడ్డి, కే మధుకర్, పార్టీ మండల అధ్యక్షుడు సత్తిరెడ్డి, ఎంపీటీసీలు పూర్ణిమ ప్రభాకర్, రవీందర్‌రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రమేష్ నాయక్ ,రెబ్బాస్ మల్లయ్య, తిరుమల్, మాజీ మండలాధ్యక్షుడు అంకం సాగర్, ఏపిఎం గట్ల అశోక్, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం.. పంటలకు తీవ్ర నష్టం

ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే భరోసా



నేల మీద ఒరిగిన నువ్వు పంట

నేలరాలిన మామిడికాయలతో రైతు

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం :

ఆరుగాలం కష్టపడి పండించిన పంట అకాల గాలివాన బీభత్సంతో చేతికి అందివచ్చే పంట నేలపాలు కావడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇబ్రహీంపట్నం మండలంలో నువ్వు పంట 1250 ఎకరాలు సాగు చేస్తే 370 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. మామిడి తోటలు మొత్తం విస్తీర్ణం 386 ఎకరాలు అయితే 375 ఎకరాల్లో నేలమట్టమయ్యాయి. సుమారుగా రెండు కోట్ల పైగా నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. కింద పడిన మామిడికాయకు మార్కెట్లో తగిన ధర రావడం లేదు. పూత దశలో ఉన్నప్పుడే మామిడి తోటలను కౌలుకు తీసుకొని కాపాడుకుంటున్న మామిడి రైతుకు ఈదురు గాలుల వాన తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. దీంతో వ్యవసాయ అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి రెండు రోజుల క్రితం మామిడి తోటలను నష్టపోయిన నువ్వు పంటలను పరిశీలించి నివేదికను ఉన్న తాధికారులకు నివేదిస్తున్నారు. అంతేకాకుండా కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ.. నష్టపోయిన రైతులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

పిడుగు పాటుకు వ్యక్తి మృతి

నవతెలంగాణ-మల్యాల :

మల్యాల మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన ముత్యం మల్లేశం గౌడ్ (55) పిడుగు పాటుకు మృతి చెందాడు. దిగువ కొండగట్టులోని పెట్రోల్ పంపు ఎదుట తాటి చెట్టు కింద కూర్చొని ముంజలు విక్రయిస్తున్న క్రమంలో చెట్టుపై పిడుగు పడిందని, పిడుగు పాటు ప్రభావంతో కిందనే ఉన్న మల్లేశం అక్కడికక్కడే మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మిలుకూరి వాసుదేవరెడ్డి



వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న వాసుదేవ రెడ్డి

నవతెలంగాణ-కొత్తపల్లి :

వరి ధాన్యం కొనుగోలు సెంటర్లు వెంటనే ప్రారంభించి రైతాంగం ఇబ్బందులు లేకుండా కొనుగోలు వేగవంతం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మిలుకురి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కొత్తపల్లిలో ఐకెపి ధాన్యం కొనుగోలు సెంటర్‌ను సందర్శించిన అనంతరం వాసుదేవరెడ్డి మాట్లాడుతూ.. ఈ రబీ సీజన్లో జిల్లాలో వరి రైతులు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం ద్వారా నేరుగా కొనుగోలు సెంటర్లు వెంటనే ప్రారంభించి వెనువెంటనే కొనుగోళ్లు జరపాలన్నారు. 15 రోజుల నుండి ధాన్యం దిగుబడి వస్తుందని, కల్లాల వద్ద కొనుగోలు సెంటర్ల వద్ద కుప్పలుగా పోసి రైతులు కొనుగోళ్ల కోసం దీనంగా ఎదురుచూస్తున్నారన్నారు. కొంతమంది రైతులు సమయానికి కొనుగోలు సెంటర్లు ప్రారంభించకపోవడంతో నేరుగా దళారీల ద్వారా ధాన్యం తక్కువ ధరకు అమ్ముకుంటున్నారన్నారు. తద్వారా జిల్లాలోని రైతాంగం కోట్లాది రూపాయలు నష్టపోయే అవకాశం ఉందన్నారు. కొనుగోలు సెంటర్లలో టెంట్లు, తాగునీరు సౌకర్యం, గన్ని సంచులు, టార్పాలిన్ కవర్లు,సుతిల్ దారం అందుబాటులో ఉంచాలన్నారు. అకాల వర్షాలు పడే అవకాశం ఉన్నందున అన్ని రకాలుగా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 353 కొనుగోలు సెంటర్లు ప్రారంభించాల్సి ఉండగా కేవలం కొన్ని సెంటర్లు మాత్రమే ప్రారంభించారన్నారు. ప్రారంభించిన ఆ సెంటర్లలో కూడా వరి ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన కొనసాగుతుందన్నారు. వెంటనే కొనుగోలు సెంటర్లు ప్రారంభించి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసి రైతుల అకౌంట్లో నేరుగా డబ్బులు జమ అయ్యేవిధంగా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు. రైస్ మిల్లర్లు గతంలో సంచికి రెండు కిలోల నుండి 5 కిలోల వరకు తరుగు తీశారు. మళ్లీ అలా పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు సెంటర్ నుండి రైస్ మిల్లులకు ధాన్యాన్ని తరలిం చేందుకు ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ఎలాంటి కటింగ్లు లేకుండా కొనుగోలు జరపాలని, హమాలి చార్జీలు ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి బీమా సాహెబ్, కరీంనగర్ రూరల్ జోన్ కార్యదర్శి కవ్వంపల్లి అజయ్, జె.అంజయ్య, కే స్వామి, మల్లారెడ్డి, మణిదీప్, వి స్వామి తదితరులు పాల్గొన్నారు.

ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలి

- కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర
- సీఎం, ఎంపీ, ఎమ్మెల్యే దిష్టిబొమ్మలు దహనం
- ఫ్యాక్టరీ తెరిపించకుంటే బీఆర్ఎస్‌కు డిపాజిట్ దక్కదు
- పార్లమెంట్ ఎన్నికల్లో కవితకు పట్టిన గతే పడ్తది
- కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ్‌రావు



నవతెలంగాణ-మెట్‌పల్లిరూరల్ :

ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగ్‌రావు, జువ్వాడికృష్ణరావు ఆధ్వర్యంలో శనివారం వెంపేట గ్రామం నుంచి ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. గతంలో ఈ ప్రాంతం నుంచి ప్రాతినిధ్యం వహించిన ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, బిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చినాక షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తామని మాయ మాటలు చెప్పి ఇప్పటి వరకూ తెరిపించ లేదని అన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో కల్వకుంట్ల కవితకు నిజామాబాద్ పార్లమెంట్ రైతులు, ప్రజలు తగిన బుద్ధి చెప్పారని అన్నారు. ఎంపీ అరవింద్ కూడ ఫ్యాక్టరీ తెరిపిస్తానని నియోజకవర్గం రైతులను,ప్రజలను మాటిచ్చి మోసం చేశాడని ఆరోపించారు. నిజంగా ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే మూసి వేసిన షుగర్ ఫ్యాక్టరీని తెరిపించి తర్వాత ఇతర ఫ్యాక్టరీల గురించి ఆలోచించాలని అన్నారు. ఈ షుగర్ ఫ్యాక్టరీ తెరిపించని పక్షంలో దాదాపు ఈ ప్రాంతంలోని మొత్తం 20 సెగ్మెంట్లలో బిఆర్ఎస్ పార్టీకి డిపాజిట్లు కూడా రావని పేర్కొన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన పార్టీ బిఆర్ఎస్ పార్టీ అని అన్నారు. . రాబోవు రోజుల్లో బిఆర్ఎస్ పార్టీకి రైతులు,ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ ఎదుట సీఎం కేసీఆర్, నిజామాబాద్ ఎంపి ధర్మపురి అరవింద్,ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, వేంపేట ఉప సర్పంచు గోరుమంతుల ప్రవీణ్ కుమార్, అల్లూరి సురేందర్ రెడ్డి,వేంపేట గ్రామ శాఖ అధ్యక్షుడు రాజారెడ్డి, లింగారెడ్డి, బద్దం స్వామి, రైతు అధ్యక్షుడు మామిడి నారాయణరెడ్డి, మాజీ జెడ్పిటిసి వై.జలపతి రెడ్డి, కొంతం రాజం, ఎంపిటీసీలు మామిడి మంజుల లక్ష్మారెడ్డి, మల్లయ్య, సిడి సి మాజీ చైర్మన్ కంది బుచ్చిరెడ్డి, రాజేందర్ రెడ్డి, కోరుట్ల పట్టణ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, పెరుమాండ్ల సత్యనారాయణ,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, కిషన్ సెల్ కార్యదర్శి క్రాంతి కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొమిరెడ్డి లింగారెడ్డి, బి.శ్రీనివాస్, అందే మారుతి, యూత్ కాంగ్రెస్ నాయకులు జెట్టి లక్ష్మణ్, మామిడి మహేష్, నల్ల శేఖర్, ఎలేటి మహేష్, బాపురెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రైతు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలి

టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ



నవతెలంగాణ-జగిత్యాలటౌన్ :

అర్హులైన జర్నలిస్టులకు జగిత్యాల జిల్లా కేంద్రంలో నివేశన స్థలాలను వెంటనే మంజూరు చేసి, ఇండ్లు నిర్మాంచుకోవడానికి ఆర్థిక సాయం చేయాలని సీనియర్ జర్నలిస్టులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని కోరుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్. జైపాల్, వెంకటరమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంతకాల సేకరణ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు సిరిసిల్ల శ్రీనివాస్, ఐజేయు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏం. ప్రదీప్ కుమార్, ఐజేయు జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లాల రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎనిమిదేండ్లుగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను కేటాయిస్తామని పదేపదే వాగ్దానం చేస్తూ దాటవేత ధోరణి అవలంబిస్తుందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాల కేటాయింపుతో పాటు ఇల్లు నిర్మించుకోవడానికి ఆర్థిక సహాయాన్ని కూడా అందించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, మాకు రాజలింగం, కోశాధికారి మేన్నెని శ్రీనివాసరావు, గుండేటి రాజు, సంపూర్ణ చారి, లక్ష్మారెడ్డి, కాంతారావు లక్ష్మణ్, సిరిసిల్ల వేణుగోపాల్, రాజకుమార్, మహేష్ పటేల్, ఆర్ శ్రీను, కడలి మోహన్ రావు, రాజేశ్వర్ రెడ్డి, ఎం. ముఖేష్ రెడ్డి, అక్కినపల్లి బాబు, గణేష్ లవంగా, సిరిపురం శ్రీనివాస్, గోనె గంగాధర్ పాల్గొన్నారు.

దీక్ష శిబిరాన్ని సందర్శించిన వివిధ పార్టీల నాయకులు :

జర్నలిస్ట్ ఇల్లు స్థలాల కోసం చేపట్టిన సంతకాల సేకరణ శిబిరాన్ని పలువురు పార్టీ నాయకులు సందర్శించి జర్నలిస్టులకు మద్దతుగా సంఘీభావం తెలిపారు. బీజేపీ పార్టీ సీనియర్ నాయకులు ఏసీఎస్ రాజు, వనమాల సత్యనారాయణ, రాజేందర్ రెడ్డి, టీడీపీ నాయకులు అక్కినపల్లి కాశీ నాథం, టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి బండ శంకర్, మాజీ కౌన్సిలర్ గాజుల రాజేందర్, గాజుల నగేష్ , బింగి రవి, నాయకులు రాంమోహన్ రావు, కమటాల శ్రీనివాస్, బిసి నాయకులు ఇట్టే సురేందర్, ఆకుల నాగరాజు, ముసిపట్ల నారాయణ, పూర్వ విద్యార్థి నాయకులు జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల మంజూరు డిమాండ్ న్యాయమైందన్నారు.

రైతులు అధైర్య పడవద్దు.. అండగా ఉంటాం


ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



మామిడి పంట ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ -రాయికల్ : పంట నష్ట పోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుం టుందని, అధైర్య పడవద్దని ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. గురు వారం రోజు కురిసిన అకాల వర్షం,భారీ ఈదురు గాలులకు మామిడి,ఇతర పంటలకు తీవ్ర నష్టం కాగా రాయికల్ మండల కొత్తపెట్ గ్రామంలో మామిడి పంటను శనివారం పరిశీలించారు. రాష్ట్రంలో ఇటీవల అకాల వర్షలకి నష్టపోయిన రైతులకు ముఖ్యమంత్రి ఏరియల్ సర్వే చేసి,నష్ట పరిహారం సైతం విడుదల చేశారని గుర్తు చేశారు.అకాల వర్షాల వల్ల రైతులకు నష్టం వాటిల్లింది అని,ప్రభుత్వ పక్షాన నష్ట పరిహారం త్వరిత గతిన అందజేయటానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సంధ్యారాణి సురేందర్ నాయక్,సర్పంచ్ బత్తిని రాజేశం, మన్నెగుండ్ల వెంకమ్మ నర్సయ్య,ఎంపీటీసీ మందుల శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి,వైస్ ఎంపీపీ మహేశ్వర రావు,మండల పార్టీ అధ్యక్షులు కోల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తలారి రాజేష్,మాజీ యూత్ అధ్యక్షులుఎలిగేటి అనిల్,సర్పంచులు శ్రీనివాస్, జక్కుల చంద్రశేఖర్,రవి,నాగాలయం చైర్మెన్ ప్రవీణ్, నాయకులు పాల్గొన్నారు.

అర్హులకు కళ్లద్దాలు పంపిణీ



అద్దాలను అందజేస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామంలో సర్పంచ్ లింగంపల్లి గంగాధర్ ఆధ్వర్యంలో కంటి వెలుగు అద్దాలను శనివారం అర్హులకు అందజేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమం గత కొన్ని రోజుల క్రితం డబ్బా గ్రామంలో నిర్వహించగా కంటి పరీక్షలు చేసుకొని కంటి అద్దాలు అవసరం ఉన్నవారికి అద్దాలనుపంపిని చేశారు. ఈ కార్యక్రమంలో నేరేళ్ల సత్యంగౌడ్, ఏఎన్ఎం మహేశ్వరి, శీను, తదితరులు పాల్గొన్నారు

హోం మంత్రికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన మండల నాయకులు



పెగడపల్లి 01: హోం మంత్రికి రంజాన్ శుభాకాంక్షలు

నవతెలంగాణ-పెగడపల్లి :

రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి పెగడపల్లి మండల బీఆర్ఎస్ నాయకులు శనివారం హైదరాబాద్ క్యాంపు కార్యాలయంలో హోం మంత్రి మహమ్మద్ అలీని కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు ఫోరం మండల అధ్యక్షుడు కోరుకంటి రాజేశ్వర్‌రావు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లోక మల్లారెడ్డి, నర్సింహునిపేట సర్పంచ్ నెరువట్ల బాబు స్వామి, గొల్లపెల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కాంపెల్లి హన్మండ్లు, నాయకులు భాస్కర్ రావు, చెట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

గోవిందారంలో పిడుగు ప్రమాదంతో 20 మేకలు మృత్యువాత


బాధిత కుటుంబాలను ఆదుకోవాలి: సర్పంచ్, ఎంపీటీసీల



నవతెలంగాణ-మేడిపల్లి :

మండలంలో కురిసిన అకాల వర్షంతో పాటు పిడుగు పాటుకు గోవిందారం గ్రామానికి చెందిన గంగాన వేని దేవయ్య 20 మేకలు మృత్యువాత పడ్డాయి. సూరంపేటకు వెళ్ళు మార్గంలో ఉన్న కొత్త చెరువు వద్ద మృతి చెందాయని గ్రామ సర్పంచ్ కె. మధుకర్, ఎంపీటీసీ పూర్ణిమ ప్రభాకర్ తెలిపారు. 20 మేకలు మృతి చెందడం వల్ల సుమారు రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లిందని ప్రభుత్వ పరంగా బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రజాప్రతినిధులు కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



లింగాపూర్ లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న సర్పంచ్ శంకర్,

నవతెలంగాణ-పెగడపల్లి :

పెగడపల్లి మండల పరిధిలో లింగాపూర్, శాలపల్లి గ్రామాల్లో పెగడపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ను శనివారం సర్పంచులు ఈరెల్లి శంకర్, బొడ్డు తార ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులందరూ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ శేఖర్‌రావు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గోలి సురేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సత్తయ్య, డైరెక్టర్లు మల్లేశం, తిరుపతి, పాల్గొన్నారు.

అకాల వర్షంతో తీరని నష్టం

నవతెలంగాణ-మేడిపల్లి : ఉమ్మడి మేడిపల్లి మండలంలోని మారుమూల ప్రాంతాలైన మోత్కరావుపేట, రాజలింగంపేట, పసునూరు, గోవిందారం, కొండాపూర్ తదితర గ్రామాలలో రాళ్లతో కూడిన వర్షం పడి అపార నష్టం వాటిల్లిందని ఆయా గ్రామాల సర్పంచులు నరసయ్య, మధుకర్, లచ్చునాయక్ ,చారి, అభిలాష్ పేర్కొన్నారు. రైతులు ఆరుగాలం పండించిన పంటలు మొక్కజొన్న, వరి, నువ్వులు, మామిడి, పంటలను ప్రభుత్వపరంగా పంట నష్టం అంచనా వేసి బాధిత కుటుంబాలకు భరోసా కల్పించాలని రైతు సంఘాల నాయకులు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరారు. గోవిం దారం సర్పంచ్ కె. మధుకర్ కొత్తచెరువు సమీపంలో పిడుగు పడి 20 మృతువాత పడడంతో బాధిత కుటుంబాన్ని క్షేత్రస్థాయిలో పర్యటించారు. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని ఆయన కోరారు.

మానవత్వం చాటుకున్న డాక్టర్ గోలి మోహన్



నవతెలంగాణ-కథలాపూర్ :

వేములవాడ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకుని తిరుగు ప్రయాణమవుతున్న నిర్మల్‌కు చెందిన వారు కథలాపూర్ మండలం తాండ్రియాల గ్రామం వద్ద కారు అదుపుతప్పి కల్వర్టుకు ఢీకొట్టింది. ఈ ఘటనలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. డాక్టర్ గోలి మోహన్ క్షతగాత్రులను కథలాపూర్ ఆస్పత్రికి చికిత్స అందిం చారు. తర్వాత వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

నవతెలంగాణ-కథలాపూర్ : కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని తెలంగాణ ఉద్యమకారుడు రైతు గడ్డం రాజేశ్వరిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆయన వరి ధాన్యం కలాలను పరిశీలించారు. వరి కోతలు 20 రోజుల కిందట ప్రారంభించినా కోనుగోలు ఇప్పటికీ చేయడం లేదన్నారు.

వడగండ్ల వానకు పంట నష్టం

నవతెలంగాణ-మల్యాల : మల్యాల మండలంలోని మద్దుట్ల గ్రామంలో శనివారం కురిసిన వడగండ్ల వానకు వరి ధాన్యంతో పాటు మామిడి కాయల పంట నష్టం పెద్దఎత్తున వాటిల్లినట్లు గ్రామస్తులు వాపోయారు. ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని విన్నవించుకున్నారు.

తల్లి, కూతురు అదృశ్యం

నవతెలంగాణ-మల్యాల : గొడవలతో బయటకు వెళ్లిన తల్లి, కూతురు అదృశ్యమయ్యారు. మల్యాల మండలంలోని పోతారం గ్రామానికి చెందిన బోల్లరాపు లత (28) భర్త శ్రీకాంత్‌తో గొడవ జరిగి ఈనెల 19న రాత్రి తన రెండేండ్ల కూతురు బోల్లరాపు వర్షిణితో ఇంటి నుంచి ఎక్కడికో వెళ్లిపోయిందని తల్లి రాగుల లింగవ్వ (లత తల్లి) ఫిర్యాదు మేరకు మల్యాల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు మల్యాల పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

లెనిన్ పోరాట స్ఫూర్తితో పేదలకు ఇండ్ల స్థలాలు సాధించుకుందాం

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్
- భూ పోరాట కేంద్రాల కార్యకర్తల రాజకీయ శిక్షణా తరగతులు


నివాళి అర్పిస్తున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్

నవతెలంగాణ - గోదావరిఖని:

లెనిన్ పోరాట స్ఫూర్తితో పేదలకు ఇండ్ల స్థలాలు సాధించుకుందామని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ పిలుపునిచ్చారు. సీపీఐ (ఎం) పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గోదావరిఖ నిలోని రాజ్యలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో భూ పోరాట కేంద్రాల కార్యకర్తల రాజకీయ శిక్షణా తరగతులను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లెనిన్ 153వ జయంతిని పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాజ్య లక్ష్మి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించు కున్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని లెనిన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి మాట్లాడారు. దేశ సంపదకు సృష్టికర్తలుగా ఉన్న కష్ట జీవులను దోచుకుంటూ కొంతమంది తమ సంపదను పోగేసుకోవడం వల్ల దేశ అభివృద్ధికి ఎలాంటి ప్రయోజనం చేకూరదని, పాలకులు ప్రజలను ఎలా గౌరవించాలో ఆచరణలో నిరూపించిన లెనిన్ మార్గం చాలా విలువైందన్నారు. ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా లెనిన్ నాయకత్వంలో దోపిడీ లేని సోషలిస్టు రాజ్యాన్ని రష్యాలో అధికారంలోకి తీసుకురావడంతోపాటు ప్రజా పాలన ఎలా ఉండాలో నిరూపించారన్నారు. తన దేశం ఒక్కటే బాగుంటే సరిపోదని ప్రపంచంలోని అన్ని దేశాలు బాగుండాలని కోరుకుంటూ ఇతర దేశాల అభివృద్ధికోసం సహాయ సహకారాలందించడం జరిగిందన్నారు. భారత దేశం అభివృద్ధిలో రష్యా ముఖ్య భూమిక పోషించిందన్నారు. నేడు భారత దేశంలో అధికారంలో ఉన్న ఆర్ఎస్ఎస్, బిజెపి మోడీ ప్రభుత్వం దేశ అభివృద్ధికి కృషి చేయకుండా దేశ సంపదను కార్పొరేట్ సంస్థల అధిపతులకు కట్టబెట్టడుతుదన్నారు. హిందుత్వ నినాదం పేరుతో హిందువులపై దాడులు చేస్తూ, రక్షణ లేకుండా చేస్తుందని, మతోన్మాదాన్ని పెంచి దేశాన్ని ముక్కలు చెయ్యాలని చూస్తుందన్నారు. భారత దేశంలో మనిషి శ్రమకు విలువనిచ్చే సోషలిస్టు రాజ్యాన్ని సాధించుకోవాలని ప్రజలకు సీపీఐ(ఎం) పిలుపునిస్తుందన్నారు. అనంతరం వర్గాలు-వర్గ పోరాటాలు, సీపీఐ(ఎం) పార్టీ విశిష్టత అనే అంశాలపై పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.ముత్యం రావు క్లాసు బోధించారు. దేశంలో పేదలు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అనేక సమరశీల పోరాటాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశంలో బీజేపీ అనుసరిస్తున్న మతోన్మాద విధానాలు ప్రజల్లో ఉన్న ఐక్యతను దెబ్బతీసేలా ఉందని అన్నారు. ప్రజలను సమస్యల పట్ల కాకుండా మతం వైపు మళ్లించేల ఆర్ఎస్ఎస్, బీజేపీలు పనిచేస్తున్నాయన్నారు. ఈ ప్రమాదాన్ని అందరం కలసి ఎదుర్కోకపోతే భవిష్యత్‌లో తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని పార్టీ ఆధ్వర్యంలో అనేక కేంద్రాల్లో భూ పోరాటాలు జరుగుతున్నాయని అందులో భాగంగా పెద్దపల్లి జిల్లాలో గోదావరిఖనిలో 4 కేంద్రాల్లో భూ పోరాటాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇక్కడున్న కొంతమంది వివిధ రాజకీయ పార్టీల నాయకులు, భూ బకాసురులు ప్రభుత్వ భూములు కబ్జా చేస్తుంటే తమకేమీ పట్టనట్టుగా రెవెన్యూ అధికారులు, పోలీసులు ఉన్నారన్నారు. కానీ పేదలు నిలువ నీడ కోసం ప్రభుత్వ భూములల్లో గుడిసెలు వేసుకుంటే మాత్రం రెవెన్యూ అధికారులు, పోలీసులు వచ్చి అడ్డుకోవడం చూస్తుంటే వీరంతా భూ కబ్జా దారులకే వత్తాసు పలుకుతున్నట్టు అనిపిస్తోందన్నారు. నిజంగా ప్రజా ప్రతినిధులకు పేదల పట్ల చిత్త శుద్ధి ఉంటే పేదల కోసం సీపీఐ(ఎం) చేస్తున్న భూ పోరాటాలకు మద్దతు ఇవ్వాలన్నారు. అంతేకానీ భూ పోరాటాలను అడ్డుకోవాలని ప్రయత్నం చేస్తే ప్రజల్లో అబాసుపాలు కాకతప్పదన్నారు. జిల్లా కార్యదర్శి వై.యాకయ్య మాట్లాడుతూ భవిష్యత్తులో ప్రజా ప్రతినిధులు, అధికారులు భూ పోరాటాలకు సహకరించక పోతే, పోరాటాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తే ఇండ్ల స్థలాల కోసం వస్తున్న పేదలతో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యద్శివర్గ సభ్యులు ఎం.రామాచారి, జిల్లా కమిటీ సభ్యులు ఈ.లావణ్య నాయకులు బిక్షపతి, నాగమణి, ఉపేందర్, సంజీవ్, నాగలక్ష్మి, లక్ష్మా రెడ్డి, బిక్షపతి, ఉపేందర్, రమణ, సురేష్, శివ కుమార్, రాజ్ కుమార్, వెంకటస్వామి, దేవితోపాటు 300 మంది పాల్గొన్నారు.



రాజన్న సిరిసిల్ల ప్రభుత్వ మెడికల్ కళాశాలకు ఎన్ఎంసీ గ్రీన్ సిగ్నల్

నవతెలంగాణ - సిరిసిల్ల

రాజన్న సిరిసిల్ల ప్రభుత్వ మెడికల్ కళాశాలకు జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) అనుమతి మంజూరు చేసింది. రాజన్న సిరిసిల్ల ప్రభుత్వ వైద్య కళాశాల 2023-24 విద్యాసంవత్సరం నుంచి తరగతుల ప్రారంభానికి అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ఎన్ఎంసీ మెడికల్ అసెస్‌మెంట్ రేటింగ్ బోర్డు(ఎంఏఆర్‌బీ) శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్ఎంసీ మెడికల్ అసెస్‌మెంట్ రేటింగ్ బోర్డు(ఎంఏఆర్‌బీ) అసెమెంట్ చేసిన 5 రోజుల్లోనే అనుమతులు మంజూరు చేయడం విశేషం. రాజన్న సిరిసిల్ల ప్రభుత్వ వైద్య కళాశాల 2023-24 విద్యాసంవత్సరం నుంచి తరగతుల ప్రారంభానికి అనుమతితో కళాశాలలో వంద ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి రానున్నాయి. రాజన్న సిరిసిల్ల ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎన్ఎంసీ నిబంధనల మేరకు బోధన సిబ్బందిని నియమించడంతో పాటు మౌలిక వసతులను కల్పించాలని స్పష్టం చేసింది.

మంత్రి కేటీఆర్ హర్షం..

రాజన్న సిరిసిల్ల ప్రభుత్వ మెడికల్ కళాశాలకు జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) అనుమతి మంజూరు చేయడం పట్ల మంత్రి కే తారక రామారావు హర్షం వ్యక్తం చేశారు. మెడికల్ కళాశాల తరగతులు ప్రారంభించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

శరవేగంగా జిల్లా మెడికల్ కాలేజీ భవన నిర్మాణం

సకల వసతులు.. ఆధునిక హంగులతో చేపడుతున్న రాజన్న సిరిసిల్ల జిల్లా మెడికల్ కాలేజీ భవన నిర్మాణాలు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి.

రేపటినుంచి ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరం

నవతెలంగాణ - గోదావరిఖని:

తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు (సిఎస్‌సి) ఆధ్వర్యంలో గంగా నగర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్స్ (ఎన్ఎసి) భవన ప్రాంగణంలో ఈనెల 24నుంచి 20 రోజుల పాటు ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరం నిర్వహించనున్నట్టు రామగుండం నగర పాలక సంస్థ మేయర్ బంగి అనిల్ కుమార్, కమిషనర్ సుమన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. సంక్షేమ బోర్డు ద్వారా జారీ చేయబడిన లేబర్ కార్డున్న భవన నిర్మాణ కార్మికులు, ఇతర కార్మికులకు దాదాపు 50రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెడిపోయిన హ్యాండ్ బోర్

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

నవతెలంగాణ-ముత్తారం:


చెడిపోయిన బోర్‌ను చూపిస్తున్న మహిళలు

ముత్తారం మండలం పారుపల్లి గ్రామంలోని గౌడ్స్ కాలనీలో హ్యాండ్ బోర్ చెడిపోయింది. గత మూడు నెలల నుంచి ఈ పరిస్థితి నెలకొంది. అయితే చెడిపోయిన బోర్‌కు మరమ్మత్తులు చేయించాలని ఎన్ని సార్లు అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని గ్రామ మహిళలు ఆరోపిస్తున్నారు. ఎండాకాలంలో నీటికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని బోర్‌కు మరమ్మతులు చేయించాలని మహిళలు కోరుతున్నారు.

వీరమరణం పొందిన జవాన్లకు నివాళి



నవతెలంగాణ - ముత్తారం:

ఉగ్రవాదుల దాడిలో వీరమరణం పొందిన జవాన్ల ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ ముత్తారం మండలం హరిపురం గ్రామంలోని బస్టాండ్ ఆవరణలో వేల్పూరి సంపత్‌రావు ఆధ్వర్యంలో కొవ్వత్తులతో నివాళి అర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులున్నారు.


క్షతగాత్రులను తరలింపజేస్తున్న డాక్టర్ మోహన్ గోలి

మానవత్వం పరిమళించిన వేళా..

- రోడ్డు ప్రమాద క్షతగాత్రులను సొంత కారులో తరలించిన డాక్టర్ మోహన్ గోలి
- హర్షం వ్యక్తం చేసిన స్థానికులు
- నియోజకవర్గ వ్యాప్తంగా మోహన్‌పై అభినందనల వెల్లువ

నవతెలంగాణ - వేములవాడ : ఇప్పటికే ఎన్నో సేవ కార్యక్రమాలు చేస్తూ, ఆపదలో ఉన్న మరెంతో మందికి అండగా నిలుస్తూ, నియోజకవర్గ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకుంటున్న వేములవాడ నియోజకవర్గానికి చెందిన ఆధ్యగోలి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ మోహన్ గోలి మరోసారి తన విశాల హృదయాన్ని చాటుకున్నాడు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి దిక్కుతోచని స్థితిలో ఉన్నవారికి అండగా నిలిచి ప్రజా నాయకుడు అనిపించుకున్నాడు. వివరాల్లోకి వెళితే నిర్మల్ జిల్లాకు చెందిన ఓ కుటుంబం శనివారం ఉదయం వేములవాడ రాజన్నను దర్శించుకొని కారులో తిరుగు ప్రయాణం అయ్యారు. అయితే కథలాపూర్ మండలం తాండ్రియాల గ్రామం వద్ద వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి కల్వర్టును బలంగా ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న వారు తీవ్రంగా గాయపడ్డారు. ఈ క్రమంలో వేములవాడ నియోజకవర్గ పర్యటన ముగించుకుని వేములవాడకు వస్తున్న డాక్టర్ మోహన్ గోలి ప్రమాదంలో గాయపడి రోడ్డు పక్కన ఉన్న క్షతగాత్రులను చూసి చలించిపోయారు. మానవతా దృక్పథంతో స్పందించిన ఆయన వెంటనే తన సొంత కారులో క్షతగాత్రులను హుటాహుటిన కథలాపూర్ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించేందుకు కృషి చేశారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, ఆపద సమయంలో అన్ని తానై వ్యవహరించారు. ఇదిలా ఉండగా ఈ పరిణామాలను అన్నింటినీ గమనించిన స్థానికులు... "ఆపద సమయంలో అండగా ఉండి, మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నాడంటూ అంటూ డాక్టర్ మోహన్ గోలిపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు".ఈ వీడియోలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లోనూ వైరల్‌గా మారడంతో డాక్టర్ గోలి మోహన్ కు నియోజకవర్గ వ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

మేడే వారోత్సవాలను జయప్రదం చేయండి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు



నవతెలంగాణ - గోదావరిఖని: ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే వారోత్సవాలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు పిలుపునిచ్చారు. మేడే వారోత్సవాలను మే1 నుండి 7వరకు నిర్వహించాలని, మేడే శిబిరాలను ఏర్పాటు చేసి ప్రతిరోజు మేడే శిబిరాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడల పోటీలు తదితర నిర్వహించి సామాన్య కార్మికుల కుటుంబాల ప్రజలందరూ పాల్గొనే విధంగా మేడే వారోత్సవాలను నిర్వహించాలని అన్నారు. సిఐటియు జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి అధ్యక్షతన గోదావరిఖనిలోని సిఐటియు శ్రామిక్ భవన్‌లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్నకార్మిక వ్యతిరేక విధానాల మూలంగా మేడే ప్రాధాన్యత మరింత పెరిగిందని అన్నారు. 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చి ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దుచేసి 12 గంటల పని విధానం అమలుకు కేంద్ర ప్రభుత్వం పూకొంటుందని, అదేవిధంగా కార్మిక వర్గానికి ఉన్న సమ్మె హక్కును నిర్వీర్యం చేస్తుందని, కనీస వేతనాల చట్టాన్ని రద్దు చేస్తుందని, పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్, గ్రాడ్యుటీ లాంటి సంక్షేమ సౌకర్యాలు అన్నింటిని నిర్వీర్యం చేసే పద్ధతుల్లో ఈ లేబర్ కోడ్లు ఉన్నాయని, ఈ లేబర్ కోడ్ల రద్దు కోసం చికాగో అమరవీరుల స్ఫూర్తితో పోరాటాలు నిర్వహించాల్సినటువంటి అవసరం భారతదేశంలో నెలకొన్నదని అన్నారు. అందుకు జిల్లాలో ఉన్న మొత్తం కార్మిక వర్గాన్ని చైతన్య పరచడానికి మేడే వారోత్సవాలను ప్రతి గ్రామానికి, ప్రతి వార్డుకు, ప్రతి బస్తీకి తీసుకెళ్లి విస్తృత ప్రచారం నిర్వహించాలని అన్నారు. మేడే వారోత్సవాల నిర్వహణకు జిల్లాలోని కార్మిక వర్గం పెద్ద ఎత్తున సహాయ సహకారాలు అందించి విజయవంతానికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు ఎస్.బిక్షపతి, జి.జ్యోతి, ఎమ్.రామాచారి, బి.వనజారాణి, సిహెచ్.అరవింద్, ఎస్.వెంకట స్వామి, వి.నాగమణి, బి.గణేష్, సిహెచ్.లక్ష్మీనారాయణ, ఏ.నందిని, జి.లక్ష్మారెడ్డి, టి.మల్లేష్ తదితరులున్నారు.

మోడీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే.. రాజ్యాంగం, ఓటు హక్కు హరించే అవకాశం ఉంది

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి


సభలో మాట్లాడుతున్న జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి

నవతెలంగాణ - గంభీరావుపేట :

మోడీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాజ్యాంగంతోపాటు ఓటు హక్కును హరించే అవకాశం ఉందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. శనివారం గంభీరావుపేట మండల కేంద్రానికి విచ్చేసిన సిపిఐ ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఏర్పాటు చేసిన గంభీరావుపేట సభలో పాల్గొని ప్రసంగించారు. దేశం ఎటువైపు పోతున్నది.. దేశం ఎవరిని పాలవుతున్నది.. స్వాతంత్ర్య ఫలాలు ఎవరికి అందుతున్నాయో చెప్పడానికే మీ ముందుకు వచ్చామన్నారు. రంగురంగుల జెండాలు అధికారులకు వస్తున్నాయి పోతున్నాయి కానీ బతుకులు మారటం, కష్టాలు తీరడంలేదన్నారు. రెక్కలు ముక్కలు చేసుకున్నా ఎంత కష్టపడ్డ గుర్రం డొక్కా ఎత్తం లాగానే దినదిన గండం లాగా సాగుతున్నాయని అన్నారు. రాజ్యాంగానికి కట్టుబడి ఉన్నాం నిస్వార్థంగా ప్రజలకు సేవ చేసామని చెప్పి అనేక ప్రభుత్వాలు మారాయి కానీ కులాలకు మద్దతు, మతాలకు అతీతంగా ఎదిరిస్తాం.. పక్షపాతం లేకుండా పరిపాలన సాగిస్తామని అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా దోచుకోవడం దాచుకోవడం వైపై ఆలోచన చేస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల కోసం ప్రజల వద్దకు వస్తున్నారే తప్ప అధికారంలోకి రాగానే ప్రజలను పట్టించుకునే దుస్థితి లేదన్నారు. నరేంద్ర మోడీ ఏం చెప్పారంటే గతంలో పరిపాలన బాగాలేదని దేశాన్ని నాశనం చేశారని నేను పేద కుటుంబం నుంచి వచ్చిన వాడినని బీసిఓ బీసి వర్గానికి చెందిన చాయ్ వాలాను, నల్ల డబ్బులు వెలుగులోకి తెస్తానని ఇక్కడ దోచుకున్నది విదేశాలలో దాచిపెట్టారని డెబ్బై రెండు లక్షల కోట్లు నల్లధనం ఉందని ప్రతి కుటుంబానికి 15లక్షల రూపాయలను పంచవచ్చుని చెప్పి ప్రజలను మోసం చేశాడని వివరించారు. పెట్రోల్ డీజిల్ తో పాటు నిత్యావసర ధరలు పెరగడంతో సామాన్యులపై పెను భారం పడుతుందని రానున్న కాలంలో ప్రజలు చైతన్య పరిచేందుకే సిపిఐ పార్టీ మండల కేంద్రాలలో ప్రజలను చైతన్య పరిచేందుకే జనసేన యాత్ర ప్రారంభించి పర్యటిస్తున్నట్లు తెలిపారు. మే 1 నుండి గ్రామ గ్రామాన పర్యటించి ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. తెలంగాణ ప్రాంతంలో కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో హామీలు మాటలకు పరిమితమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాజన్న సిరిసిల్ల జిల్లా సెక్రెటరీ గుంటి వేణు, కరీంనగర్ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, సిద్ధిపేట జిల్లా కార్యదర్శి పవన్‌లతోపాటు గంభీరావుపేట మండల నాయకులు పలువురు నేతలు పాల్గొన్నారు.

మార్క్సిస్టు మహోపాధ్యాయుడిగా లెనిన్

సీపీఐ(యంయల్) ప్రజాపంథా కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్



నవతెలంగాణ - గోదావరిఖని:

రష్యన్ బోల్షివిక్ నిర్మాతగా, రష్యా అక్టోబర్ విప్లవ సారథిగా, మార్క్సిజాన్ని సామ్రాజ్యవాద యుగానికి వర్తింపచేసిన మార్క్సిస్టు మహోపాధ్యాయుడు లెనిన్ అని సీపీఐ (యంయల్) ప్రజాపంథా కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ అన్నారు. ప్రజాపంథా ఆధ్వర్యంలో లెనిన్ 153వ జయంతి వేడుకలను ఎన్టీపీసీ వద్ద శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లెనిన్ చిత్ర పటానికి వారు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ కార్మిక వర్గ ఉద్యమానికి, కమ్యూనిస్టు విప్లవోద్యమానికి సైద్ధాంతిక భూమికను జోడించిన మహనీయుడు, సిద్ధాంతవేత్త, విప్లవనేత లెనిన్ అని అన్నారు. పార్లమెంటరీ పంథాను తిరస్కరించి విప్లవోద్యమ నిర్మాణం జరిగినప్పుడే దోపిడీ పీడన లేని సమాజం సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాపంథా పెద్దపల్లి డివిజన్ కార్యదర్శి తోకల రమేష్, జిల్లా నాయకులు గుమ్మడి వెంకన్న, అడేపు శంకర్, కోడిపుంజుల లక్ష్మి, గొల్లపల్లి చంద్రయ్య, మార్త రాములు, కట్ట తేజేశ్వర్, తీగుట్ల రాములు, తూళ్ళ శంకర్, మార్త రాధ, కొట్టే స్వరూప, కలవల రాయమల్లు, ఏ.సారయ్య, పి.రాజేందర్, గుండ్ల పోశం, గొట్టే లక్ష్మీనారాయణ, ఓ సబిత, జి.సమ్మక్క తదితరులున్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నవతెలంగాణ-కొత్తపల్లి: కొత్తపల్లి మున్సిపల్ పట్టణంలో స్థానిక 11వ వార్డు కౌన్సిలర్ చింతల సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో నవయుగ యూత్ అసోసియేషన్ వారి సహకారంతో నవయుగ యూత్ కప్ టెన్నిస్ బాల్ ఇన్విటేషన్ క్రికెట్ టోర్నమెంట్‌ను మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు ప్రారంభించారు. ఈ టోర్నమెంట్లో మొత్తం 40 జట్లు పాల్గొంటున్నాయి. మొదటి బహుమతి రూ.30 వేలు, రెండవ బహుమతి రూ.15 వేలతో పాటు ట్రోఫీలను బహూకరిస్తారు. స్థానిక కౌన్సిలర్ చింతల సత్యనారాయణ రెడ్డి నవయుగ అసోసియేషన్ సభ్యులకు జెర్సీలు ఇచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు మాట్లాడుతూ ఆటల్లో గెలుపోటములు సహజమని, ప్రతి క్రీడాకారుడు పట్టుదలతో ఆడి విజయం సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గందు రాంబాబు, జేరిపోతుల మొండయ్య, మానుపాటి వేణుగోపాల్, నవయుగ యూత్ ఆర్గనైజర్స్ ప్రేమ్ కుమార్, జనార్ధన్, ప్రవీణ్, వినోద్, సురేష్, శ్రవణ్, రాహుల్, నందు, యూత్ సభ్యులు, క్రీడాకారులు, పాల్గొన్నారు.

మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట

రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి

నవతెలంగాణ - గోదావరిఖని: రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, ముస్లింలకు భద్రత, సంక్షేమం కల్పిస్తుందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శనివారం రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని గోదావరిఖని శారదా నగర్, ఫోర్ ఇంక్లయిన్ ఈద్గాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్ధనల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, ముస్లిం సోదరులతో కలిసి ప్రార్ధనల్లో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ సిఎం కెసిఆర్ ముస్లిం మైనార్టీలకు అండగా ఉంటూ నిరంతరం వారి సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు రఫిక్, నాయకులు జాహెద్ పాషా, మీర్ ఫయాజ్ అలీ, ఖాజామియా, ప్యారేమియా, హకీం, సిరాజ్జుదిన్, జాహెద్ బేగ్, వాహేద్ భేగ్, మున్వర్, హాఫిజుద్దీన్, షరీఫ్, సర్వర్, ఉమర్, ఫరీద్, గఫూర్, అలీ, రబ్బానీ, హమీద్, రియాజ్ భేగ్, జానీ, మునీర్, తాజుద్దీన్, గౌస్ తాజ్, అడప శ్రీనివాస్, వేముల శంకర్, దొమ్మేటి వాసు, కొర్రి ఓదెలు తదితరులున్నారు. తెలంగాణ రాష్ట్ర, రామగుండం నియోజక వర్గ ముస్లిం సోదరులకు తెలంగాణ లేబర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, రామగుండం అభ్యర్థి గొర్రె రమేష్ రంజాన్ పర్వదిన శుభాకాంక్షలను తెలిపారు. ముస్లింలతోపాటు హిందువులు అన్ని మతాల ప్రజలు కూడా రంజాన్ వేడుకలలో పాల్గొనాలని, తద్వారా భారతీయ మత సామరస్యాన్ని చాటి చెప్పాలని కోరారు. రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన వైఎస్సార్ టిపి రామగుండం ఇన్‌ఛార్జి రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని వైఎస్సాఆర్ టిపి రామగుండం నియోజక వర్గ ఇన్‌ఛార్జి జమ్మిబాబు ముస్లీం సోదరులను గోదావరిఖనిలోని వివిధ ఈద్గాలలో శనివారం కలిసి వారిని ఆత్మీయంగా పలకరించారు. ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.





ధాన్యం కొనుగోళ్లలో రైతులను ఇబ్బంది పెట్టొద్దు

ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



నవతెలంగాణ-గంగాధర: రైతులు ఇబ్బంది పడకుండా అధికారులు వరిధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని ఎమ్మెల్యే సుంకె సుంకె రవిశంకర్ సూచించారు. గంగాధర మండలంలోని పలు గ్రామాల్లో ఐకేపీ, ఫ్యాక్స్ వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం జలాలతో వరి సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. చొప్పదండి నియోజకవర్గం మెట్ట ప్రాంతంలో తాగడానికి నీళ్లు లేని పరిస్థితి ఉండేదని, అటువంటి గడ్డు పరిస్థితుల నుండి విరివిగా వరి సాగు చేసే స్థితికి చేరిందని అన్నారు. గల్ఫ్ దేశాలకు వెళ్లిన వలస జీవులు స్వగ్రామాలకు చేరి వరి సాగు చేసుకోవడం సంతోషకరంగా ఉందన్నారు. కాళేశ్వరం నీళ్లతో చొప్పదండి నియోజక వర్గం సస్యశ్యామలంగా మారిందన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని, ధాన్యం కొనుగోలు పూర్తయ్యే వరకు సెంటర్లు కొనసాగుతాయని అన్నారు. మండలంలోని లింగంపల్లి, కొండాయపల్లి, ర్యాలపల్లి, చెర్లపల్లి (ఎన్), చెర్లపల్లి (ఆర్), గోపాల్‌రావు పల్లి, కాసారం, మల్లాపూర్ గ్రామాల్లో ప్రారంభించిన వరి ధాన్యం కొనుగోలు సెంటర్ల ప్రారంభోత్సవాల్లో ఆయా గ్రామాల సర్పంచులు లక్ష్మీనారాయణ, శంకరయ్య వేముల దామోధర్, కనకయ్య, సింగిల్ విండో చైర్మన్ దూలం బాలగౌడ్, వెలిచాల తిర్మల్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీని సన్మానించిన కలెక్టర్ దంపతులు

నవతెలంగాణ-తిమ్మాపూర్: నానాజీ దేశ్‌ముఖ్ సర్వోత్తమ్ పంచాయతీ సతాత్ వికాస్ పురస్కార్ అవార్డును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర మంత్రి చేతుల మీదుగా అందుకొని, న్యూ ఢిల్లీ పర్యటన ముగించుకొని వచ్చిన ఎంపీపీ కేతిరెడ్డి వనితా దేవేందర్ రెడ్డిని జిల్లా కలెక్టర్ ఆర్వీ.కర్ణన్, జిల్లా పరిషత్ సీఈవో ప్రియాంక దంపతులు కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో శనివారం శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్ రెడ్డి, ఎంపీవో కిరణ్ కుమార్ ఉన్నారు.

రేవంత్ రెడ్డిపై బురద జల్లుతున్న ఈటల

ప్రతిదీ రాజకీయం చేస్తున్న ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి

ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బలుమూరు వెంకట్

నవతెలంగాణ-హుజురాబాద్: ప్రజలకు ప్రభుత్వం నుంచి హక్కుగా ఇవ్వాల్సిన కళ్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి రాజకీయం చేసి లబ్ధి పొందాలని చూస్తున్నాడని, ప్రజలకు ఉపయోగపడే పనులు చేసి మెప్పు పొందాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్ బలుమూరు వెంకట నరసింగ రావు అన్నారు. శనివారం హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న సంక్షేమ పథకాలను అధికారులు లబ్దిదారులకు అందిస్తారని కానీ ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి మాత్రం తన పబ్లిసిటీ కోసం చెక్కులను ఇస్తూ ప్రచారం చేసుకుంటు న్నారని అన్నారు. హుజరాబాద్ నియోజకవర్గంలో ఇసుక మాఫియాకు కౌశిక్ రెడ్డి ఎందుకు అడ్డుకట్ట వేయలేకపోతున్నాడని ప్రశ్నించారు. తన ఉనికిని కాపాడుకోవడానికి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పై ఎమ్మెల్యే ఈటల రాజేందర్ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రెండు ఒకటేనని అన్నారు. ఈ సమావేశంలో డీసీసీ అధికార ప్రతినిధి సొల్లు బాబు, మండల అధ్యక్షుడు కిరణ్ పాల్గొన్నారు.

నూతన ప్రజాసామిక విప్లవ సాధన కోసం పోరాడుదాం..

సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి కె.రాజన్న



మాట్లాడుతున్న సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి కె.రాజన్న

నవతెలంగాణ - గోదావరిఖని:

అమరులు అందించిన పోరాట పంథాలో నూతన ప్రజాసామిక విప్లవ సాధన కోసం పోరాడుదామని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి కె.రాజన్న పిలుపునిచ్చారు. సిపిఐఎంఎల్ పార్టీ ఆవిర్భావ దినం, ప్రపంచ పీడిత ప్రజల విముక్తి పోరాట యోధుడు లెనిన్ 153వ జయంతి వేడుకలను గోదావరిఖని ఐఎఫ్‌టియు కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లెనిన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ముందుగా పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దోపిడీ వ్యవస్థను నిర్మూలించి దాని స్థానంలో, నూతన ప్రజాస్వామిక విప్లవంను సాధించకుండా ప్రజలకు భూమి, బుక్తి, విముక్తి అనేది సాధ్యం కానేకాదని చెప్పి, ప్రజల విముక్తి కోసం వీరోచితంగా పోరాడి అసువులు బాసిన అమర వీర యోధుడు లెనిన్ అని అన్నారు. కార్యక్రమానికి సీపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఈ నరేష్ అధ్యక్షత వహించగా పార్టీ జిల్లా నాయకులు చిలుక శంకర్, పార్టీ, ప్రజా సంఘాల నాయకులు ఎం.దుర్గయ్య, కె.మొగిలి, బి.బుచ్చయ్య, వి.సదానందం, కె.లింగమూర్తి, మహేందర్, బొట్టు రవి కుమార్, మంగ, రజిత, మొండన్న, సుధాకర్, సాంబయ్య నర్సయ్య, గుండు రాజయ్య, ఆర్.రాయమల్లు,బాలకష్ణ, మధుకర్, అన్వేష్, శ్రావన్ తదితరులున్నారు.

డయాలసిస్ పేషంట్లకు నీడ పెన్షన్ కార్డ్స్ అందజేత

నవతెలంగాణ - గోదావరిఖని:



గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో పని చేస్తున్న ఎండి.దస్తగిరి రెండు కిడ్నీలు చెడిపోయి డయాలసిస్ మీద జీవిస్తుండగా, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పూదరి కుమార్ గౌడ్ చేతుల మీదగా నీడ ఆరోగ్యమస్తు పెన్షన్ కార్డు, ఏప్రిల్ పెన్షన్ 521 రూపాయలను నీడ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు పల్లెర్ల రమేష్ గౌడ్ అందజేశారు. అదేవిధంగా కాకతీయ నగర్ కు చెందిన ఎండి ఫాతిమా బేగంకు కార్మిక నాయకులు, బిఆర్ఎస్ నాయకులు పాతిపెల్లి ఎల్లయ్య చేతుల మీదగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏదైనా సంస్థ అంటే ఒక్కరికి ఒక్కసారి సహాయం చేస్తుందని, కానీ ప్రతి నెల ఇలా సహాయం చేయడం అంటే ఒక ప్రభుత్వం తప్ప ఎవరు చేయలేరని, కానీ నీడ సంస్థ ఇలాంటి సహాయం చేయడం గొప్ప సాహసమని కొనియాడారు. ఈ సందర్భంగా నీడకు తోడు ఉన్న దాతలను అభినందించారు.

హిమాన్స్, కామాక్షి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ - సిరిసిల్ల : సిరిసిల్ల పట్టణంలోని హాస్పిటల్స్ ఏరియాలో కామాక్షి, హిమాన్స్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ బాటసారుల దాహార్తి తీర్చేందుకు హాస్పిటల్స్ యాజమాన్యం ముందుకు వచ్చి సేవాభావంతో చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. సిరిసిల్ల పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని కూడలిలలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు సురేంద్రబాబు, అగ్గిరాములు, సిబ్బంది పాల్గొన్నారు.


చలివేంద్రం ప్రారంభిస్తున్న సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

దుద్దిళ్ల పాలనలో నామ్‌కే వాస్తే నామినేటెడ్ పోస్టులు
పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

నవతెలంగాణ - మంథని

దుద్దిళ్ల కుటుంబపాలనలో నామ్‌కే వాస్తే నామినేటెడ్ పోస్టులు ఇచ్చారే కానీ ఏనాడు ఆ పోస్టులకు గౌరవం దక్కేలా చేయలేదని పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ ఆరోపించారు. మంథని మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసిన అనంతరం 1994లో మార్కెట్ కమిటీ భవన సముదాయ శంకుస్థాపన సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకంలో అప్పటి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఉన్న గొబ్బూరి సత్యంరాజుకు జరిగిన అవమానంపై ఆయన వివరించారు. మంథని ఎమ్మెల్యేగా శ్రీపాదరావు ఉన్న సమయంలో ఏఎంసీ భవన సముదాయానికి శంకుస్థాపన కోసం శిలాఫలకం ఏర్పాటు చేస్తే అందులో ఏఎంసీ చైర్మన్ పేరు పెట్టకపోవడం దుదిళ్ల కుటుంబపాలనకు నిలువెత్తు నిదర్శనమన్నారు. ఆనాడు శ్రీపాదరావు పాలన నుంచే బీసీవర్గాలను అవమానించడం ఆరంభమై ఈనాటికి కొనసాగుతోందన్నారు. బీసీలకు పదవులిచ్చి గౌరవించాలని ఏనాడు ఆ కుటుంబం ఆలోచన చేయలేదన్నారు. ప్రోటోకాల్ ప్రకారం పదవులు ఉన్నవారి పేర్లు శిలాఫలకాల్లో పెట్టాల్సి ఉన్నా ఆ దిశగా ఏనాడు ఆలోచన చేయని వాళ్లు ఈనాడు ప్రోటోకాల్ అంటూ రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. ఏఎంసీ చైర్మన్‌గా పని చేసిన గొబ్బూరి సత్యంరాజుకు గౌరవం లభించాలని తామే ఇటీవల శిలాఫలకంపై పేరు పెట్టించి గౌరవించుకున్నామని ఆయన గుర్తు చేశారు.


గత శిలాఫలకాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్

'ఆత్మీయ సమ్మేళనం కాదు ఆత్మవిమర్శ సభలు పెట్టండి'


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ - రుద్రంగి

ఆత్మీయ సమ్మేళనలు కాదు ఆత్మవిమర్శ సభలు పెట్టుకోండని రాజన్న సిరిసిల్ల జిల్లా డీసీసీ కార్యదర్శి చెలుకల తిరుపతి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఇందిరచౌక్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ.. ఆత్మీయ సమ్మేళనాలు కాదు.. ప్రజలకు అభివృద్ధి కావాలని అన్నారు. అన్ని మండలాల్లో జరిగిన అభివృద్ధే రుద్రంగిలో జరిగిందని.. దత్తత గ్రామంలో ఎమ్మెల్యే ప్రత్యేకంగా చేసిందేమీ లేదని అన్నారు. గుంతల రోడ్డుతో ప్రజలు ఇబ్బంది పడుతున్నా ఎమ్మెల్యే చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. పింఛన్లు, రేషన్ కార్డుల లేక ఎంతోమంది ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కలికోట సూరమ్మ చెరువులో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పటి వరకు అందలేదని విమర్శించారు. డబుల్ బెడ్‌రూం ఇండ్ల జాడే లేదని, 30పడకల ఆసుపత్రి, సైడ్ డ్రైనేజీలు లేవని మరి ఎమ్మెల్యే ఎక్కడ అభివృద్ధి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, నాయకులు సామ మోహన్‌రెడ్డి, ఎర్రం గంగానర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, తర్రే లింగం, పల్లి గంగాధర్, గండి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ టాయిలెట్స్ పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

నవతెలంగాణ - సుల్తానాబాద్



పట్టణంలోని శాస్త్రినగర్, సుగుంపల్లి, అంబేద్కర్ చౌరస్తా వద్ద పబ్లిక్ టాయిలెట్స్‌ను మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ శనివారం పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పబ్లిక్ టాయిలెట్స్‌ని పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. వాటి పరిసర ప్రాంతాల్లో చెత్తను ఇష్టానుసారంగా పారవేయకుండా శుభ్రంగా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జాతీయ మాల మహానాడులో మంథని నాయకులు

నవతెలంగాణ - మంథని : మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మంథని జాతీయ మాల మహానాడు ఐక్యవేదికకు చెందిన నాయకులకు జాతీయ మాల మహానాడులో చోటు లభించింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మంథనికి చెందిన సీనియర్ నాయకుడు నూకల బానయ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, సూరయ్యపల్లి గ్రామానికి చెందిన అప్పాల పోచమల్లయ్య జిల్లా ఉపాధ్యక్షుడిగా, మంథని మండలం గంగాపురి గ్రామానికి చెందిన ఎరుకల శేఖర్ జై భీమ్ సైనిక్ దళ్ మండల కన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం జాతీయ మాల మహానాడు కమ్యూనిటీ భవనంలో వారిని మంథని జాతీయ మాల మహానాడు సంఘం నాయకులు, సభ్యులు, తదితరులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ - కొనరావుపేట : మండల కేంద్రంలో ఐకెపి ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వేములవాడ ఎమ్మెల్యే చేన్నమనేని రమేష్‌బాబు ప్రారంభించారు. అనంతరం బోలె శ్రీనివాస్ ఇటీవల గల్ఫ్ దేశంలో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. దళిత బంధు తప్పకుండా ఇస్తామని వారికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గోపు పరుశురాములు, ఎంపీటీసీ నరసింహచారి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య, అబ్బసాని శంకర్‌గౌడ్, ఉపసర్పంచ్ దండు శ్రీనివాస్, గొట్టే లక్ష్మణ్ పాల్గొన్నారు.

నవతెలంగాణ - బోయినిపల్లి : మండలంలోని బోయినిపల్లి, కొదురుపాక, అనంతపల్లి గ్రామాలలో వడ్ల కొనుగోలు కేంద్రాలను చొప్పదండి ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్లాపల్లి వేణుగోపాల్, జెడ్పీటీసీ ఉమకొండయ్య, మార్కెట్ కమిటీ చైర్మెన్ సత్యనారాయణ, వైస్ ఎంపీపీ నాగయ్య, మాజీ జెడ్పీటీసీ లచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


బోయినిపల్లి : ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

నవతెలంగాణ - చందుర్తి : మండల కేంద్రంతోపాటు మాల్యాల గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వేములవాడ ఎమ్మెల్యే రమేష్‌బాబు ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - వేములవాడ : నాంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(ప్యాక్స్) ఆధ్వర్యంలో అనుపురం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ బూర వజ్రమ్మబాబు, జెడ్పీటీసీ మ్యాకల రవి, స్థానిక సర్పంచ్ వెంకటరమణారావు, ప్యాక్స్ చైర్మన్ సల్మాన్‌రెడ్డి, వైస్ చైర్మన్ శీలం రామచంద్రారెడ్డి, సొసైటీ డైరెక్టర్లు, నాయకులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - మంథని : మంథని మున్సిపల్ పరిధిలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ,సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. అలాగే పలు గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, కమిటీ డైరెక్టర్లు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కొండ శంకర్, సంఘ ఉపాధ్యక్షుడు బెల్లంకొండ ప్రకాష్‌రెడ్డి, డైరెక్టర్‌లు దేవళ్ల విజయ్ కుమార్, దాసరి లక్ష్మీమొండయ్య, రావికంటి సతీష్ కుమార్, ఉడుత మాధవిపర్వతాల్ యాదవ్, మాచీడి రాజుగౌడ్, లెక్కల కిషన్‌రెడ్డి, కొత్త శ్రీనివాస్, ఏఎంసి చైర్మన్ ఎక్కటి అనంతరెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

మోడీ ప్రభుత్వం మళ్లీ వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేయవచ్చు
సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

నవతెలంగాణ - ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట


ముస్తాబాద్‌లో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

మోడీ ప్రభుత్వం 2024లో మళ్లీ వస్తే రాజ్యాంగాన్ని కూడా రద్దు చేసినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. పల్లె పల్లెకు సీపీఐ.. ప్రజల వద్దకు సీపీఐ ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేటలో ఆయన మాట్లాడారు. మోడీ ప్రభుత్వం మళ్లీ వస్తే అందరి ఓటు హక్కు హరించే అవకాశం ఉందన్నారు. ఏ కులమైనా ఏ మతమైనా అందరం మనుషులమే అని చెప్పేదే భారతీయ రీజన్ కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతము అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలోనే పేద ప్రజలకు పన్నులు విధిస్తూ కార్పొరేట్ సంస్థలకు వరాలు కురిపిస్తుందని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుంన్నారు. దేశ సంపద ఆదాని, అంబానీ చేతుల్లోకి వెళ్లిందని ఆరోపించారు. పెరిగే ధరలతో సామాన్యుడికి గుదిబండలా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాల గొంతు నొక్కుతోందన్నారు. పౌర హక్కులను కాలరాస్తుందని.. దేశంలో తొమ్మిది రాష్ట్ర ప్రభుత్వాలను కూలగొట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగం అమలుపరచకుంటే సీపీఐ మరో ఉద్యమం చేస్తుందన్నారు. బిజెపికి హటావో దేశ్ కి బచావో అనే నినాదంతో గడప గడపకు సీపీఐ యాత్రను ప్రారంభించిందని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, రేషన్ కార్డులు, ఆసరా పింఛన్లు నిరుద్యోగ భృతి, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, ధరణి పోర్టల్ సమస్యలను సవరించాలని డిమాండ్ చేశారు. సాయుధ పోరాట యోధుడు బద్దం ఎల్లారెడ్డి వారసులం అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీఐ కరీంనగర్, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, మంద పవన్, గుంటి వేణు, తాంద్ర సదానందం, వెన్న సురేష్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, మహిళా సమైక్య నాయకురాలు గూడెం లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు

బీజేపీ అధికారంలోకి రాకుండా అడ్డుకుంటాం
సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

నవతెలంగాణ - సిరిసిల్ల : తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వంలోకి రాకుండా అడ్డుకుంటామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ధ్వంసం చేస్తున్నారని దీనిని ప్రజలంతా ప్రత్యక్షంగా చేస్తున్నారని అన్నారు. బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు గడప గడపకు బీజేపీ హటావో నినాదంతో చైతన్య యాత్ర చేపట్టి నట్టు చెప్పారు. మోడీ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను, అవినీతిని ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలనూ గొంతు నొక్కేందుకు కుట్ర చేస్తూ అక్రమ కేసులు పెట్టి జైల్లో వేయడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. కార్పొరేట్ కంపెనీలకు బీజేపీ ప్రభుత్వం కొమ్ముకాస్తోందని జీఎస్టీ పేరుతో ప్రజలను ముంచుతున్నారని విమర్శించారు. ప్రజా పోరాటాలతోనే హక్కులను సాధిస్తామని.. రానున్న రోజుల్లో ప్రజాసమస్యలపై ప్రత్యేక దృష్టిసారించి పోరాడుతామని తెలిపారు. రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలు పలు ప్రాంతాల్లో గత వైభవం తీసుకొస్తామని అన్నారు. గతంలో సిరిసిల్ల కమ్యూనిస్టులకు కంచుకోటగా ఉండేదని అనేకసార్లు కమ్యూనిస్టు పార్టీ నుండి ఎమ్మెల్యేలు గెలిచిన చరిత్ర సిరిసిల్లకు ఉందన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర నాయకుడు మర్రి వెంకటస్వామి, జిల్లా కార్యదర్శి గుంటి వేణు, సామల మల్లేశం, తదితరులు పాల్గొన్నారు

రూ.9కోట్లతో తంగళ్ళపల్లి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి

- మన ఊరి - మనబడిలో నిధులు మంజూరు
- కేజీ టు పీజీ ఏర్పాటుకు ప్రణాళిక
- పనులు ప్రారంభించిన ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ - తంగళ్ళపల్లి

తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలకు మహర్దశ రానుంది. కేజీ టు పీజీ ఏర్పాటు చేస్తూ అభివృద్ధి చేసేందుకు రూ.9కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు శనివారం జెడ్పీటీసీ పూర్మాని మంజుల, ఎంపీపీ పడిగెల మానస, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. మన ఊరు - మన బడి ద్వారా విద్యా వ్యవస్థలను బలోపేతం చేస్తున్నారని తెలిపారు. సిరిసిల్ల జిల్లాపై ప్రత్యేక చొరవ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవ చూపుతున్నారని ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అంకారపు అనిత, ఎంపీటీసీ కోడి అంతయ్య, ఉప సర్పంచ్ పెద్దూరి తిరుపతి, డీఈవో రమేష్ కుమార్, ఎంఈవో దూస రఘుపతి, సింగిల్విండో చైర్మన్ బండి దేవదాస్, కోడూరి భాస్కర్‌గౌడ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు వలకొండ వేణుగోపాలరావు, సర్పంచులు జక్కుల రవీందర్, ముదారి పోచయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజబీంకార్ రాజన్న, కందుకూరి రామాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

ఘనంగా రంజాన్ పర్వదిన వేడుకలు


మంథని : శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్

నవతెలంగాణ - మంథని

మత సామరస్యానికి ప్రతీకగా రంజాన్ నిలుస్తుందని పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని మంథని మున్సిపల్ పరిధిలోని కూచిరాజుపల్లి ఈద్గా వద్ద ముస్లిం సోదరుల ప్రార్థనల అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, స్థానిక నాయకులతో కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ కొండ శంకర్, జెడ్పిటిసి తగరం సుమలత, సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు శంకర్‌లాల్, శంకర్‌గౌడ్, నక్క శంకర్, గుండా పాపారావు, కాయితీ సమ్మయ్య, బెల్లంకొండ ప్రకాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - ముస్తాబాద్

మండలంలో రంజాన్ పండుగను ముస్లిములు ఘనంగా నిర్వహించుకున్నారు. సామూహిక ప్రార్థనలు చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సర్వర్ పాషా పాయసం విందు ఇచ్చారు. మండల ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


వేములవాడలో..

నవతెలంగాణ - వేములవాడ

రంజాన్ పండుగ వేడుకలను వేములవాడలో ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించుకున్నారు. బైపాస్ రోడ్డు ఆనుకొని ఉన్న ఈద్గా వద్ద వేలాది సంఖ్యలో ఈదుల్ ఫితర్ నమాజ్‌లో పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. జామా మసీదు ఇమామ్ ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ గావించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, పాలకమండలి సభ్యులు, కమిషనర్ అన్వేష్, ఇతర ప్రజాప్రతినిధులు ఈద్గా వద్దకు చేరుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పీర్ మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

ఈద్గా వద్ద చేసిన ఏర్పాట్లు చాలా బాగా చేశారని ముస్లిం కమిటీ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ అక్రం అలీ హర్షం వ్యక్తం చేశాడు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కమిషనర్ అన్వేష్, పాలకమండలి సభ్యులకు, సిబ్బందికి, భారీ బందోబస్తు నిర్వహించిన డీఎస్‌పి నాగేంద్రచారి, పట్టణ సీఐ వెంకటేశ్, సిబ్బందితో పాటు వేడుకలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపాడు.


ఇల్లంతకుంట మండలంలో..

నవతెలంగాణ - ఇల్లంతకుంట

మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో రంజాన్ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. సామూహిక ప్రార్థనలు చేసి, అనంతరం ఒకరినొకరు ఆలింగన చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

నవతెలంగాణ - ఓదెల

ఓదెల మండలంలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులు మసీద్‌లలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య యాదవ్, నాయకులు, ప్రజాప్రతినిధులు ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపి అలైబలై తీసుకున్నారు.


ఓదెల మండలంలో..

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

నవతెలంగాణ - ఇల్లంతకుంట : మండలంలోని వంతడుపుల గ్రామానికి చెందిన యామ రాజుకు మంజూరైన రూ.28వేల ముఖ్యమంత్రి సాయ నిధి చెక్కును వైస్ ఎంపీపీ సుదగోని శ్రీనాథ్‌గౌడ్, సర్పంచ్ కట్ట వెంకట్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బోయిని పద్మపర్శరాములు, వార్డు సభ్యులు అన్నాడి నవీన్‌రెడ్డి, దురుముట్ల శ్రీనివాస్, లచ్చయ్య పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

నవతెలంగాణ - మంథని : మంథని మండలం లక్కేపూర్ గ్రామానికి చెందిన షేబీన, అమీనా, పాతిమా, అస్మా రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వారిని శనివారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, కాటారం సింగిల్‌విండో చైర్మన్ చల్లా నారాయణరెడ్డి పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు.


బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న చల్ల నారాయణరెడ్డి

ఆత్మీయ సమ్మేళనంలో దళిత నాయకుడికి అవమానం
బీఆర్ఎస్ మండల అధ్యక్షుడి ఆవేదన

నవతెలంగాణ - జూలపల్లి


గోడు వెల్లబోస్తున్న నాయకుడు

జూలపల్లి మండలం కుమ్మరికుంట గ్రామంలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో దళితుడినైన తనకు అవమానం జరిగిందని పార్టీ మండల అధ్యక్షుడు శాతాల కాంతయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంతయ్య మాట్లాడుతూ దళిత నాయకుడు అని గత కొన్ని రోజులుగా అగ్రవర్ణాల నాయకులు కావాలని కుట్రపూరితంగా తనను అవమానిస్తున్నారని, ఈ రోజు తన సొంత గ్రామంలో జరిగే కార్యక్రమానికి ఆహ్వానం లేదని, అలాగే మండల అధ్యక్షుడిని అయినా తన ఫొటో ఫ్లెక్సీలో లేకపోవడం చాలా బాధాకరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక దళిత నాయకుడిని కాబట్టే నాకు ఆహ్వానం లేదా అని ప్రశ్నించారు. తాను పార్టీపై అభిమానంతో ఇన్ని సంవత్సరాలుగా పని చేస్తున్న అని, కేసిఆర్ సేవా దళంలో పని చేయడం తప్పు అయినట్టు ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి తనను పార్టీకి దూరం పెడుతున్నారని ఆరోపించారు. కొందరు కార్యకర్తల లాగా తాను కమీషన్ తీసుకొని సంక్షేమ పథకాలు వారికి అందేలా చేయడం లేదని, పార్టీ టికెట్ ఒకరికి ఇస్తే తాను వేరే వాళ్ళకి సపోర్ట్ చేయలేదు అని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు దళితుల జీవితాలలో వెలుగులు నింపేందుకు ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొని వస్తున్నారని, కానీ దానిని కాలరాసే విధంగా నియోజకవర్గంలో దొరల పాలన నడుస్తున్నదని తన గోడును వెళ్లిబుచ్చారు.

వ్యవసాయ కళాశాల విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ - ఇల్లంతకుంట



మండలంలోని వల్లంపట్లలో విద్యార్థులు శనివారం తమ ప్రతిభను కనబరిచారు. పొలాస వ్యవసాయ కళాశాలలో నాల్గవ సంవత్సరం విద్య నభ్యసిస్తున్న విద్యార్థులు తమ క్షేత్ర స్థాయి కార్యక్రమంలో భాగంగా రైతు వేదికలో గ్రామ పటం వేసి గ్రామస్తులను అబ్బురపరిచారు. గ్రామ, పంట సమస్యలు మ్యాట్రిక్స్ ర్యాంకింగ్ విధానాల గూర్చి పటంలో పొందుపరిచి రైతులకు వివరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అనసూర్యనర్సింహారెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, ఏఈవో అర్చన, విద్యార్థులు సాయి, పూర్ణశ్రీ, రాషద, రేణుక, సాయిప్రియ, రైతులు శ్రీకాంత్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాజిరెడ్డి, రమేశ్, సత్యం, భాస్కర్ పాల్గొన్నారు.

ప్రొసీడింగ్ కాపీలు అందజేత

నవతెలంగాణ - వేములవాడ



వేములవాడ పట్టణానికి చెందిన ముదిరాజ్, మ్యాదర, నాయీ బ్రాహ్మణ కుల సంఘ భవనాల నిర్మాణాలకు సంబంధించిన నిధుల మంజూరు ప్రొసీడింగ్ కాపీలను శనివారం ఎమ్మెల్యే రమేష్‌బాబు చేతులమీదుగా ఆయా కుల సంఘాల నాయకులకు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని అన్ని కుల సంఘాల భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తామని, తాము కోరిన వెంటనే ముఖ్యమంత్రి కేసీఆర్ రూ. 10కోట్ల మంజూరు చేశారని ధన్యవాదాలు తెలిపాడు. వచ్చే వంద రోజుల్లో 1200 మందికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని, బద్ది పోచమ్మ దేవాలయంలో రూ.10 కోట్లతో బోనాల మండపం, గుడి చెరువు సుందరీకరణ కొరకు రూ.12కోట్లు కేటాయించామని, త్వరలోనే పట్టణంలో రోడ్ల వెడల్పు జరగనున్నదని, అభివృద్ధిలో భాగస్వాములు అవుతున్న సహకరిస్తున్న పట్టణ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ నామాల ఉమ, కౌన్సిలర్లు యాచమనేని శ్రీనివాసరావు, సిరిగిరి చందు, అజయ్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పుల్కం రాజు, తదితరులు పాల్గొన్నారు.

మూడు అలయన్స్ క్లబ్‌ల ప్రమాణస్వీకారం

నవతెలంగాణ - ధర్మారం : మండల కేంద్రంలోని బ్రిలియంట్ మోడల్ స్కూల్ ఆవరణలో అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో జాయింట్ ట్రెజరర్ ఆఫ్ సౌత్ మల్టిపుల్ కౌన్సిల్ అండ్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన సిరిపురం సత్యనారాయణ శుక్రవారం రాత్రి ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అలియన్స్ క్లబ్ ధర్మారం, అచీవర్స్ ధర్మారం, రాజారాంపల్లి క్లబ్‌ల పాలకవర్గాలను ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్, వాసుదేవ హాస్పిటల్ ఎండీ డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, డాక్టర్ గాలిపెల్లి నాగేశ్వర్‌రావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అలయన్స్ క్లబ్ ప్రెసిడెంట్‌లు కొత్త మోహన్, కోరుకంటి స్వామి, గెల్లు చంద్రశేఖర్, సెక్రటరీలు మామిడిశెట్టి శ్రీనివాస్, ఇరుకుల్లా సంతోష్, బంద్రా గంగాధర్, ట్రెజరర్‌లు ఎలిగేటి మహేందర్, జైన చంద్రమౌళి, రేణిగుంట సతీష్, పిఆర్వోలు బైరి చంద్రమౌళి, బీరెల్లి రవీందర్ అమ్ముల నరేష్ జోన్ చైర్మన్ తాళ్లపల్లి సురేందర్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్‌గా గడ్డం శ్రీనివాస్, తోడేటి మురళి, తాళ్ల సతీష్, కందుల సతీష్ ప్రమాణ స్వీకారం చేశారు. విడిజి అప్పల శ్రీధర్, కలికోట శ్రీనివాస్, జిల్లా 258 సెక్రటరీ ఇల్లందుల కిషోర్, ట్రెజరర్ కాచం సతీష్, రీజినల్ చైర్మన్ శ్రీనివాస్, జోనల్ చైర్మన్ తాళ్లపల్లి సురేందర్‌గౌడ్ పాల్గొన్నారు.



గల్ఫ్ మతుల కుటుంబాలను ఆదుకుంటాం

నవతెలంగాణ - కొనరావుపేట



గల్ఫ్‌లో మృతిచెందిన వారి కుటుంబాలను ఆదుకుంటామని వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్‌బాబు అన్నారు. మండల కేంద్రానికి చెందిన బొల్లె శ్రీనివాస్ ఇటీవల దుబాయిలో మృతిచెందగా ఆయన కుటుంబాన్ని శనివారం ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన మాట్లాడుతు గల్ఫ్‌లో మరణించిన దళిత కుటుంబాలకు దళిత బంధు ఇస్తామని హామీ ఇచ్చారు. అయన వెంట ఎదురుగట్ల చంద్రయ్య, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, సర్పంచ్ రేఖ, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య ఉన్నారు.

ఈదురు గాలులతో రాలిన మామిడి కాయలు

నవతెలంగాణ - చందుర్తి : మండలంలో శనివారం సాయంత్రం వడగండ్ల వాన, ఈదురు గాలులతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. పలు గ్రామాల్లో మామిడి కాయలు రాలాయి. రోడ్లకు ఇరు వైపుల చెట్లు పడి పోవడంతో రాక పోకలకు అంతరాయం కలిగింది. విద్యుత్ స్తంభాలు విరిగి పోయాయి. కిష్టంపేట గ్రామంలో పిడుగు పాటుకు నాగుల రవి అనే రైతు గేదె మృతిచెందింది.

వేములవాడ బార్ అసోసియేషన్ మళ్లీ ఎన్నికలు

నవతెలంగాణ - వేములవాడ : వేములవాడ అడ్వకేట్ అసోసియేషన్‌కు ఈ నెల 28న మళ్లీ ఎన్నికలు నిర్వహించాలంటూ, దీనికి సంబంధించి నలుగురు సభ్యులచే అడ్‌హాక్ కమిటీని నూతనంగా నియమిస్తూ బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. అడ్‌హాక్ కమిటీలో వేములవాడ అడ్వకేట్ అసోసియేషన్ నుండి రేగుల దేవేందర్, రాజశేఖర్‌రెడ్డి, గుమ్మడి శ్రీనివాస్, విద్యాసాగర్‌రావును సభ్యులుగా నియమించారు. ఈ నెల 24 నుండి నామినేషన్ల ప్రక్రియ, 28న ఎన్నికలు, 29న నూతన పాలకవర్గానికి బాధ్యతలు అప్పగింత సజావుగా జరగాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ - ఇల్లంతకుంట : మండలం సోమారంపేట గ్రామానికి చెందిన మహేశ్వరి అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందింది. ఆమె కుటుంబాన్ని శనివారం సిరిసిల్ల జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు పరామర్శించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయనవెంట రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు చెరుకుపెల్లి రాజిరెడ్డి, ప్యాక్స్ చైర్మెన్ రొండ్ల తిరుపతిరెడ్డి, వైస్ చైర్మెన్ గొడుగు తిరుపతి, సర్పంచ్ కాచం శ్రీనివాస్‌రెడ్డి, బోల్గం నర్సయ్య ఉన్నారు.

శ్రీ గౌతమేశ్వర స్వామిని దర్శించుకున్న మెజిస్ట్రేట్ ప్రియాంక

నవతెలంగాణ - మంథని : మంథని గోదావరి నది తీరంలోని శ్రీ గౌతమేశ్వర స్వామి దేవాలయంలో శనివారం మెజిస్ట్రేట్ ప్రియాంక కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగద్గురు శంకరాచార్యుల జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీ గౌతమేశ్వర స్వామితో పాటు తదితర ఆలయాల్లో దర్శించుకున్నారు. అనంతరము ఆలయ కమిటీ చైర్మన్ మేడ గొని రాజమౌళిగౌడ్ ఆమెను ఘనంగా సన్మానించారు.



లక్నో తడబడింది.. గుజరాత్ గెలిచింది

లక్నో : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) సీజన్-16లో భాగంగా శనివారం జరిగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ తడబడింది.. గుజరాత్ టైటాన్స్ గెలిచింది. లక్నో సూపర్ జెయింట్స్ ముందుంచిన స్వల్ప లక్ష్యాన్ని కాపాడుకునే క్రమంలో చివరి ఓవర్లలో చాకచక్యంగా ఆడి గుజరాత్ టైటాన్స్ విజయాన్ని సొంతం చేసుకుంది. 136 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో తడబడిన లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 128 పరుగులు మాత్రమే చేసింది. లక్నో బ్యాటర్లలో కెఎల్ రాహుల్ (68 పరుగులు, 61 బంతుల్లో 8 ఫోర్లు) అర్థ శతకంతో రాణించినా ఫలితం లేకుండాపోయింది. కైల్ మేయర్స్ (24), కృనాల్ పాండ్య (23) మెరుపులు వృథా అయ్యాయి. నికోలస్ పూరన్ (1) విఫలమయ్యాడు. గుజరాత్ బౌలర్లలో నూర్ అహ్మద్, మోహిత్ శర్మ చెరో రెండు, రషీద్ ఖాన్ ఒక వికెట్ పడగొట్టారు.

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న గుజరాత్ టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 135 పరుగులు చేసింది. వృద్ధిమాన్ సాహా (47 పరుగులు, 37 బంతుల్లో 6 ఫోర్లు), హార్దిక్ పాండ్య (66 పరుగులు, 50 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సులు) రాణించారు. మిగతా ఆటగాళ్లు పెద్ద స్కోర్లు చేయలేకపోయారు. శుభ్‌మన్ గిల్ (0), అభినవ్ మనోహర్ (3), విజయ్ శంకర్ (10), మిల్లర్ (6) తక్కువ పరుగులకే పెవిలియన్ చేరారు. లక్నో బౌలర్లలో కృనాల్ పాండ్య, స్టొయినిస్ రెండేసి వికెట్లు పడగొట్టగా.. అమిత్ మిశ్రా, నవీన్ ఉల్ హక్ ఒక్కో వికెట్ తీశారు.

లక్నో తడబడింది.. గుజరాత్ గెలిచింది



ఫ్యాక్టరీల చట్టాన్ని వెనక్కి తీసుకోవాలి

తమిళనాడు ప్రభుత్వ తీరును ఖండించిన సీఐటీయూ

- 'పని గంటల' నిబంధనలు తొలగించడానికేనని ఆరోపణ

చెన్నై : ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో తమిళనాడు అసెంబ్లీ ఆమోదించిన ఫ్యాక్టరీల (తమిళనాడు సవరణ) చట్టం, 2023 ను సీఐటీయూ ఖండించింది. సదరు చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఒక ప్రకటనను విడుదల చేశారు. దీని ప్రకారం.. తమిళనాడు ప్రభుత్వ తీరును సీఐటీయూ ఖండించింది. ఇది కార్మిక వ్యతిరేక, యాజమాన్య అనుకూల చట్టం. ఏదైనా ఫ్యాక్టరీ, గ్రూపు, తరగతులను ఫ్యాక్టరీల చట్టం, 1948లోని పని గంటల నిబంధనల నుంచి మినహాయించే అధికారాన్ని తమిళనాడు ప్రభుత్వానికి కల్పిస్తుంది. తద్వారా ఆ నియంత్రణ నిబంధనలన్నింటిని ఏకపక్షంగా ఉల్లంఘించేలా యజమానికి బహిరంగంగా అధికారం కల్పించి, కార్మికులను అమానవీయ బానిసత్వంలో ఉంచుతుంది.

ఇలాంటి భారీ స్థాయి మినహాయింపు విధానం అనివార్యంగా పని దినంలో పని గంటలను పెంచుతుంది. పని గంటలు, పని దినాలను ఏకపక్షంగా క్రమబద్ధీకరించే విధానం ద్వారా కార్మికుల వేతనాలు, సంపాదనపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. రాష్ట్రంలోని కార్మికులకు ఇది వినాశకరమైనది. ఈ చట్టాన్ని ఎట్టి పరిస్థితుల్లో అమలు చేయడానికి అనుమతించకూడదు. కార్మికులు, సీఐటీయూ అనుబంధ సంస్థలు ఈ చట్టాన్ని ఐక్యంగా వ్యతిరేకించాలి. రాష్ట్రస్థాయిలో, పని ప్రదేశాలలో ఉమ్మడి నిరసన చర్యల ద్వారా దుర్మార్గమైన కార్పొరేటు అనుకూల రూపకల్పనను బహిర్గతం చేయాలనీ,అంతర్జాతీయంగా ప్రశంసలు, గుర్తింపు పొందిన శ్రామికుల 8 గంటల పని విధానాన్ని రక్షించుకోవాలి.

హాస్టళ్లు, స్కూళ్లకు నాణ్యత లేని బియ్యం సరఫరా

- ఎనిమిది మంది పౌరుగుసేవల ఉద్యోగులపై వేటు
- బియ్యం మార్పిడికి మిల్లర్లకు ఆదేశం
- టెక్నికల్ అసిస్టెంట్లతో సివిల్ సప్లైస్ చైర్మెన్ రవీందర్ సింగ్ సమీక్ష

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హాస్టళ్లు, స్కూళ్లకు నాణ్యత లేని బియ్యం సరఫరాపై సర్కారు సీరియస్ అయింది. ఈ మేరకు బాధ్యులుగా గుర్తించిన ఎనిమిది పౌరుగుసేవల సిబ్బందిని తొలగించింది. అదే సమయంలో సరఫరా చేసిన నాణ్యత లేని బియ్యాన్ని వెనక్కి తీసుకుని వాటి స్థానంలో సన్నబియ్యాన్ని 45 రోజుల్లో అందజేయాలని ఆదేశించింది. పలు ఫిర్యాదుల నేపథ్యంలో శనివారం పౌరసరఫరా సంస్థ చైర్మెన్ రవీందర్ సింగ్ 96 మంది టెక్నికల్ అసిస్టెంట్లు, భారత ఆహార సంస్థ రిటైర్డ్ ఉద్యోగులతో సన్నబియ్యంపై హైదరాబాద్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. కొంత మంది అమానవీయంగా స్కూళ్లకు, హాస్టళ్లకు నాణ్యత లేని బియ్యం సరఫరా చేసినట్టు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. దీంతో ఎనిమిది జిల్లాలకు చెందిన మిల్లర్లు నిర్దేశించిన గడువులోగా బియ్యాన్ని మార్చాలని ఆదేశించారు. ఉద్యోగులు, మిల్లర్లు తమ విధులను జాగ్రత్తగా నిర్వహించాలనీ, వారిపై నిఘా ఉంటుందని హెచ్చరించారు. ఎలాంటి ఒత్తిడి, ప్రభావానికి గురి కాకుండా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలలు, సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఉంటే పేద విద్యార్థులు పౌష్టికాహార లోపం, రక్తహీనతకు గురి కాకుండా బలవర్ధకమైన సన్నబియ్యం సరఫరా చేయాలనేది సీఎం కేసీఆర్ లక్ష్యమని తెలిపారు. విద్యార్థుల్లో పౌష్టికాహారలోపాన్ని నివారించేందుకు వీలుగా ప్రభుత్వం ఏడాదికి 65 వేల మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని సేకరిస్తున్నదని ఆయన తెలిపారు.

హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

29న చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయండి

- తెలంగాణ ఆల్ హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి యాటాల సోమన్న

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి, సంక్షేమ పథకాలను అమలు చేయాలని, 55ఏండ్ల వయస్సుపైబడిన హమాలీలకు నెలకు రూ.6వేల పెన్షన్ ఇవ్వాలని తెలంగాణ ఆల్ హమాలీ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి యాటాల సోమన్న డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని మలక్‌పేట్ మార్కెట్ హమాలీ వర్కర్స్ సమావేశం సీఐటీయూ నాయకులు శ్రావణ్‌కుమార్ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా సోమన్న మాట్లాడుతూ ప్రభుత్వ గోదాముల్లో పని చేస్తున్న సివిల్ సప్లైస్, జీసీసీ, బేవరేజెస్, ఎఫ్‌సీఐ హమాలీలను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, ఐఎల్ఓ తీర్మానం ప్రకారం 50 కేజీల బరువులను నిషేధించాలని అన్నారు. హమాలీలందరికీ ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ వంటి చట్టబద్ద హక్కుల అమలు, ఐకేపీ హమాలీలకు ప్రభుత్వమే బిల్లులు చెల్లించాలని చెప్పారు. హమాలీల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 29న 'చలో హైదరాబాద్' లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో హమాలీలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఐదు లక్షల మంది హమాలీలు పనిచేస్తున్నారని, ప్రయివేటు, ప్రభుత్వ సంస్థలు, సివిల్ సప్లై, ఎఫ్‌సీఐ, జీసీసీ, మార్కెట్ యార్డ్, కోల్డ్ స్టోరేజ్, సిమెంట్ గోదాములు, కూరగాయలు, పండ్ల మార్కెట్, రైస్, ఆయిల్, దాల్ మిల్స్, కంకర క్వారీలు, రైల్వే, ఆర్టీసీ స్టోర్ వర్కర్స్, ఐకేపీ హమాలీలు, బేవరేజ్ హమాలీలు అనేక రంగాల్లో పనిచేస్తున్న వారికి పని భద్రత వంటి చట్టబద్ధహక్కులు అమలు చేయడంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వివరించారు. హమాలీల రక్షణ కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలనే డిమాండ్లపై నిర్వహిస్తున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమంలో హమాలీలంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జి.నరసింహ, గోపాల్, వెంకటేశ్, చిన్న, జి.ఆంజనేయులు, రామకష్ణ, జి.మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

దుబాయ్‌లో జరిగే ప్రపంచ ఏఐ షోకు కేటీఆర్

మరో ప్రతిష్టాత్మక ఆహ్వానం అందుకున్న మంత్రి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారకరామారావుకి మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఆహ్వానం లభించింది. దుబాయ్‌లో జరిగే ప్రపంచ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)షోకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని నిర్వాహకులు ఆయన్ను ఆహ్వానించారు. జూన్ 7, 8వ తేదీల్లో దుబాయ్‌లోని జుమేరా ఎమిరేట్స్ టవర్‌లో ఈ ప్రదర్శన జరగనుంది. మంత్రి కేటీఆర్ సారథ్యంలో తెలంగాణ ఐటీ, ఐటీ అనుబంధ రంగాల్లో అద్భుతమైన పురోగతి సాధించిందని, ఇలాంటి నాయకులు తమ సమావేశంలో పాల్గొనడం వల్ల దానికి ఎంతో విలువ చేకూరుతుందని నిర్వాహకులు తమ ఆహ్వానంలో పేర్కొన్నారు. దుబాయిలో జరిగే ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రతినిధులతో పాటు ఆరోగ్యరంగం, రిటైల్ రంగం, మ్యానుఫ్యాక్చరింగ్, బ్యాంకింగ్ ఫైనాన్స్, రియల్ ఎస్టేట్, రవాణా వంటి అనేక రంగాలకు చెందిన కంపెనీల ప్రతినిధులూ ఆ సమావేశంలో పాల్గొనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో ఇప్పటికే విజయవంతమైన అనుభవాలను, వాటి ఫలితాలను ఈ సమావేశంలో ప్రదర్శిస్తారు. దుబాయ్‌కి అత్యంత కీలకమైన ఈ రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా కలిగే ప్రయోజనాలను ప్రాథమికంగా చర్చించడంతోపాటు, వివిధ దేశాల నుంచి పాల్గొంటున్న ప్రతినిధుల తమ అనుభవాలను వివరిస్తారని నిర్వాహకులు తెలిపారు. కేటీఆర్ హాజరు కావడమనేది దుబాయ్‌లో ఉన్న భారతదేశ, ముఖ్యంగా తెలుగు ప్రవాస భారతీయ టెక్నాలజీ రంగ నిపుణులకు ఎంతో స్ఫూర్తినిస్తుందని తెలిపారు.

బీజేపీ విధానాలే మహారాష్ట్ర వెనుకబాటుకు కారణం : బీఆర్ఎస్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీజేపీ అనుసరిస్తున్న తిరోగమన విధానాలే మహారాష్ట్ర వెనుకబాటుకు కారణమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి విమర్శించారు. మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీది ప్రయివేటైజేషన్ అయితే, బీఆర్ఎస్‌ది నేషనలైజేషన్ పాలసీ అని తెలిపారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే బీజేపీ విక్రయించిన సంస్థలన్నింటినీ తిరిగి ప్రభుత్వపరం చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ మోడల్ అంటే 450 పథకాల రాజపత్రమని చెప్పారు. గుజరాత్ మోడల్ ఒక బూటకమనీ, ప్రధాని మోడీవి గోల్‌మాల్ మాటలని విమర్శించారు. 24న ఔరంగాబాద్‌లో నిర్వహించే సభ చరిత్ర సృష్టిస్తుందనీ, పార్టీలో పెద్ద ఎత్తున చేరికలుంటాయని వెల్లడించారు.

బీఆర్ఎస్‌లో పటేల్ పార్టీ విలీనం

మహారాష్ట్ర ప్రదేశ్ సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ పార్టీని బీఆర్ఎస్‌లో విలీనం చేయాలని తీసుకున్న నిర్ణయాన్ని జీవన్ రెడ్డి స్వాగతించారు. ఈ మేరకు శనివారం ఆయనతో ఆ పార్టీ అధ్యక్షులు బాబా సాహెబ్ షెల్కే, ఇతర కీలక నేతలు చర్చించి విలీన నిర్ణయాన్ని ప్రకటించారు.తెలంగాణ మోడల్‌ను మహారాష్ట్రలోనూ అమలు చేయాలంటే కేసీఆర్ నాయకత్వంలో పని చేయడమే ఉత్తమమనే ఉద్దేశంతోనే విలీనం నిర్ణయం తీసుకున్నట్టు షెల్కే తెలిపారు.

నవచిత్రం

మహిమాన్విత మంత్రం.. నీ నామం



ప్రభాస్

అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకుని అందరికీ శ్రేయస్సులు కలగాలని కోరుకుంటూ, 'ఆదిపురుష్' చిత్రం నుంచి జై శ్రీరామ్ నామం ప్రతిధ్వనించేలా ఒక లిరికల్ ఆడియో క్లిప్‌ను విడుదల చేసింది చిత్ర బృందం. సంగీత ద్వయం అజయ్-అతుల్ స్వరపరిచిన ఈ గీతాన్ని హిందీ, తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ భాషల్లో విడుదల చేశారు.

ఈ పాట సినిమాకే కాకుండా తరతరాలు వినిపించేలా.. జై శ్రీరామ్ అనే నినాదం మారుమ్రోగేలా ఉండబోతోంది. ఈ ట్రాక్‌కు అనుగుణంగా రాఘవ్‌గా ప్రభాస్ అద్భుతమైన పోస్టర్ రిలీజ్ చేశారు.

ఈ పోస్టర్‌లో శ్రీ రాముడు శౌర్యం, శక్తి, బలం కనిపిస్తోంది. రాఘవుని సద్గుణం, దాతృత్వం, బలమైన పాత్ర స్వరూపం కనిపిస్తున్నాయి. తండ్రి వాక్కుకు కట్టుబడి, ఒకే బాణం ఒకే భార్య అనే మాటకు ఆదర్శంగా నిలిచిన శ్రీ రామ లక్షణాలకు ప్రతీకగా ఈ పోస్టర్ కనిపిస్తోంది.

ఈ చిత్రాన్ని టి-సిరీస్, భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్, ఓం రౌత్, సుతారియా సుటారియా, రెట్రోఫైల్స్ రాజేష్ నాయర్‌తో పాటు యు వి క్రియేషన్స్‌కు చెందిన వంశీ, ప్రమోద్ నిర్మించారు. జూన్ 16న ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది.

యూనిక్ పాయింట్‌తో ఉగ్రం



అల్లరి నరేష్, విజయ్


'నాంది' వంటి విజయవంతమైన చిత్రం తర్వాత అల్లరి నరేష్, విజయ్ కనకమేడల కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం 'ఉగ్రం'. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మించారు. మే 5న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ని ఖమ్మంలో గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా హీరో అల్లరి నరేష్ మాట్లాడుతూ, "ఉగ్రం' నా సినిమా షష్టిపూర్తి. 60వ చిత్రం (నవ్వుతూ). 'మహర్షి' తర్వాత 'నాంది' కథ చెప్పారు. నాపై కామెడీ ఇమేజ్ ఉంది కదా చూస్తారా? అని దర్శకుడిని అడిగాను. రిస్క్ చేద్దామన్నారు. ఆ రిస్క్ పే చేసింది. మళ్ళీ 'ఉగ్రం' కథ చెప్పినపుడు ఇంత యాక్షన్ సీక్వెన్స్‌లు చూస్తారా? అంటే నమ్మండి సార్ అన్నాడు. 'నాంది'లో అండర్ ట్రయిల్ ఖైదీలు గురించి చెప్పాం. ఇందులో మిస్సింగ్ కేసులు గురించి చెప్పాం. చాలా రీసెర్చ్ చేసిన కథ ఇది. నాంది కంటే పదిరెట్లు ఇంటెన్స్ ఉంటుంది' అని అన్నారు. 'ఉగ్రం, నాందికి పదిరెట్లు ఉంటుంది. 'నాంది'లానే ఇందులో కూడా ఒక సోషల్ కాజ్ ఉంటుంది. మిస్సింగ్ అనే యూనిక్ పాయింట్‌ని తీసుకొని ఈ కథ చేశాం. ఇందులో ఎమోషన్ ఉగ్ర రూపంలో ఉంటుంది. యాక్షన్ దద్దరిల్లుతుంది' అని దర్శకుడు విజయ్ కనకమేడల చెప్పారు.

ఈ ఏజెంట్ వెరీ.. వైల్డ్



అఖిల్ అక్కినేని, సురేందర్ రెడ్డి కలయికలో రూపొందిన స్పై యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఏజెంట్'. ఈనెల 28న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధంగా ఉంది. ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్, సురేందర్2 సినిమా పతాకాలపై రామబ్రహ్మం సుంకర నిర్మించారు. ఈ సినిమా గురించి హీరో అఖిల్ అక్కినేని మీడియాతో ముచ్చటించారు. 'ఒక కొత్త తరహా యాక్షన్ సినిమాతో ఫ్రెష్ కంటెంట్‌ని ఇవ్వాలనే ప్రయత్నంతో స్పై జోనర్‌ని ఎంపిక చేసుకోవడంతో 'ఏజెంట్' జర్నీ మొదలైయింది. ఈ సినిమా జోనర్ నాకు బాగా నచ్చేసింది. అయితే దర్శకుడు సురేందర్‌రెడ్డి నెరేట్ చేసినప్పుడు ఇంత క్రేజీగా చేయగలుగుతానా లేదా అనేది డౌట్. ఎందుకంటే ఇంతకుముందు ఇలాంటింది చేయలేదు. ఈ పాత్ర కోతిలానే బిహేవ్ చేస్తుంది. ప్రతి క్షణం ఒక హైలో మాట్లాడాలి. అది నాకు చాలా కష్టం అనిపించింది. ఎందుకంటే.. వ్యక్తిగతంగా నేను కొంచెం సిగ్గుపడతాను. మమ్ముట్టి లాంటి పెద్ద స్టార్‌ని ఎందుకు ఇందులో తీసుకున్నామో విడుదల తర్వాత మీరే చెప్తారు. ఇది కేవలం ఒక్క హీరో వైపు నుంచే నడిచే సినిమా కాదు. మూడు పాత్రలు మధ్య ఇంటెన్స్ డ్రామా జరిగే సినిమా ఇది. మమ్ముట్టి పాత్రతో నేను ప్రేమలో పడిపోయాను. అంత అద్భుతంగా వచ్చింది. కథ ఓ కొత్త ప్రపంచంలో జరుగుంటుంది. కంప్లీట్‌గా న్యూ సెటప్. ఖచ్చితంగా ఈ సినిమా ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతిని ఇస్తుంది. ఇందులో నా పాత్ర పేరు రిక్కీ. తను చాలా వైల్డ్. ఎవరూ ఊహించని విధంగా డీల్ చేస్తాడు. ఏజెంట్.. వెరీ వైల్డ్ (నవ్వుతూ). అయితే స్పై జోనర్ తీసుకున్నాం కాబట్టి కథ సీరియస్‌గా సాగుతుంది. కానీ మాస్ ఆడియన్స్‌కి నచ్చేలా యంగేజింగ్ ఎంటర్‌టైనింగ్‌గా ఉండటానికి స్క్రిప్ట్ దశలోనే చాలా వర్క్ చేశాం. స్పై అనే వాడు నీడలో ఉంటూ అందరితో బ్లెండ్ అయిపోయి ఉండాలి. కానీ ఈ ఏజెంట్ కంప్లీట్ రివర్స్. అన్ ప్రెడిక్ట్ వైల్డ్ మంకీలా ఉంటాడు. సెపరేట్ కామెడీ స్పై రన్‌ని డిస్టర్బ్ చేస్తుంది. అందుకే హ్యూమర్‌ని కథా నాయకుడి పాత్రలోనే ఉండేట్లు చూసుకున్నాం. అది చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఏప్రిల్ 28న .. పోకిరి, బాహుబలి 2 .. ఇలా చాలా ఇండస్ట్రీ హిట్లు ఉన్నాయి. అదే డేట్‌కె నా సినిమా కూడా రావడం చాలా ఆనందంగా ఉంది. 'పోకిరి, బాహుబలి 2' నా ఆల్ టైం ఫేవరేట్ మూవీస్. వ్యక్తిగతంగా నాకు పెద్దగా సెంటిమెంట్లు ఉండవు. కానీ ఇది చెప్పినపుడు ఇదొక బ్లెస్సింగ్‌లానే భావించాను. హిపాప్ తమిళది బ్రిలియంట్ టీం. ఏదో కొత్తగా ఇవ్వాలని తపన పడే కంపోజర్స్. ఆది, జీవా చాలా క్రేజీ మ్యూజిక్ ఇచ్చారు. ఇందులో బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా పాటలో నటించారు. ఈ పాట క్లైమాక్స్‌లో వస్తుంది. నాయిక సాక్షి అద్భుతంగా నటించింది.

తీవ్ర అస్వస్థత



శరత్ బాబు

సీనియర్ నటుడు శరత్‌బాబు గత కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నారు. దీనికోసమై బెంగళూరులో చికిత్స పొందుతున్నారు. అయితే శుక్రవారం ఆయన తీవ్ర అస్వస్థతకు గురికావడంతో మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్ గచ్చిబౌలి లోని ఏఐజీ ఆస్పత్రిలో చేర్పించారు. సత్వర చికిత్స అందించిన వైద్యులు ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిపారు.

మెప్పించే విద్యార్థి



చేతన్ చీను

చేతన్ చీను, బన్నీవోక్స్ జంటగా నటించిన చిత్రం 'విద్యార్థి'. మధు మాదాసు దర్శకత్వంలో మహాస్ క్రియేషన్స్ పతాకంపై ఆళ్ల వెంకట్ నిర్మిస్తున్నారు. ఈ చిత్ర కాన్సెప్ట్ పోస్టర్‌ను హైదరాబాద్‌లో విడుదల చేశారు. నిర్మాత డి.ఎస్.రావు ఆధ్వర్యంలో ఈ నెల 29న సినిమాను విడుదల చేయనున్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డి.ఎస్.రావు మాట్లాడుతూ, 'చేతన్ చెబితే, నేను ఈ సినిమా చూశాను. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది. దర్శకుడికిది తొలి చిత్రం అయినా చాలా లావీష్‌గా రూపొందించారు. చేతన్‌కు ఇండస్ట్రీలో బ్యాగ్రౌండ్ ఒకటే లేదు కానీ హీరోకి ఉండాల్సిన అన్ని క్వాలిటీస్ అతనిలో ఉన్నాయి. మంచి స్టార్ అవుతాడు. ఈ సినిమా మీద నమ్మకంతో విడుదల చేయడానికి ముందుకొచ్చాను' అని అన్నారు. 'దర్శకుడిగా నాకు తొలి చిత్రమిది. చాలాకష్టపడి తీశాం. ఎక్కడా బ్రేక్ లేకుండా సింగిల్ షెడ్యూల్‌లో సినిమా పూర్తి చేశాం. అయితే కరోనా వల్ల సినిమా విడుదల ఆలస్యమైంది. డి.ఎస్.రావు సినిమా చూసి విడుదల చేయడానికి ముందుకు రావడం చాలా ఆనందంగా ఉంది' అని దర్శకుడు మధు మాదాసు చెప్పారు. హీరో చేతను చీను మాట్లాడుతూ, 'ఈ సినిమా విడుదలకు మా నిర్మాతలు పడుతున్న కష్టం చూసి డి.ఎస్.రావుకి మా సినిమా చూపించాను. ఆయనకు నచ్చి నేనే రిలీజ్ చేస్తానన్నారు. ఈ చిత్రం మా అందరి తలరాతను మారుస్తుందనే నమ్మకం ఉంది. ప్రతి ప్రాంతంలోనూ జరిగే ఓ అంశాన్ని తీసుకుని దర్శకుడు ఈ కథ రాశారు. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది' అని తెలిపారు. 'త్వరలో ప్రీరిలీజ్ వేడుక నిర్వహిస్తాం. ఈ నెల 29న చిత్రాన్ని విడుదల చేస్తున్నాం' అని నిర్మాత ఆళ్ళ వెంకట్ అన్నారు.

ఓ సెల్ఫిష్ కుర్రాడి కథ



ఇవానా, ఆశిష్ రెడ్డి

తొలి చిత్రం 'రౌడీ బాయ్స్'తో ఆకట్టుకున్న యువ హీరో ఆశిష్ రెడ్డి ఇప్పుడు యూత్ ఫుల్‌మాస్ ఎంటర్‌టైనర్ 'సెల్ఫిష్'తో వస్తున్నాడు. నూతన దర్శకుడు కాశీ విశాల్ దర్శకత్వంలో సుకుమార్ రైటింగ్స్, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకాలపై నిర్మాత దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న చిత్రమిది. ఇందులో ఆశిష్ మాస్ క్యారెక్టర్‌లో నటిస్తున్నాడు. గతంలో విడుదల చేసిన పోస్టర్‌లలో రెక్లెస్ యాటిట్యూడ్ చూపించాడు. ఇప్పుడు ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్న ఇవానాను చైత్ర పాత్రలో పరిచయం చేశారు మేకర్స్. ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో ఇవానా ఏదో అందోళనలో ఉన్నట్లుగా కనిపిస్తుండగా, ఆశిష్ ఆమెని తదేకంగా చూస్తునట్లుగా ఉన్నారు. ఐడీ కార్డ్ సూచించినట్లుగా ఇవానా ఇందులో ఫైనాన్సియల్ ఎనలిస్ట్‌గా కనిపిస్తుంది. రిజర్వ్ ఫర్ మై లవ్ అనే గూగుల్ సెర్చ్ స్పేస్ కనిపిస్తోంది. హైదరాబాద్‌లోని పాతబస్తీలో జరిగే కథ ఇది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.




నీలో నేను గాజునైపోనా

నీ చేయి పట్టుకొని నీతో కలిసి ప్రయాణించగా....
కాలి మువ్వనైపోనా
నీ ప్రతీ అడుగులోనూ నీ తోడు నిలవగా.....
ముక్కెరనైపోనా
నును వెచ్చని నీ శ్వాసను ముద్దాడగా...
తాళిబొట్టునైపోనా .....
నీ కంఠంబు కౌగిలించి మెడపై
అల్లరిగా ముద్దు పెట్టగా....
కమరునైపోనా
నీ నడుమును చుట్టుకుని పసిపాపలా నిదురించగా...
చీరనైపోనా
నీ ప్రతీ అణువణువు నాకే సొంతమని
నాలో దాచుకొనగా....
శ్వాసనైపోనా
నేను లేని నీవు శూన్యమని నిరూపించగా.......!!!

- ఎం. కురుమయ్యయాదవ్,

బతకగలిగితే సుఖవంతమైన డాలర్ జీవితం... కానీ సినిమా పిచ్చి ఫ్లైట్ ఎక్కించి ఫిల్మ్ నగర్ వీధులవైపు నడిపించింది. అవకాశాలు వెతకడం కాదు. మనకు మనమే సృష్టించుకోవాలని 16 నిమిషాల నిడివిగల చిన్న షార్ట్ ఫిల్మ్ తీశాడు. ఆ ఫిల్మ్ మేకింగ్ స్కిల్ కి ప్రపంచం మొత్తం ఫిదా అయ్యింది. సామాన్యుల నుంచి సెలబ్రిటీల దాకా అభినంధనల వెల్లువేత్తింది. RRR కంటే ముందే తెలుగువారిని ఆస్కార్ బరిలో దింపిన 'మనసానమః' షార్ట్ ఫిల్మ్ తీసిన దర్శకుడు దీపక్ రెడ్డి బుడమలతో నేటి జోష్...





విరాజ్ అశ్విన్ (మనసానమః హీరో) : కె.ఎ. మార్తాండ్, మార్తాండ వెంకటేష్ నాకు తాత మామయ్యా అవుతారు. సినిమాలలోకి వెళ్ళాలని ఉండేవాది. ఆ టైములో దీపక్ ఒక షార్ట్ ఫిల్మ్ చేద్దాం అని అప్రోచ్ అయ్యాడు. అప్పటికే ఒక సినిమా చేశాను. ఈ స్క్రిప్ట్ నచ్చి మనసానమః చేశాను. దీని వల్ల నాకు మంచి గుర్తింపు వచ్చింది. ఇప్పుడు నాలుగు పెద్ద సినిమాలు చెయ్యబోతున్నా.



దిషికా చందీర్ (హీరోయిన్) : ఈ షార్ట్ ఫిల్మ్ చెయ్యడం నాకు చాలా చాలెంజింగ్ గా ఉండేది. చైత్ర క్యారెక్టర్ తో చాలా కనెక్ట్ అయ్యా. ఈ మనసానమః ద్వారా నాకు హీరోయిన్ గా చాలా అవకాశాలు వస్తున్నాయి. ఆస్కార్ దాకా వెళ్ళడం చాలా సంతోషంగా అనిపించింది.

ఆస్కార్ నామినేటెడ్ తెలుగు షార్ట్ ఫిల్మ్

సాధారణంగా ఇక్కడి నుంచి విదేశాలకు వెళ్తుంటే మీరు అక్కడి నుంచి సినిమాల కోసం ఇక్కడికి రాగలిగినంత సినిమా పిచ్చి ఎలా ఏర్పడింది మీలో?

వాస్తవానికి అందరిలా నేను కూడా ఇక్కడి నుంచి వెళ్ళాలని వెళ్ళినవాడినే (నవ్వుతూ...). కానీ అక్కడికి వెళ్ళాకా తిరిగి రావడానికి ఎవరికైనా చాలా సంకల్ప శక్తి ఉండాలి. అంతలా అక్కడి సుఖానికి అలవాటు పడిపోతారు. నిజానికి నాది కష్టాన్ని ప్రేమించే మనస్తత్వం. అందుకే అక్కడి నుంచే సినిమాల పిచ్చితో కంఫర్టబుల్ లైఫ్ ని వదిలేసొచ్చా. ఈ సినిమా యావ స్కూల్ దశ నుంచే ఉండేది. మా మేనమామ (రవి ప్రకాష్ రెడ్డి) సినిమాలకి ఎక్కువగా తీసుకెళ్ళేవారు. అప్పటికి సినిమా గురించి నాకు పెద్దగా యేమీ తెలియకపోయినా ఒక విధమైన మోజు ఉండేది. కాలేజ్ కి వచ్చేటప్పటికి 'సినిమా అంటే ఏంటి?.. క్రాఫ్ట్స్ ఎలా ఉంటాయి" అన్నదానిపై ఒక అవగాహన ఏర్పడింది. అప్పుడప్పుడే ఇంటర్నెట్ రావడం ప్రపంచ సినిమా పరిచయం కూడా బాగా కలిసొచ్చింది. నాలో నాకే తెలియకుండానే ఎక్కడో సినిమా మీద ప్రేమ ఏర్పడుతూ వచ్చింది. అందుకే పై చదువులకి, ఉద్యోగానికి అంటూ అమెరికాకి వెళ్ళినా తిరిగి నన్ను ఇండస్ట్రీకి గుంజుకొచ్చేలా చేసింది.

మీ కుటుంబ నేపథ్యం...?

మాది కర్నూల్. నాన్న బుడమల రాం మోహన్ రెడ్డి బాల్యంలోనే రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. అప్పటి నుంచి అమ్మ పేరం ఇందిరా దేవి ఇంగ్లీషు లెక్చరర్‌గా పనిచేస్తూ నన్ను అన్నని(ధీరజ్ రెడ్డి) చదివించింది. అమ్మ మంచి రచయిత్రి. 'ఆ నీలి మబ్బుల్లో', 'అక్షయమైన వెన్నెల', 'మనోవల్మీకం' వంటి నవలలు కూడా రాశారు. ఆవిడ నుంచే నాకు కొద్దిగా క్రియేటివ్ పరంగా జెనిటిక్ అయివుండాలి. ఓవరాల్ గా చదువుని ఆస్తిగా భావించే ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబం మాది.

'సినిమాల్లోకి వెళ్తా' అన్న నిర్ణయాన్ని మీ కుటుంబం ఎలా స్వీకరించింది?

సినిమాలు చూడడమే తప్పుగా భావించేవారు. అలాంటిది 'సినిమాల్లోకి వెళ్తాను' అంటే మీరు ఊహించుకోవచ్చు ఇక. మొదట్లో అమ్మ తిట్టేది. వీడెక్కడ చెడిపోతాడో అని. ముందు చదువు తరువాత చూద్దామంది. అమ్మని ఎందుకు బాధపెట్టడమని చదువైపోయాక వెళ్దాం అనుకొన్న. క్యాంపస్ ప్లేస్మెంట్స్ లో భాగంగా హైదరాబాదులో ఉద్యోగం వచ్చింది. కొద్ది రోజులు ఇక్కడే ఉన్నా. నా మొదటి షార్ట్ ఫిల్మ్ 'WTF' ఇక్కడ ఉన్నప్పుడే చేశా. ఉద్యోగ రీత్యా అమెరికాకు వెళ్ళాల్సి వచ్చింది. అయినా సినిమా నన్ను వదల్లేదు. కానీ తప్పదు అన్నట్టు వర్క్‌లో ఉండిపోయేవాడిని. అనుకోకుండానే 'ఫిదా' మూవీ అమెరికా షెడ్యూల్‌కి వర్క్ చేసే అవకాశం వచ్చింది. ఆ క్షణం నాకు అర్థం అయ్యింది. సినిమానే నా జీవితం అని అమ్మకు కూడా చెప్పాపెట్టకుండా ఇండియాకు వచ్చేశా. తిరిగి రాగానే చుట్టాలందరూ 'నీకేమైనా పిచ్చా..' అన్నారు. అమ్మ కూడా 'ఎందుకురా మనకు ఈ సినిమా గోల... అదింకా నీలో పోలేదా రా' అన్నది. నాకు ఇందులోనే ఆనందం ఉందన్నా. చివరకు నా ఇష్టాన్ని అమ్మ గౌరవించింది.

మిమ్మల్ని దర్శకత్వంవైపు ఆకర్షితుల్ని చేసిన దర్శకులు ఎవరు?

సుకుమార్ గారు. ముఖ్యంగా ఆర్య సినిమా. అప్పటివరకు ఉన్న సినిమా రైటింగ్ మెథడ్ ని ఒక్కసారికి చేంజ్ చేసేలా సినిమా తీసారు. రాజమౌళి, గౌతమ్ మీనన్ ('మనసానమః'ని తమిళ్‌లో తనే డబ్ చేశారు) వెట్రి మారన్, రాజ్ కుమార్ హిరానీ, హిచ్ కాక్, స్పీల్బర్గ్, డేవిడ్ లీచ్, జేమ్స్ కామెరూన్.. ఇలా లిస్టు చాలా పెద్దగానే ఉంది.

తెర మీద సాగే 'తిరోగమన కథనం' (REVERSE SCREEN PLAY) కోసం ఏవిధమైన జాగ్రత్తలు తీసుకొన్నారు?

'ఎవరు తియ్యనిది తీయాలి. నార్మల్‌గా తీస్తే సినిమా అవకాశాలు రావు' అన్నదే మెయిన్ థీం. అలా అని ప్రయోగాలు చెయ్యకూడదు. రెగ్యులర్ గా ఉండే ప్రేమ కథనే కొత్త స్క్రీన్ ప్రెజెన్స్ చేద్దాం అన్న ఆలోచనలోనే ఈ కథ పుట్టింది.



కథకంటే కథనం ప్రధానమైన లఘు చిత్రం 'మనసానమః'. ముందుగా మీరనుకొన్నది కథా? కథనమా?

కథనమే ముందు అనుకొన్న. అందరికి తెలిసిన ప్రేమకథనే కొత్త కోణంలో చెప్పాలి అన్న ఇంటెన్సిటిలో నుంచి రివర్స్ లో కథ చెప్పా. ఈ షార్ట్ ఫిల్మ్ చెయ్యడానికి ఒక ఏడాది పట్టింది. కథ కేవలం రెండు రోజుల్లో రాసేశా. నటీనటులు, కాస్టుమ్స్, లోకెషన్స్ ఎంపికల్లో చాలా టైం తీసుకోవాల్సి వచ్చింది. అది తప్పితే మిగిలినవన్నీ చాలా తక్కువ రోజుల్లోనే ముగించాం. షూటింగ్ చేసింది కేవలం 5 రోజులే.

ఒక లఘు చిత్రానికి అంత బడ్జెట్ పెట్టడం వెనుకున్న మీ నమ్మకం ఏంటి?

'మనసానమః'కు అయిన బడ్జెట్ 5 లక్షలు. ప్రీ ప్రొడక్షన్‌లో అనుకొన్నది కేవలం 2 లక్షలే. మొదటిసారి అవ్వడంతో ప్రొడక్షన్ దగ్గర వృధాగా ఖర్చులు ఎక్కువయ్యాయి. 30 లక్షల్లో తీయ్యల్సిన షార్ట్ ఫిల్మ్ మేము చాలా తక్కువ బడ్జెట్‌లో తీసినట్టే. ఆ కథ ఆ బడ్జెట్ కోరుకొన్నది. అందుకే మేము ఖర్చు చెయ్యాల్సి వచ్చింది. నా ఫ్రెండ్స్ చాలామంది ఫ్రీ లాన్స్ గా వర్క్ చెయ్యడం కూడా బడ్జెట్ భారాన్ని తగ్గించింది. నాన్ కమర్షియల్ కోసం తీశాం.

షూటింగ్, ఎడిటింగ్ లలో ప్రత్యేకంగా వినియోగించిన సాంకేతికత?

అప్పటికి ఉన్న నార్మల్ సినిమా టెక్నాలజీనే వాడాము. కాకపోతే కొన్ని గ్రీన్ మ్యాట్ లో షఉట్ చేశాం. షార్ట్ ఫిల్మ్ కి ఇలా వాడడం కొత్తగా ఉండడం ద్వారా క్వాలిటీ హైగా కనిపిస్తుంది. ఎక్కడా లోకేషన్స్ ని రిపీట్ చెయ్యలేదు. మొత్తం 24 లోకేషన్స్ వాడాం. అంత తప్పితే ప్రత్యేకమైన టెక్నాలజీ అంటూ ఏమీ వాడలేదు.

వెయ్యికి దగ్గరగా అంతర్జాతీయ అవార్డులు రావడం పట్ల తెలుగు చిత్రసీమ స్పందన?

ఊహించనంత రెస్పాన్స్ వచ్చింది. చెయ్యాల్సిన దానికంటే ఎక్కువ సపోర్ట్ చేసింది. సురేష్ బాబు, సుకుమార్, క్రిష్, అడవి శేషు, హను రాఘవపూడి, సందీప్ కిషన్, రక్షిత్ శెట్టి, అనుష్క, రష్మిక మందన, విగ్నేష్ శివన్ మొదలైన పెద్ద పెద్ద సెలబ్రిటీస్ ఫోన్ చేసి మరి అభినందించారు. చూసిన నాన్ ఇండస్ట్రీ వ్యక్తుల నుంచి కూడా పెద్ద రెస్పాన్స్ వచ్చింది.



మీరు ప్రభాస్ వీరాభిమాని. రాబోవు కాలంలో మీ కాంబోలో సినిమాని మేము ఆశించొచ్చా?

ప్రభాస్‌కు చిన్నప్పటి నుండి డైహార్డ్ ఫ్యాన్. థియేటర్ దగ్గర కటౌట్లు, పూల, పాలాభిషేకాలు, జిందాబాద్లు... ఇవన్నీ చేసినవాడినే. ఇప్పుడు ఆయన యూనివర్సల్ స్టార్. ఆయనతో ఒక సినిమా చెయ్యాలని కలలు కనేవాళ్ళు చాలామందే ఉంటారు. నేను ఆ స్థాయికి చేరుకోవడానికి చాలా ప్రయాణం చెయ్యాలి. నన్ను నేను ప్రూవ్ చేసుకోవాలి. అలా జరిగిన నాడు తప్పకుండా ఉండొచ్చు. భవిష్యత్తుగా ముందే ఏమీ చెప్పలేం. ఇప్పటికైతే ఫ్యాన్ మాత్రమే.

ఈ ప్రయాణంలో "కెరియర్ నాశనం చేసుకొంటున్నావ్... ఆరు అంకెల జీతాన్ని, హాయిగా ఉండే జీవితాన్ని వదిలేసుకొంటున్నావ్... ఎందుకురా ఈ సినిమా కష్టాలు.." వంటివి ఎలా ఎదుర్కొన్నారు?

చాలామంది అంటూనే ఉంటారు. వీటిని నాకంటే మా అమ్మ ఎక్కువ ఫేస్ చేసింది. కొడుకుని పెంచడం రాలేదన్నవారు కూడా ఉన్నారు. వాళ్ళు అనుకొంటున్నా జీతం... పెళ్లి... పిల్లలు... సాయంత్రానికి ఇంటికి... ఇలాంటివి దాటి పోతున్నప్పుడు తప్పు చేస్తున్నట్టుగానే చూస్తారు. వాళ్ళు అన్నట్టు లక్ష జీతం వచ్చే ఉద్యోగం చేస్తే ఏంటి ప్రయోజనం? నాకు అది సంతోషాన్ని ఇవ్వదు. మనకు నచ్చింది చేస్తూ ఎందులో ఆనందం ఉందో అందులోనే కృషి చెయ్యాలి అని నమ్మాను. నేను తీసిన షార్ట్ ఫిల్మ్ చూసి నన్ను చాలా మంది మనసానమః దీపక్ అని గుర్తు పడుతారు. పెద్ద పెద్ద డైరెక్టర్లు నాతో మాట్లాడుతారు. అది చాలదా? ఇంతకు మించిన సంపాదన నాకు అవసరం లేదనిపించింది.

చిత్రసీమలో మొదటి అడుగు వేయడం కంటే రెండో అడుగు వెయ్యడంలోనే అసలు కష్టం ఉంటుందంటారు. మనసానమః తర్వాత కూడా ఇప్పటికీ అదే మానసిక దృఢత్వాన్ని కలిగి ఉన్నారా?

ఖచ్చితంగా. మనసానమః తీసి మూడు సంవత్సరాలు అయ్యింది. ఈ గ్యాప్ లో ఏదో సినిమా చేసెయ్యొచ్చు. కానీ అలా చెయ్యలేదు. దీనికంటే బెటర్ గా తీయ్యలన్న కమిట్మెంట్, కాన్ఫిడెంట్ గానే ఉన్నా. కాకపోతే సినిమా అనేపాటికి స్టార్, బడ్జెట్, ఆల్ సెక్షన్స్ ని ఆకట్టుకోవడం.. వంటివి ఉంటాయి. వాటిని డీల్ చెయ్యడానికి స్ట్రాంగ్ అవుతూ ఉండాలి. ఇదే జీవితం అంటూ వచ్చేసినవాడిని. ఎక్కడా ఆగిపోవడం లేదు.

ఆదరణ పొందిన లఘు చిత్రాల ద్వారా దర్శకులు అవుతున్న తరుణంలో మీకు ఏవిధమైన అవకాశాలు వస్తున్నాయి?

మొదటి షార్ట్ ఫిల్మ్ నుంచే అవకాశాలు వస్తున్నాయి. ఆర్‌జీవీ నా WTF షార్ట్ ఫిల్మ్ చూసి నన్ను ముంబాయి పిలిచి నువ్వెందుకు డైరెక్ట్ సినిమా చెయ్యకూడదు అన్నారు. పెద్ద పెద్ద నిర్మాతలు కూడా సినిమా ఆఫర్ చేశారు. కానీ నేనే కథ, కథకు తగ్గ కాంబినేషన్, అంటూ వేచి చూస్తున్న. తొందరలోనే ఒక స్టార్ తో. పెద్ద నిర్మాణ సంస్థ నుంచి సినిమా ప్రకటన ఉండబోతుంది.

రాబోవు యువ దర్శకులకు సూచించే సలహాలు ఏమైనా ఉన్నాయా?

సలహాలు ఇచ్చేంత లేదు మనకి. నా అనుభవం కొద్ది చెబితే ఆర్ట్-కమర్షియాలిటీని కలిపి సినిమా తీసేవాళ్ళకు గొప్ప అవకాశాలు వున్నాయి. యావరేజ్ గా బతకగలిగిన వాళ్ళు ఈ ఫీల్డ్ లోకి రాకపోవడమే మంచిది. హై రేంజ్ సక్సెస్ కోరుకోనేవాళ్ళు అంతే స్థాయి ఎఫర్ట్స్ తో రావాలి. క్లారిటీ విజన్, రైటింగ్ స్కిల్, ఎక్కడా ఆగకుండా ప్రయత్నించే మనస్తత్వం ఉంటే సక్సెస్ తప్పకుండా వస్తుంది.

'మనకెందుకు... వెనక్కి వెళ్లిపోదాం' అన్న డిఫెన్సులో ఎప్పుడూ పడలేదా? పడితే ఎలా బయటపడ్డారు?

చాలా సార్లు డిప్రెషన్‌కు లోనయ్యాను. అన్నీ వద్దనుకొని కావాలనే ఇందులోకి వచ్చాం. తిరిగి చేతగాని వాడిలా ఎందుకు వెనక్కి వెళ్ళడం. ఏదైనా ఇక్కడే ఉండి సాధిద్దాం అనుకొని నిలబడుతూ వచ్చా. ఉన్నది అమ్మ మాత్రమే. ఆవిడని మంచిగా చూసుకోవడం మాత్రమే కదా నా బాధ్యత. లక్కీగా పెళ్ళాం, పిల్లలంటూ బాదరబందీలు లేవు. (నవ్వుతూ...)

'మనసానమః' ద్వారా దీపక్ రెడ్డి సాధించింది ఏమిటని అడిగితే ఏం చెబుతారు?

నేను ఇప్పటికే ఏదో సాధించాను అనుకోను. ఈ షార్ట్ ఫిల్మ్ ద్వారా అంటే ఈ అవార్డులు, రికార్డులు పక్కన పెడితే. మంచి మనుషులను, గొప్ప గొప్ప వ్యక్తులతో పరిచయం, కొందరితో స్నేహం, నాకంటూ ఒక గుర్తింపు, కొత్త అవకాశాలు, తిరిగి చెల్లించలేనంత ప్రేమ.. ఇలా వీటన్నింటిని నేను సంపాధించాననే అనుకొంటాను.

దీపక్ రెడ్డి ఈ స్థితికి చేరుకోవడం వెనుక ఎవరెవరి సహాయసకారాలున్నాయి?

ఒకరు ఇద్దరూ కాదు. చాలామందే ఉన్నారు. నాకు ఫ్రీడం ఇచ్చిన నా కుటుంబం. ముఖ్యంగా మా అమ్మ. నేనుగాని మా అన్నగాని ఈ స్థితిలో ఉన్నామంటే అమ్మే కారణం. నాకంటూ ఒక గుర్తింపులేనప్పుడు నన్ను నమ్మి నాకోసం పనిచేయడానికి ముందుకు వచ్చిన నా ఫ్రెండ్స్. మనసానమఃకు మ్యూజిక్ చేసిన కామ్రాన్, కెమరామెన్ ఎదురోలు రాజు, ఆర్ట్ డైరెక్టర్ ప్రశాంతి చక్రవర్తి... నటులు విరాజ్ అశ్విన్, దిషిక చందీర్... అంతకుముందు నాతో వర్క్ చేసిన షార్ట్ ఫిలిమ్స్ టీం ఇలా చాలామందే ఉన్నారు. వాళ్ళకు ఒక్క రూపాయి ఇవ్వకపోయినా మనసానమఃతో కొద్దో గొప్పో గుర్తింపు తీసుకోచ్చాననే అనుకొంటున్నా. నేను రుణపడి పోయేలా సహకరించిన వ్యక్తులు చాలామందే ఉన్నారు. తప్పకుండా తీర్చుకోవాలి. నేర్చుకొంటా కూడా.

ఆస్కార్ షార్ట్ ఫిలిమ్స్‌కి మనసానమః నామినేట్ అయినప్పుడు మీకు కలిగిన భావన?

ఒక రోజు ఆస్కార్ అకాడమీ వాళ్ళ నుంచి అఫిసియాల్ మెయిల్ వచ్చింది. నిజంగా షాక్ అయ్యా. అంత దూరం వెళ్తుంది. షార్ట్ లిస్టు అవుతుంది అనుకోలేదు. చాలా ఆనందం కలిగించింది. మనకు బెంగాలీ, మలయాళం, అస్సాం వాళ్ళకున్నంత ఫిల్మ్ ఫెస్టివల్ కల్చర్ లేదు. తెలుగు నుంచి మా షార్ట్ ఫిల్మ్ వెళ్ళడం మాకు మంచి గుర్తింపే తీసుకొచ్చింది. 'మనసానమః' వరల్డ్ లోని అన్ని ఫిల్మ్ ఫెస్టివల్‌లో స్క్రీన్ అవ్వడం. అవార్డులు గెలవడం ఇలా ఒక ఏడాది అంతా జరుగుతూ ఉండేది. గిన్నిస్ బుక్ రికార్డ్ కూడా సాధించింది 'మనసానమః'. అందులో ఆస్కార్ షార్ట్ లిస్టు అవ్వడం స్పెషల్.

- బి. మదన్ మోహన్‌రెడ్డి, 9989894308

నిశ్చలం

ఓ సాయంత్రం
దిగులు నడకల్లో ఏ సముద్రాన్నో కళ్ళకు అప్పగిస్తావ్
ఎక్కిళ్ళు పడుతూ ఎండిపోయినా
ఎడారి గొంతుకలో ఓ ఎండమావి
రాత్రంతా ఓ రహదారిని నిర్మిస్తోంది
తెల్లరాకా కాలం చేర్చే తీరమేమిటో
ఆలోచించే తీరికే లేక
జీవితం మీద ఆశకున్న మొండిధైర్యం
ముంగిపు లెక్కలు వేయదు
కలవరింతలో తెల్లరడాన్ని కలగంటావ్
కొన్ని ఉదయాలు హృదయాన్ని దెబ్బతీస్తాయ్
కొన్ని ఉషోదయాలు జీవితం మీదున్న ఆశను
ఉరి తీస్తాయ్
కొన్నేమో ఊరటినిస్తాయ్ కొన్ని ఉరికిస్తాయ్
ఒక్కొక్కసారి ఉన్నపళంగా దేహాన్ని
ఖాళీ చేయలనుకుంటావ్
ఒక్కొక్కసారి అసలు ఏ బాధ ఉండదు
ఏ అలజడి లేని స్వప్నంలా ఓ నడివీధిలో
నిశ్చలంగా నిలబడతావు
ఆ నాలుగు కూడళ్ళ బాట నిన్ను నిందిస్తుంది
,పలకరిస్తుంది ప్రశ్నిస్తుంది
ఇప్పుడు జీవితం జవాబుదారు
నిలకడగా నిలబడిన
నాలుగు మాటలు మాత్రమే నీవంతు నిలబడతాయి



నిందిచడంలోని నీ వైపు నిలబడే
నినాదాన్ని వెతుక్కుంటావు
మెల్లిగా మౌనం మీద ఓ కోయిల వాలి
జీవితాన్ని వసంతం చేసుకోమంటుంది
చల్లగా ఓ చిరుగాలి వీస్తూ
తిమిరం చూట్టూ చేతులు అడ్డుపెట్టి దీపాన్ని
వెలిగించుకోమంటుంది
ఒక్కొక్కటిగా రోజులన్నింటికి రంగులేస్తావ్
నువ్వు
నిన్ను నిందించినవాళ్ళు
నిన్ను ప్రశ్నించినవాళ్ళు
నిన్ను పలకరించినవాళ్ళు
అంతా వొకే తాటిమీద సమూహంగా నడకసాగిస్తారు
ఈ జీవితయాత్రలో ఎంతమంది తాలుకా ముద్రలో
నిన్ను నిన్నుగా తీర్చిదిద్దుతాయ్
మనిషిగా అస్తిత్వపు అడుగులు దారితప్పకుండా
అడ్డుపడాల్సింది నువ్వే
నీకై
ఈ సమజానికై కొత్త గొంతుక విప్పుతావు
ఏదో ఒకరోజు కాలం నిన్ను ఏ కాకీకో అప్పగిస్తుంది
అందరు ఓ సమూహమై మళ్ళి పరామర్శిస్తారు
కాని నువ్వక్కడ ఉండవు ఏ పునరుజ్జీవ తాలుక
స్వప్నంలో మళ్ళి నిశ్చలంగా నిలబడతావు
ఇప్పుడు నీ ఆనవాళ్ళు మాత్రం
ఆ దారి చివరన శిలావిగ్రహమై నిలబడ్డ నిలవెత్తు
మాటాల మిగులుంటుంది..

- పి.సుష్మ, 9959705519